


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


# దక్షిణాది ప్రగతికి సమష్టిగా అడుగులు



- సమన్వయంతో కీలక ఆర్థిక శక్తిగా ఎదగాలి
- 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యసాధనకు 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలి
- కుప్పం మీదుగా మూడు రాష్ట్రాలను కలుపుతూ బుల్లెట్ రైలు కారిడార్ అభివృద్ధి అవసరం
- దక్షిణ గ్రిడ్ జాతీయ విద్యుత్ గ్రిడ్‌తో అనుసంధానం, సంయుక్త నైపుణ్యాభివృద్ధి వ్యవస్థ ఏర్పాటు చేయాలి
- ప్రత్యేక విపత్తు నిర్వహణ టాస్క్‌ఫోర్స్‌కు ప్రతిపాదన
- ఏపీ విభజన హామీల పరిష్కారంపై తక్షణ నిర్ణయం
- గోదావరి-కావేరి అనుసంధానంతో జలాల సద్వినియోగం
- 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రతిపాదనలు

*తమిళనాడు రాష్ట్రం మహాబలిపురంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అధ్యక్షతన జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దక్షిణాది రాష్ట్రాల ప్రగతి కి కీలక ప్రతిపాదనలు చేశారు. దక్షిణాది రాష్ట్రాలు కలసికట్టుగా ముందుకు సాగితే భారతదేశ అభివృద్ధికి మరింత బలమైన చోదకశక్తిగా నిలుస్తాయని తెలిపారు. 2047 నాటికి దక్షిణ భారత్ 10 ట్రిలియన్ డాలర్లకు పైగా ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని పిలుపునిచ్చారు. 24 అంశాలతో కూడిన అజెండాపై ఈ సమావే శంలో చర్చించారు. అలాగే ఏపీ పునర్విభజనకు సంబంధించి పెండింగ్ సమస్యలను ప్రస్తావించి తక్షణ నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలను కలుపుతూ కుప్పం మీదుగా బుల్లెట్ రైలు కారిడార్‌ను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. అమరావతి-బెంగళూరు-చెన్నై నగరాలను అనుసంధానించే ఈ మార్గం మూడు రాష్ట్రాల మధ్య ఆర్థిక కార్యకలాపాలకు మరింత ఊతం ఇస్తుందని వివరించారు. దక్షిణాది ప్రముఖ పుణ్యక్షేత్రాలను ఉత్తర భారతదేశంలోని ఆధ్యా త్మిక కేంద్రాలతో అనుసంధానిస్తూ ప్రత్యేక వారసత్వ, పర్యాటక, తీర్థ యాత్ర సర్క్యూట్ ఏర్పాటు చేయాలని సూచించారు. నీటి భద్రతకు గోదావరి-కావేరి అనుసంధాన ప్రతిపాదనను కేంద్రం ముందు ఉంచారు.*

2

## విద్యాహక్కు చట్టం కింద ప్రవేశాలు పెరిగాయి

- 2022-26 మధ్య 1,04,046 మందికి అవకాశం
- ప్రజాప్రభుత్వంలోనే ఎక్కువ మంది చేరికలు
- శాసనమండలిలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్



*ప్రజాప్రభుత్వంలో విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ప్రైవేటు పాఠ శాలల్లో విద్యాహక్కు చట్టం కింద ప్రవేశాలు పొందిన విద్యార్థుల సంఖ్యపై శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. 2022-23 నుంచి 2026-27 వరకు విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1,04,046 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు చెప్పారు. ప్రజాప్రభుత్వంలో 2024-25లో సుమారు 29 వేల మంది విద్యార్థులు, 2026-27 ఏడాదిలో 28,742 మందికి విద్యాహక్కు చట్టం కింద అడ్మిషన్లు లభించాయని వివరించారు.*

- వివరాలు 5 లో..

## ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియదా?

- మీ అవగాహన స్థాయి అలా ఉంది
- అసెంబ్లీలో చర్చకు రమ్మంటే పారిపోతారు
- జగన్‌రెడ్డికి మంత్రి నారా లోకేష్ కౌంటర్



*రాష్ట్రంలో నిర్వహించే పరీక్షల వ్యవస్థపై వైసీపీ అధినేత జగన్‌కు అవగాహన లేదని మంత్రి నారా లోకేష్ విమర్శించారు. జగన్‌రెడ్డి ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యలకు లోకేష్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఏపీపీఎస్సీ అంటే ఏమిటో, డీఎస్సీ అంటే ఏమిటో కూడా ఆయనకు తెలియదంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అధికారంలో ఉన్నప్పుడు డీఎస్సీ నిర్వహించలేకపోయారు.. ఇప్పుడు అసెంబ్లీలో చర్చకు రాకుండా పారిపోతున్నారంటూ చురకలంటించారు.*

5

## మత్స్యకారుల గల్లంతు ఘటనపై సీఎం చంద్రబాబు సమీక్ష

- ప్రతి బోటు, ప్రతి మత్స్యకారుడి వివరాలు నమోదు చేయాలి
- ఘటన తర్వాత స్పందించడం కంటే ముందే అప్రమత్తంగా ఉండాలి
- గాలింపు చర్యలు విస్తృతం చేయాలని ఆదేశం



*కోనసీమ జిల్లాలో చేపల వేటకు వెళ్లి ఏడుగురు మత్స్యకారులు గల్లంతైన ఘటనపై గురువారం మత్స్యశాఖ అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఘటన తర్వాత స్పందించడం కాకుండా ముందే జాగ్రతలు చేసుకుంటే సత్వరసాయం అందించగలమని స్పష్టం చేశారు. ప్రమాదాలను నివారించేలా ఎస్‌ఓపీ అమలుచేయాలని ఆదేశించారు. ప్రతి బోటు, ప్రతి మత్స్యకారుడి వివరాలు నమోదు చేయాలని సూచిస్తూ మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు విస్తృతం చేయాలని ఆదేశించారు.*

4

## చివరి తేదీ వరకు వేచి చూడొద్దు


- పంటల బీమా నమోదు చేసుకోవాలి
- రైతు చెల్లించాల్సిన ప్రీమియం స్వల్పమే
- అసెంబ్లీ వేదికగా మంత్రి అచ్చెన్న



*ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు పంటల బీమా నమోదు విషయంలో త్వరపడాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. పంటల బీమా నమోదుకు ఈ నెలాఖరు వరకే గడువు ఉన్నందున రైతులు ఆలస్యం చేయరాదని శాసనసభ వేదికగా పిలుపునిచ్చారు. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం వంటి పరిస్థితుల్లో రైతుకు ఆర్థిక రక్షణ కల్పించడంలో పంటల బీమా అత్యంత కీలకమని వివరించారు. రైతులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు.*

7

## వెలిగొండ ఫీడర్ కెనాల్ రెడీ



*పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్‌కు సంబంధించి నీటి తరలింపులో కీలకమైన ఫీడర్ కెనాల్ ఎట్టకేలకు సిద్ధమైంది. రూ.450 కోట్లతో చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. కొల్లంవాగు నుంచి టన్నెళ్ల ద్వారా వచ్చే నీరు కొత్తూరు వద్ద ఫీడర్ కెనాల్‌కు చేరి ఎటువంటి అవరోధం లేకుండా నల్లమల జలాశయంలోకి వెళ్లేందుకు మార్గం సుగమమైంది.*

5

చైతన్యరథం



# దక్షిణాది ప్రగతికి సమష్టిగా అడుగులు

- సమన్వయంతో కీలక ఆర్థిక శక్తిగా ఎదగాలి
- 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యసాధనకు 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలి
- కుప్పంమీదుగా మూడు రాష్ట్రాలను కలుపుతూ బుల్లెట్ రైలు కారిడార్‌ను అభివృద్ధి చేయాలి
- దక్షిణాది రాష్ట్రాల మౌలికవసతులకు ప్రతిపాదనలు
- దక్షిణ గ్రిడ్ జాతీయ విద్యుత్ గ్రిడ్‌తో అనుసంధానం, సంయుక్త నైపుణ్యాభివృద్ధి వ్యవస్థ ఏర్పాటు చేయాలి
- ప్రత్యేక విపత్తు నిర్వహణ టాస్క్‌ఫోర్స్‌కు ప్రతిపాదన
- ఏపీ విభజన హామీల పరిష్కారంపై తక్షణ నిర్ణయం
- గోదావరి-కావేరి అనుసంధానంతో జలాల సద్వినియోగం
- 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సూచనలు, వినతులు




మహాబలిపురం/చెన్నై(చైతన్యరథం): రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను పరస్పర సహకారం, సమన్వయంతో పరిష్కరించుకోవాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. దక్షిణాది రాష్ట్రాలు కలసి కట్టుగా ముందుకు సాగితే భారతదేశ అభివృద్ధికి మరింత బలమైన చోదకశక్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. 2047 నాటికి దక్షిణ భారత్ 10 ట్రిలియన్ డాలర్లకు పైగా ఆర్థిక వ్యవస్థగా ఎదిగే సామర్థ్యం ఉందన్నారు. తమిళనాడులోని మహాబలిపురంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అధ్యక్షతన జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో చంద్రబాబు ప్రసంగించారు. 24అంశాలతో కూడిన ఎజెండాపై సమావేశంలో చర్చించారు. ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల సమగ్ర అభివృద్ధి గురించి తన ప్రసంగంలో ప్రస్తావించారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం సాధించటమే లక్ష్యమని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని సూచించారు. ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలను కలుపుతూ కుప్పం మీదుగా బుల్లెట్ రైలు కారిడార్‌ను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. అమరావతి–బెంగళూరు–చెన్నై నగరాలను అనుసంధానించే ఈ మార్గం మూడు రాష్ట్రాల మధ్య ఆర్థిక కార్యకలాపాలకు మరింత ఊతం ఇస్తుందని వివ రించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రై పోర్టుల ఏర్పాటు, దక్షిణ గ్రిడ్‌ను జాతీయ విద్యుత్ గ్రిడ్‌తో అను సంధానం చేయడం, యూనివర్సిటీలు, ఇతర స్కిల్లింగ్ సంస్థలతో కలిసి సంయుక్త నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రకృతి విపత్తుల సమయంలో ఏ రాష్ట్రం ఒంటరిగా ఉండకుండా పరస్పర సహాయానికి ప్రత్యేక విపత్తు నిర్వహణ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రానికి ప్రతిపాదించారు.

## తిరుపతి నుంచి అయోధ్య వరకు తీర్థయాత్ర సర్క్యూట్

దక్షిణాది ప్రముఖ పుణ్యక్షేత్రాలను ఉత్తర భారతదేశంలోని ఆధ్యాత్మిక కేంద్రాలతో అనుసంధానిస్తూ ప్రత్యేక వారసత్వ, పర్యాటక, తీర్థ యాత్ర సర్క్యూట్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. తిరుపతి, శ్రీశైలం, కాంచీపురం, మధురై, రామేశ్వరం, మైసూరు వంటి ప్రాంతాలను వారణాసి, అయోధ్య, చార్ ధామ్ ప్రాంతాలతో అనుసంధానించడం ద్వారా దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాట కానికి ప్రోత్సాహం కల్పించే అవకాశం ఉంటుందని ప్రతిపాదన చేశారు. దేశ స్థూల ఉత్పత్తిలో దక్షిణాది ఐదు రాష్ట్రాల వాటా ప్రస్తుతం 31 శాతంగా ఉందని పేర్కొన్నారు. 2047 నాటికి భారత్ 30–35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యానికి దక్షిణాది రాష్ట్రాలు ప్రధాన భూమిక పోషిస్తాయని తెలిపారు. ఏపీ 2.4 ట్రిలియన్ డాలర్లు తమిళనాడు 2.6, కర్ణాటక 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలుగా లక్ష్యాలు నిర్దేశించుకున్నాయని, సమష్టిగా దక్షిణ భారత్‌లోని రాష్ట్రాలన్నీ 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదుగుతాయని వివరించారు.

## విభజన హామీల పరిష్కారం

ఆంధ్రప్రదేశ్ పునర్విభజనకు సంబంధించిన పెండింగ్ అంశాలను సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. రాష్ట్ర విభజన జరిగి 12 సంవత్సరాలు గడిచినా షెడ్యూల్ 9, 10లోని సంస్థల విభజన పూర్తి కాలేదని పేర్కొన్నారు. ఆస్తులు, అప్పులు, సంస్థల విషయంలో సమన్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. విభజన చట్టంలోని సెక్షన్ 66 కింద ఉన్న అంశాలపై కేంద్ర నిర్ణయం కోసం గడచిన 9 ఏళ్లుగా ఎదురుచూస్తున్నామని చెప్పారు. విభజన చట్టంలోని సెక్షన్ 56లోని సమస్యలు,వనరుల లోటు, ఆర్థిక భారానికి సంబంధించిన అంశాలను కూడా పరిష్కరించాలని కేంద్రాన్ని కోరారు. ఏపీ అభివృద్ధిలో కేంద్రం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.



హామీ ఇచ్చిన 11జాతీయ సంస్థల్లో 10 ఇప్పటికే ఏర్పాటు కావడం సంతోష దాయకమని పేర్కొన్నారు. పోలవరం, సౌత్ కోస్ట్ రైల్వేజోన్, అమరావతి నిర్మాణంలో కేంద్ర సహకారం కీలకమన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్ అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించిన కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. నీటివనరులు, పచ్చదనం, జీవన ప్రమాణాలు, కనెక్టివిటీ, ఆర్థిక అవకాశాలను దృష్టిలో ఉంచుకుని నూతన రాజధాని నిర్మాణం చేస్తున్నామని వివరించారు. చట్టంలోని షెడ్యూల్–13 కింద ఉన్న ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వాలనికోరారు. విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్, మూడు విమానాశ్రయాల అభివృద్ధి, కొత్త రాజధానికి రైలు అనుసంధానం వంటి పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. దుగరాజపట్నం పోర్టు, బీపీసీఎల్ రిఫైనరీ, విశాఖ,విజయవాడ నగరాల్లో మెట్రో రైలు ప్రాజెక్టులు, కడపలోని జిందాల్ స్టీల్‌కు రైలు అనుసంధానంపై అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## నీటి భద్రతకు గోదావరి-కావేరి అనుసంధానం

భవిష్యత్ నీటి భద్రతకు నదుల అనుసంధానమే శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి, పెన్నా వంటి 40 నదులు 28 జిల్లాలకు సాగునీటిని అందిస్తున్నాయని తెలిపారు. గోదావరి–కావేరి అనుసంధానంలో భాగంగా పోలవరం, కృష్ణా, పెన్నా మీదుగా 500 టీఎంసీలకు పైగా మిగులు వరద జలాలను కావేరి బేసిన్‌కు తరలించే ప్రతిపాదనను సీఎం కేంద్రం ముందుఉంచారు. ఈప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ప్రయోజనం కలిగిస్తుందని అన్నారు. గంగా–కావేరి అనుసంధానాన్ని జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలని సూచించారు. గంగా నది మిగులు జలాలను దక్షిణాది ప్రాంతాలకు తరలించడం ద్వారా తమిళనాడుతోపాటు దక్షిణాది రాష్ట్రాల నీటి భద్రతకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. నదీ పరివాహక ప్రాంతాల మధ్య సమన్వయానికి ప్రత్యేక దక్షిణాది నదీ బేసిన్ల సమన్వయ వ్యవస్థను ఏర్పాటుచేయాలని, డీపీఆర్‌లు, అనుమతులను కాలపరిమితిలో పూర్తిచేయాలని కేంద్రాన్ని కోరారు. కేంద్ర–రాష్ట్ర సంబంధాల్లో పరస్పర విశ్వాసం, రాష్ట్రాల మధ్య సహకారం, సమష్టి అభివృద్ధి ప్రధాన లక్ష్యాలుగా సదరన్ జోనల్ కౌన్సిల్ పనిచేయాలని ఆకాంక్షించారు. కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయాలు త్వరితగతిన అమలు అయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు ప్రసంగాన్ని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రశంసించారు. ఈ సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, తెలంగాణా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, కేరళ సీఎం వి.డి.సతీషన్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాష్ నాథన్, అండమాన్ నికోబార్ లెఫ్టినెం ట్ గవర్నర్ అడ్మిరల్ డి.కె.జోషి సహా ఆయా రాష్ట్రాల ఉన్నతాధి కారులు హాజరయ్యారు.



# సీబీఎన్... ది స్టేట్స్‌మెన్



- సౌత్ స్టేట్స్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో దక్షిణాది ప్రాంత ప్రయోజనాలపై కీలక ప్రసంగం
- ఐక్యంగా బలపడితే దేశం బలపడుతుందన్న సందేశం
- సమన్వయంతో బలమైన శక్తిగా ఎదుగుదామని పిలుపు
- చంద్రబాబుపై ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రుల ప్రశంసలు

అమరావతి(చైతన్యరథం): దక్షిణాది రాష్ట్రాల 31వ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబు ప్రసంగం ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆకట్టుకుంది. ఒక రాష్ట్ర ముఖ్యమం త్రిలా కాకుండా సుదీర్ఘ అనుభవమున్న రాజనీతిజ్ఞుడి దార్శనిక పత్రంలా సాగింది. రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ సమస్యల ను ఆయన ప్రస్తావించినప్పటికీ ప్రసంగం మొత్తాన్ని రాష్ట్ర ప్రయోజనాలకే పరిమితం చేయలేదు. దేశాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాల పాత్ర, వాటి సమష్టి ఆర్థిక శక్తి, నీటి–ఇంధన భద్రత, రవాణా అనుసంధానం, విపత్తుల నిర్వహణ, విద్య–నైపుణ్యా భివృద్ధి వంటి అంశాలతో దక్షిణ భారతదేశానికి ఒక దీర్ఘకాలిక ఉమ్మడి అభివృద్ధి అజెండాను ప్రతిపాదించారు. సాధారణంగా జోనల్ కౌన్సిల్ సమావేశాల్లో ఆయా రాష్ట్రాల సమస్యలు, కేంద్రం నుంచి రావాల్సిన సహాయం, అంతర్రాష్ట్ర వివాదాలు ప్రధానంగా చర్చకు వస్తాయి. కానీ చంద్రబాబు తన ప్రసంగాన్ని కేవలం ఆంధ్రప్రదేశ్ డిమాండ్లకు పరిమితం చేయలేదు. ఆంధ్రప్రదేశ్‌కు ఏమి కావాలి? అనే ప్రశ్నను దాటి, దక్షిణ భారతదేశం సమష్టిగా ఎలా ఎదగాలి? దేశాభివృద్ధికి మరింత శక్తివంతమైన గ్రోత్ ఇంజిన్‌గా ఎలా మారాలి? అనే విస్తృత దృష్టితో ఒక బలమైన సందేశం ఇచ్చారు.

## పోటీ నుంచి సహకార వైపు

కేంద్రం–రాష్ట్రాలు, రాష్ట్రం–రాష్ట్రం మధ్య ఘర్షణలు అభివృద్ధికి ఉపయోగపడవని స్పష్టం చేశారు. పరస్పర విశ్వాసం, సంప్ర దింపులు, ఇచ్చిపుచ్చుకునే ధోరణి, సహకార సమాఖ్య విధానం తోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలు పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలికవసతుల కోసం పరస్పరం పోటీ పడటంతోనే ఆగిపోకుండా, కొన్ని కీలక రంగాల్లో కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.

## 10 ట్రిలియన్ల దక్షిణాది ఆర్థిక వ్యవస్థ

దక్షిణాది రాష్ట్రాలు దేశ జీడీపీలో దాదాపు 31 శాతం వాటా కలిగి ఉన్నాయన్న విషయాన్ని చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావిం చి దక్షిణాది ప్రాధాన్యతను చాటి చెప్పారు. 2047 నాటికి దక్షిణ భారత్‌ను 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు చేయి కలిపి పనిచేద్దామని పిలుపునిచ్చారు. అమరావతి–బెంగళూరు–చెన్నై నగరాలను బలమైన రవాణా వ్యవస్థతో అను సంధానించాలని సూచించారు. రవాణా అనుసంధానం పెరిగితే సరకు రవాణా వ్యయం తగ్గుతుంది, పెట్టుబడులు పెరుగుతాయి, ఉద్యోగ అవకాశాలు విస్తరిస్తాయి, రాష్ట్రాల మధ్య వ్యాపార కార్య కలాపాలు వేగవంతమవుతాయని చెప్పారు.

## ఉమ్మడి లాజిస్టిక్స్, డ్రైపోర్టుల నెట్‌వర్క్

దక్షిణాది రాష్ట్రాలకు ఉమ్మడి లాజిస్టిక్స్ వ్యవస్థ, డ్రైపోర్టుల నెట్‌వర్క్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. సముద్రతీరం లేని అంతర్గత ప్రాంతాలను పోర్టులతో అనుసంధానించడం, సరకు రవాణా సమయాన్ని తగ్గించడం, ఎగుమతులను పెంచడం, తయారీ రంగాన్ని అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలతో కలపడం దీని లక్ష్యం. ఇది దక్షిణ భారతదేశాన్ని ఒక సమీకృత ఉత్పత్తి–ఎగుమతి కేంద్రంగా మార్చగల ప్రతిపాదన.

## నీటి భద్రతకు దక్షిణాది ఉమ్మడి ప్రాజెక్టు ప్రతిపాదన

గోదావరి–కావేరి అనుసంధానం ద్వారా 500 టీఎంసీలకు పైగా మిగులు వరద జలాలను కృష్ణా, పెన్నా నదుల మీదుగా కావేరి బేసిన్‌కు తరలించాలని సీఎం చంద్రబాబు ప్రతిపాదిం చారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు నీటి భద్రత కల్పించే దక్షిణాది ఉమ్మడి ప్రాజెక్టుగా ప్రతిపాదించారు. "నీటి పంపిణీ" చర్చను నీటి సమర్థ వినియోగం దిశగా తీసుకెళ్లే ప్రయత్నం చేశారు.

## ఇంధన భద్రతకు సమీకృత గ్రిడ్

దక్షిణాది పవర్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో మరింత బలంగా అనుసంధానించాలని సూచించారు. ఒక రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉంటే మరో రాష్ట్రంలో ఉన్న అవసరాన్ని తీర్చగల విధం గా సమర్థమైన విద్యుత్ మార్పిడి వ్యవస్థ అవసరమని ఆయన భావన.


## విద్య-నైపుణ్యాలను ఉమ్మడి ప్రాంతీయ సంపద

దక్షిణాది రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, నైపుణ్యాభివృద్ధి సంస్థలతో ఒక ఉమ్మడి కన్సార్టియం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. తుపాన్లు, వరదలు, కరవు, అగ్నిప్రమాదాలు, ఇతర ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేం దుకు దక్షిణాది రాష్ట్రాలతో మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.

## ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్

దక్షిణాది రాష్ట్రాల దేవాలయాలు, చారిత్రక ప్రదేశాలు, బౌద్ధ క్షేత్రాలు, సముద్రతీరాలు, ప్రకృతి సంపదను అనుసంధానిస్తూ ఉమ్మడి హెరిటేజ్–స్పిరిచ్యువల్ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయాలని చంద్రబాబు సూచించారు. ఫిర్యాదుల జాబితాగా కాకుండా పరిష్కారాల అజెండాగా ఆయన ప్రసంగం సాగింది. రాష్ట్రాల మధ్య పోటీని సమష్టి శక్తిగా మార్చే ప్రయత్నం చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను దక్షిణాది, జాతీయ ప్రయోజనాలతో అనుసంధానించి మాట్లాడారు. వర్తమాన సమస్యలతోపాటు 20 47 అవసరాలను ముందుంచారు. రాజకీయ ప్రసంగం కంటే ఒక ప్రాంతీయ అభివృద్ధి బ్లూప్రింట్‌గా చూపించారు. దక్షిణాది రాష్ట్రాలు విడివిడిగా విజయం సాధించినా.. కలిసికట్టుగా పనిచేస్తే భారతదేశ భవిష్యత్తునే నిర్దేశించగలవని దిశానిర్దేశం చేశారు.



## ప్రతి బోటు, ప్రతి మత్స్యకారుడి

# వివరాలు నమోదు చేయాలి

- ఘటన తర్వాత స్పందించడం కంటే ముందే అప్రమత్తంగా ఉండాలి
- మత్స్యకారుల గల్లంతు ఘటనపై అధికారులకు సీఎం చంద్రబాబు సూచనలు
- గాలింపు చర్యలు విస్తృతం చేయాలని ఆదేశం



అమరావతి(చైతన్యరథం): సముద్రంలో మత్స్యకారులు గల్లంతైన ఘటనలో తర్వాత స్పందించడం కాకుండా ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాలను నివారించేలా ఎస్ఓపీ అమలుచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ప్రతి బోటు, ప్రతి మత్స్యకారుడి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, వేటకు వెళ్లే వారి పూర్తి సమాచారం అందుబాటులో ఉంటేనే అత్య వసర సమయాల్లో సత్వర సాయం అందించగలమని స్పష్టం చేశారు. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు, దుమ్మలపేట, వాసలతిప్ప గ్రామాలకు చెందిన ఏడుగురు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన ఘటనపై గురువారం కూడా క్యాంపు కార్యాలయంలో మత్స్యశాఖ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం చేపడుతున్న గాలింపు చర్యలు, వివిధ విభాగాల మధ్య సమన్వయం, చేపట్టాల్సిన చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**216 నాటికల్ మైళ్ల పరిధిలో గాలింపు**

ఈ నెల 3వ తేదీన ఏడుగురు మత్స్యకారులు బోటులో వేటకు వెళ్లారని, 10 రోజుల తర్వాత తిరిగి వస్తామని కుటుంబసభ్యులకు చెప్పినట్లు అధికారులు సీఎంకు వివరించారు. ఈ నెల 16న మత్స్యకారుల ఆచూకీ లభించడం లేదని కుటుంబసభ్యులు అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. సమాచారం అందిన వెంటనే కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసుల సహకారంతో గాలింపు చర్యలుప్రారంభించినట్లు చెప్పారు. బోటులో ట్రాన్స్‌పాండర్ ఏర్పాటు, బోటు ఒంటరిగా ఎందుకు సముద్రంలోకి వెళ్లింది? బోటు గల్లంతైన విషయం అధికారులకు ఎప్పుడు తెలిసింది? తెలిసిన వెంటనే గాలింపు చర్యలు ఎప్పుడు ప్రారంభించారు? అనే అంశాలపై సీఎం అధికారులను ప్రశ్నించారు. గాలింపు చర్యలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. ఇప్పటికే చెన్నైలోని కోస్ట్‌గార్డ్ హెడ్ క్వార్టర్స్‌తో రాష్ట్ర మత్స్యశాఖ అధికారులు మాట్లాడినట్లు అధికారులు తెలిపారు. ఏపీకి చెందిన బోటు గల్లంతైన విషయాన్ని అండమాన్ సహా బంగ్లాదేశ్‌కు కూడా చెన్నైలోని కోస్ట్‌గార్డ్ ఉన్నతాధికారుల ద్వారా తెలియజేసినట్లు చెప్పారు. నేవీ డార్నియర్ విమానాల ద్వారా 216 నాటికల్ మైళ్ల పరిధిలో గాలింపు నిర్వహించినట్లు వివరించారు. వేటకు వెళ్లే మత్స్యకారులకు అందుతున్న సాంకేతిక సహాయం, రోజువారీ సమన్వయ వ్యవస్థలపైనా చంద్రబాబు సమీక్షించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి మత్స్యకారులు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని ఆదేశించారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు.

# విశాఖలో టీచర్ కొట్టడంతో బాలుడి మృతి

- ఘటనపై స్పందించిన మంత్రి లోకేష్
- బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వెల్లడి
- తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతి
- ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా

అమరావతి(చైతన్యరథం): విశాఖలో టీచర్ కొట్టడంతో తరగతి గదిలోనే ఆరేళ్ల బాలుడు ప్రణయ్ తేజ్ కుప్పకూలిపోయాడు. విశాఖ వన్‌టౌన్ ప్రాంతంలోని లిటిల్ గార్డెన్ స్కూల్‌లో ఈ ఘటన జరిగింది. అపస్మారకస్థితిలోకి వెళ్లిన బాలుడిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే బాబు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో అక్కడి నుంచి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. విషయం తెలిసిన వెంటనే తల్లిదండ్రులు, బంధువులు స్కూల్ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. హోంవర్క్ చేయలేదని టీచర్ మందలించడంతోపాటు దాడి చేయడం కారణంగానే ప్రణయ్ మరణించాడని బంధువులు ఆరోపిస్తున్నారు. కేజీహెచ్‌లో బాలుడి మృతదేహాన్ని చూసి తల్లి దండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విద్యార్థిని కొట్టిన టీచర్‌తోపాటు స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

**బాలుడి మృతి బాధాకరం: లోకేష్**

విశాఖ లిటిల్ గార్డెన్ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్ కొట్టడంతో ఆరేళ్ల ప్రణయ్ తేజ్ మృతిచెందటం బాధాకరమని మంత్రి నారా లోకేష్ ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధ్యులపై, సంబంధిత స్కూలు యాజమాన్యంపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రణయ్ తేజ్ తల్లిదండ్రులకు నా ప్రగాఢ సానుభూతి తెలిపారు. మీకు కలిగిన నష్టం ఎవ్వరూ పూడ్చలేనిదని ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. మా ప్రభుత్వం మీకు అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు.



# మార్గదర్శిపై ఉండవల్లి పిటిషన్ డిస్మిస్

- సుప్రీంకోర్టులో వివాదానికి ఎండ్‌కార్డ్
- రెండు దశాబ్దాల వేధింపులకు తెర
- సుదీర్ఘ న్యాయపోరాటంలో విజయం
- పిటిషన్ దాఖలుకు మీరెవరని ప్రశ్న
- వ్యక్తిగత వివాదంగా ఉందని వ్యాఖ్యలు



అమరావతి(చైతన్యరథం): మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసులో ఉండవల్లి అరుణ్‌కుమార్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరాలే ధర్మాసనం డిస్మిస్ చేసింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై రెండు దశాబ్దాలుగా సాగుతు న్న వేధింపులకు తెరపడింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ సుదీర్ఘ న్యాయ పోరాటంలో విజయం సాధించింది. హిందూ అవిభాజ్య కుటుంబంగా ఉంటూ ఆర్‌బీఐ చట్టానికి విరుద్ధంగా ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరిస్తోందంటూ మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై 2008లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం క్రిమినల్ కేసు పెట్టింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై నమోదు చేసిన క్రిమినల్ కేసును 2018లో ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఉండవల్లి అరుణ్‌కుమార్ వేసిన అప్పీల్‌ను సుప్రీం కోర్టు... మళ్లీ తెలంగాణ హైకోర్టుకు పంపించింది. డిపాజిటర్ల నుంచి అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరించి మార్గదర్శిపై క్రిమి నల్ ప్రొసీడింగ్స్ కొనసాగించడం అవసరమా లేక వృథా కసరత్తా అనే విషయం నిర్ధారించాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ 2024 సెప్టెంబరు 26న డిపాజిట్లు క్లెయిమ్ చేయని వారుంటే అభ్యంతరాలు సమర్పించాలని పత్రికల్లో పబ్లిక్ నోటీసు ఇచ్చారు. అయితే మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థ అప్పటికే డిపాజిటర్లందరికీ డబ్బులు తిరిగి చెల్లించినందున, ఒక్క డిపాజిటర్ కూడా అభ్యంతరం సమర్పించ చేయుకు ముందుకు రాలేదు. డిపాజిటర్లందరికీ సొమ్ము తిరిగి చెల్లించడంతో పాటు, హెచ్‌యూఎఫ్ కర్త రామోజీరావు 2024 జూన్‌లో మరణించినందున 2008లో నమోదైన క్రిమినల్ కేసు కొట్టివేయాలని కోరుతూ మార్గదర్శి ఫైనాన్షియర్స్ గతేడాది జనవరిలో తెలంగాణ హైకోర్టులో మధ్యంతర పిటిషన్ దాఖలు చేసింది. మార్గదర్శి పేర్కొన్న అంశాలను పరిగణనలోకి తీసుకున్న తెలం గాణ హైకోర్టు మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై ఇంకా కేసు కొనసా గించాల్సిన అవసరం లేదంటూ గతేడాది ఆగస్టు 4న కేసు కొట్టివేసింది.

**సుప్రీంకోర్టులో సవాల్ చేసిన ఉండవల్లి**

తెలంగాణ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఉండవల్లి అరుణ్ కుమార్ సుప్రీంకోర్టుకు వెళ్లారు. డిపాజిటర్లకు రూ.2591 కోట్లకు పైగా తిరిగి చెల్లించిందని, భవిష్యత్తులో ఇంకా ఎవరైనా వస్తే చెల్లించేందుకు మరో రూ.5.23 లక్షలు ఎస్క్రో అకౌంట్‌లో పెట్టిందని మార్గదర్శి ఫైనాన్షియర్స్ తరపున సీనియర్ న్యాయవాది సుప్రీంకోర్టుకు వివరించారు. విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఉండవల్లి అరుణ్‌కుమార్ ఎస్ఎల్‌పీని కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోడానికి ఎలాంటి కారణాలు కనిపించడం లేదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఎస్ఎల్‌పీ వేయడానికి ఉండవల్లికి ఉన్న అర్హత ఏమిటని ప్రశ్నించింది. వ్యక్తిగత దురుద్దేశంతోనే మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను వెంటపడి వేధిస్తున్నట్లుగా ఉండవల్లి తరపున న్యాయవాది వాదన ల్లో కనిపిస్తోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. మరోవైపు మార్గదర్శి తరపున ప్రఖ్యాత సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, నాగముత్తు తమ బలమైన వాదనలను కోర్టు ముందుకు తెచ్చారు. మార్గదర్శి మొదటి నుంచీ డిపాజిటర్ల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చిందని, ఇప్పటివరకు దాదాపు రూ.2,500 కోట్లను డిపాజిటర్లకు విజయవంతంగా తిరిగి చెల్లించేసిందని వివరించారు. ఇక క్లెయిమ్ చేయని మిగిలిన రూ.5.23 కోట్ల స్వల్ప మొత్తాన్ని నిబంధనల ప్రకారం ఎస్క్రో ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణం గానే తెలంగాణ హైకోర్టు పబ్లిక్ నోటీసులు ఇచ్చి పారదర్శకంగా ఈ ప్రక్రియను పూర్తి చేసిందని స్పష్టం చేశారు. మార్గదర్శి వ్యవ స్థాపకులు రామోజీరావు తన జీవితకాలంలో ఎదుర్కొన్న అతిపెద్ద వివాదాల్లో ఇది ఒకటి. వ్యాపార విలువలకే పెద్దపీట వేస్తూ, ఏ ఒక్క డిపాజిటర్‌కూ రూపాయి నష్టం రాకుండా కాపాడిన రామోజీ రావు నిజాయితీని అత్యున్నత న్యాయస్థానం తీర్పు మరోసారి చాటిచెప్పింది.

చైతన్యరథం

# విద్యాహక్కు చట్టం కింద ప్రవేశాలు పెరిగాయి

- 2022-26 మధ్య 1,04,046 మందికి అవకాశం
- ప్రజాప్రభుత్వంలోనే ఎక్కువ మంది చేరికలు
- శాసనమండలిలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్



అమరావతి(చైతన్యరథం): ప్రజాప్రభుత్వ పాలనలో విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం(ఆర్టీఈ) కింద ప్రవేశాలు పొందిన విద్యార్థుల సంఖ్యపై శాసనమండలిలో సభ్యులు కావలి గ్రీష్మ, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, పేరాబత్తుల రాజశేఖర్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. 2022-23 నుంచి 2026-27 వరకు విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1,04,046 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. 12(1)(సీ) సెక్షన్ కింద ప్రవేశాలు పారదర్శక ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా చేపట్టాం. 12(1)(సి) సెక్షన్‌ను సమర్థంగా అమలు చేయడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాహక్కు చట్టం కింద విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయి. 2022-23 ఏడాదిలో విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో కేవలం 2,203 మంది విద్యార్థులు మాత్రమే ప్రవేశాలు పొందారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి ఏడాదే 2024-25లో సుమారు 29 వేల మంది విద్యార్థులు ప్రవేశాలు పొందగా, 2026-27 ఏడాదిలో 28,742 మంది విద్యార్థులకు విద్యాహక్కు చట్టం కింద అడ్మిషన్లు లభించాయి. ప్రజాప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యా హక్కు చట్టంపై సమాజంలో అవగాహన పెరిగిందని, దీనిపై పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నామని చెప్పారు.

## అసెంబ్లీకి రాకుండా జగన్ పారిపోతున్నారు

- ఏపీపీఎస్సీ, డీఎస్సీ ఒకటే అనుకుంటున్నారు
- రెండింటికీ తేడా తెలియని స్థితిలో ఉన్నారు
- మంత్రి నారా లోకేష్ కౌంటర్



అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించే పరీక్షల వ్యవస్థపై వైసీపీ అధినేత జగన్‌కు అవగాహన లేదని మంత్రి నారా లోకేష్ విమర్శించారు. జగన్ చేసిన వ్యాఖ్యలకు గురువారం కౌంటర్ ఇచ్చారు. ఏపీపీఎస్సీ, డీఎస్సీ రెండూ ఒకటే అనుకుం టున్నారా? అంటూ మండిపడ్డారు. ఏపీపీఎస్సీ అంటే ఏమిటో, డీఎస్సీ అంటే ఏమిటో కూడా జగన్‌కు తెలియదంటూ వ్యంగ్యా స్త్రాలు సంధించారు. ఈ రెండు పరీక్షలను ఒకే గాటిన కట్టడం, ఒకటే అనుకోవడం జగన్ అవగాహన స్థాయిని తెలియజేస్తుందం టూ ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏ పరీక్షలు నిర్వ హిస్తుందో..వాటి విధి విధానాలేమిటో కూడా అవగాహన లేని స్థితిలో ఉన్నారని వ్యాఖ్యానించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని విమర్శించారు. అధికా రంలో ఉన్నప్పుడు డీఎస్సీ నిర్వహించలేకపోయారు.. ప్రస్తుతం అసెంబ్లీలో చర్చకు రాకుండా పారిపోతున్నారంటూ చురకలంటిం చారు. పరీక్షల వ్యవస్థపై అవగాహన లేని వ్యక్తి ఇప్పుడు ప్రశ్నలు లేవనెత్తుతున్నా రంటూ ధ్వజమెత్తారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ మధ్య తేడా తెలియని జగన్‌కు పరీక్షలపై మాట్లాడే అర్హత ఉందా? అంటూ సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా జగన్‌కు కౌంటర్ ఇచ్చారు.

## శాసనమండలిలో ఐదు బిల్లులకు ఆమోదం

అమరావతి(చైతన్యరథం): శాసనమండలిలో మంత్రి నారా లోకేష్ 5 కీలక బిల్లులను ప్రవేశపెట్టారు. ఏపీ పబ్లిక్ గ్రంథాలయాల సవరణ బిల్లు-2026, ఏపీ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సవరణ బిల్లు, ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు, ఏపీ విద్యాసంస్థల (ఉపాధ్యాయుల కేడర్‌లో రిజర్వేషన్) సవరణ బిల్లు, ఏపీ ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ బిల్లులను మండలి ఏకగ్రీవంగా ఆమోదించింది.

## అనకాపల్లి జిల్లాలో బార్క్ ప్రాజెక్టుకు రిలీఫ్

### స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల మినహాయింపు

అమరావతి(చైతన్యరథం): అనకాపల్లి జిల్లాలో చేపట్టనున్న బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్(బీఏఆర్సీ) ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఊరట కల్పించింది. ప్రాజెక్టు కోసం భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులను మినహాయిస్తూ నిర్ణయం తీసుకుంది.







అనకాపల్లిలో 4,950 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్‌కు ఫీజులను మినహాయిస్తూ సర్కార్ జీవో జారీ చేసింది. తొలి దశలో అచ్చుతాపురం, మునగపాక మండలాల్లోని 1,947.225 ఎకరాల భూములకు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల మినహాయింపు వర్తించనుంది. అనంతరం మిగిలిన భూములకు కూడా దశలవారీగా ఈ రాయితీని రెవెన్యూ శాఖ వర్తింపజేయనుంది. అచ్చుతాపురం ప్రాంతంలో క్లీన్ ఎనర్జీ, అణు పరిశోధన, రేడియేషన్ సాంకేతికతపై పరిశోధనలు నిర్వహించే కేంద్రాన్ని బార్క్ ఏర్పాటు చేయనుంది. దేశ రక్షణ, ఇంధనం, వైద్యం, వ్యవసాయం తదితర రంగాల్లో పరిశోధనల కోసం బీఏఆర్సీ ప్రాజెక్ట్ కీలకంగా మారనుంది. భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఫీజుల మినహాయింపుపై భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 285(1) నిబంధనల ప్రకారం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# వెలిగొండ ఫీడర్ కెనాల్ రెడీ

- రూ.450 కోట్లతో చేపట్టిన పనులు పూర్తి
- నాడు వైసీపీ నిర్లక్ష్యం.. నేడు కూటమి నిర్మాణాత్మకం
- నల్లమల జలాశయంలోకి నీటి పారుదలకు సుగమం

మార్కాపురం(చైతన్యరథం): పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్‌కు సంబంధించి నీటి తరలింపులో కీలకమైన ఫీడర్ కెనాల్ ఎట్టకేల కు సిద్ధమైంది. రూ.450 కోట్లతో చేపట్టిన పనులు దాదాపు పూర్త య్యాయి. కొల్లంవాగు నుంచి టన్నెళ్ల ద్వారా వచ్చే నీరు కొత్తూరు వద్ద ఫీడర్ కెనాల్‌కు చేరి ఎటువంటి అవరోధం లేకుండా నల్లమ ల జలాశయంలోకి వెళ్లేందుకు మార్గం సుగమమైంది. గత వైసీపీ ప్రభుత్వం ఫీడర్ కాలువను తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళికతో నిర్మాణాత్మకంగా ఫీడర్ కాలువను బలోపేతం చేసింది. త్వరలో నీటి విడుదలకు సిద్ధమైం ది. దీంతో జిల్లా ప్రజల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు సాగు, తాగునీరు అందించడం వెలిగొండ ముఖ్యఉద్దేశం. కృష్ణా జలాల ను హెడ్ రెగ్యులేటర్ల నుంచి రెండు టన్నెళ్ల ద్వారా దోర్నాల మండలం కొత్తూరు వద్దకు చేరుస్తారు. ఆనీటిని అక్కడి నుంచి నల్లమల జలాశయానికి తరలించడంలో ప్రధాన భూమిక ఫీడర్ కెనాల్‌దే. దోర్నాల మండలం కొత్తూరు నుంచి పెద్దారవీడు మండలం కలనూతల వరకూ ఫీడర్ కెనాల్ సుమారు 24 కిలోమీటర్ల మేర ఉంది. ఈ కాలువ బలోపేతంపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించింది. నేడు ప్రజా ప్రభుత్వం నిర్మాణాత్మకంగా నీటి పారుదలకు సిద్ధం చేసింది.

### గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి తెగిన ఆనకట్ట

ఫీడర్ కెనాల్‌ను బలోపేతం చేసేందుకు 2018లో టీడీపీ ప్రభు త్వ హయాంలో రూ.120 కోట్లతో లైనింగ్ పనులు చేయాలని అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. వీటిని పరిశీలిస్తున్న దశలో ఎన్నికలు జరిగాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఐదేళ్ల పదవీ కాలంలో వైసీపీ ప్రభుత్వం ఫీడర్ కాలువ గురించి పట్టించుకోలేదు. దీంతో దోర్నాల మండలం కడపరాజు పల్లి వద్ద వర్షపు నీటికే గండ్లు పడ్డాయి. వాటిని పూడ్చేందుకు సైతం చర్యలు చేపట్టలేదు. ఎలాంటి పనులూ చేయకుండానే జగన్‌రెడ్డి వెలిగొండ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేశారు.




### సిమెంట్ లైనింగ్‌తో కట్టలు బలోపేతం

2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు వెలిగొండ ప్రాజెక్ట్‌ను త్వరితగతిన పూర్తి చేసి కృష్ణా జలాలను తరలించేందుకు నిర్దిష్ట ప్రణాళికతో ముందుకెళ్లింది. ఫీడర్ కాలువ బలోపేతానికి రూ.450 కోట్లతో నూతనంగా ప్రతి పాదనలు తయారు చేసి పనులను కార్యరూపంలోకి తీసుకు వచ్చింది.

దీంతో ప్రస్తుతం ఫీడర్ కెనాల్‌లో బలహీనంగా ఉన్న కట్టలను సిమెంట్ లైనింగ్‌తో బలోపేతం చేశారు. రైతులకు ఇబ్బంది లేకుండా అవసరమైన చోట్ల బ్రిడ్జిలను నిర్మించారు. ఇప్పటికిప్పుడు కృష్ణా జలాలను వదిలినా కొత్తూరు వద్ద నుంచి నల్లమల సాగరానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా జలాలు చేరే విధంగా అంతా రెడీ చేశారు. నీటి విడుదల అనంతరం ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వాటిని పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం ప్రణాళికను సిద్ధం చేసింది.

# బీసీల అగ్రపథం చంద్రన్న సంకల్పం

జనాభాలో ఎక్కువ సంఖ్యలో ఉన్న అణగారిన వర్గాలకు రాజ్యాధి కారమే అసలైన లక్ష్యం కావాలి..అప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుంది అని చెప్పిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాటలో నడుస్తున్నారు సీఎం చంద్రబాబునాయుడు. బలహీన వర్గాలకు కేవలం ఆర్థిక సాయం మాత్రమే సరిపోదని, నిర్ణయాలు తీసుకునే చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం ఉన్నప్పుడే వారి హక్కు లు, రక్షణ చట్టాలు సరిగ్గా అమలవుతాయనేది ఆయన భావన. అందుకే సీఎం చంద్రబాబు అధికారంలో ఉన్న ప్రతిసారీ బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ, సామాజిక ప్రాధాన్యమిస్తూ వస్తున్నారు. ముఖ్యంగా చట్టసభలు, స్థానిక సంస్థల్లో వెనుబడిన వర్గాలకు తగిన రాజకీయ ప్రాధాన్యమిస్తూ, సామాజిక న్యాయా నికి పెద్దపీట వేస్తూ వస్తున్నారు. తాజాగా బీసీలకు రాజకీయ మేలు కలిగేలా మరో నిర్ణయం తీసుకున్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు దూరమైన 34 శాతం రిజర్వేషన్ల కల్పనకు నడుం బిగించారు. జగన్ ప్రభుత్వం కుట్ర పూరిత రాజకీయాలకు స్థానిక సంస్థల్లో దూరమైన 16,800 పదవులు బీసీలకు అందజేసేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు.




సమాజమే దేవాయల – ప్రజలే దేవుళ్లు నినాదంతో అన్న ఎన్టీఆర్ 1983లో తెలుగుదేశం పార్టీని స్థాపించారు. ఆనాటి నుంచి నేటి వరకూ బడుగు, బలహీన వర్గాలను రాజ్యాధికారంలో టీడీపీ ప్రభుత్వాలు భాగస్వామ్యం చేస్తూ వస్తున్నాయి. బీసీలకు రిజర్వేషన్ల ప్రక్రియలో కీలకమైన రాజకీయ విప్లవానికి అన్న ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచి, జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో బీసీలకు 20 శాతం ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్లను అమలు చేశారు. ఈ రిజర్వేషన్ల అమలుతో ఎందరో బీసీ నాయకులు రాజకీయ రంగ ప్రవేశం చేశారు. అన్న ఎన్టీఆర్ అందజేసిన ప్రోత్సాహంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తమదైన ముద్ర వేశారు. దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, యనమల రామకృష్ణుడు, తెలంగాణాకు చెందిన దేవేందర్ గౌడ్ సహా ఎందరో బీసీ నేతలు పాలనలో నూతన ఒరవడులు సృష్టించారు. వారే కాకుండా, స్థానిక సంస్థల్లోనూ బీసీ నాయకత్వం భళా అనిపించుకుంది. అన్న ఎన్టీఆర్ 1987 నాటికి బీసీలకు ఇచ్చే రిజర్వేషన్లను 20 శాతం నుంచి 27 శాతానికి పెంచారు. అవకాశం వచ్చిన ప్రతిసా రీ వెనుబడిన తరగతులు రాజకీయాల్లో రాణిస్తూ వచ్చారు.

అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో తెలుగుదేశం పార్టీ, ప్రభుత్వం పగ్గాలు అందుకున్న సీఎం చంద్రబాబు మొదటి నుంచి బీసీలను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందేలా ప్రోత్సహిస్తూ వస్తున్నారు. అన్న ఎన్టీఆర్ బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే, సీఎం చంద్రబాబు ఆ సంఖ్యను 34 శాతానికి పెంచారు. నిర్ణయాధికా రంతోనే బీసీలు అత్యున్నత శిఖరాలకు చేరుకుంటారనేది ఆయన భావన. ఆనాడు బీసీల రాజకీయ ప్రాధాన్యానికి తీసుకున్న నిర్ణ యం మరెందరో బీసీ నేతలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కలిగే అవకాశం కలిగించింది. తరవాత వచ్చిన ప్రభుత్వాలు కూడా సీఎం చంద్రబాబు నిర్ణయాన్ని గౌరవిస్తూ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ వచ్చాయి. ఇలా 2021 వరకూ 25 ఏళ్ల పాటు బీసీలకు రాజకీయ ప్రాధాన్యం లభిస్తూ వచ్చింది. ఆ తరవాతే బీసీలకు అన్ని విధాలా గడ్డు పరిస్థితులు ప్రారంభమ య్యాయి. 2019 తరవాత అధికారంలోకి వచ్చిన జగన్... నా బీసీలంటూనే విశ్వాస ఘాతుకానికి పాల్పడ్డారు. బీసీలు ఎప్పుడూ టీడీపీ పక్షమేనని వారిపై జగన్ కక్షగట్టారు. రాజకీయంగానే కాకుండా ఆర్థికంగా మేలు చేసే ఆదరణ వంటి పథకాలను కూడా రద్దు చేశారు. బీసీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించా రు. ముఖ్యంగా బీసీలకు రాజకీయ అండదండలు అందజేసే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లకు 10 శాతం మేర కోత పెట్టారు. ఈ ఒక్క నిర్ణయంతో 16,800 పదవులకు బీసీలు దూరమయ్యారు. జనాభాలో అధిక సంఖ్యలో ఉండే అణగారిన వర్గాలకు రాజ్యాధి కారం ఉండాలన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లక్ష్యాన్ని జగన్ నీరుగార్చారు.

బడుగు, బలహీన వర్గాల పక్షపాతిగా ముద్రపడిన సీఎం చంద్రబాబు సమాజానికి బ్యాక్‌బోన్ లాంటి బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని సహించలేకపోయారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, సర్దార్ గౌతు లచ్చన్న అందించిన స్ఫూర్తితో వెనుబడిన వర్గాలను మరోసారి భుజానికెత్తుకున్నారు. తనయుడు, మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, బీజేపీ నేతల సహకారంతో జగనాసుర పాలనపై సమరశంఖం పూరించారు. కూటమి ప్రభు త్వం అధికారంలోకి రాగానే స్థానికసంస్థల్లో బీసీలు కోల్పోయిన రిజర్వేషన్లను అమలు చేసి తీరుతానని ప్రతినబూనారు. తండ్రి పోరాటతత్వాన్ని అణువణువునా నింపుకున్న లోకేష్ తన పాదయాత్రలో బీసీల సమస్యలపై పరిష్కారానికి భరోసా ఇస్తూ వచ్చారు. జగన్ అసమర్థ, కక్షపూరిత పాలనతో విసిగివేసారిన బీసీలు... సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచారు. చరిత్రలో కనీవినీ ఎరుగని విజయమిచ్చారు. తమను నిండా మోసగించిన జగన్ కు కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా ఎమ్మెల్యే సీటుకే పరిమితం చేసి, బీసీ సత్తా ఎంటో రుచి చూపించారు. అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబా బు బీసీలను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేలా నిర్ణయాలు చకచకా తీసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా బడ్జెట్ లో ఇవ్వనన్ని నిధులు కేటాయించారు. ఒకవైపు ఆర్థిక భరోసానిచ్చే పథకాలు అమలు చేస్తూనే...మరోవైపు సామాజిక రక్షణ కోసం బీసీ రక్షణ చట్టం అమలుకు సిద్ధమవుతున్నారు. అదే సమయంలో గతంలో మాదిరిగా స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ల కల్పన కు చర్యలు తీసుకున్నారు. క్యాబినెట్‌లో ఆమోదించి... త్వరలో జరగబోయే స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో బీసీలు కోల్పోయిన 16,800 పదవులు తిరిగి అప్పగించేలా నిర్ణయం తీసుకున్నారు. నా బీసీలు అని జగన్ మాట వరుసకే అంటే, బీసీలు నా ప్రాణ మంటూ సీఎం చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల కాలంలో చరిత్రలో బీసీలు ఎరుగుని పథకాలు, నిధులు సీఎం చంద్రబాబు అందజేశారు. బీసీలకు మొదటి బడ్జెట్‌లో రూ.39 వేల కోట్లు. రెండో బడ్జెట్‌లో రూ.47 వేలు కోట్లు, మూడో బడ్జెట్‌లో రూ.51 వేల కోట్లు కేటా యించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇంత భారీ స్థాయిలో నిధులు కేటాయించలేదు. బీసీల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఈ నిధుల కేటాయింపే ఓ నిదర్శనం. చట్టసభలలో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు అసెంబ్లీలో తీర్మా నం చేసి, కేంద్రప్రభుత్వ తదుపరి చర్యకు పంపించారు. నామి నేటెడ్ పోస్టుల భర్తీలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. నిధుల కేటాయింపే కాదు... సంక్షేమ పథకాలను అదే స్థాయిలో అమలు చేయసాగారు. అధికారంలోకి రాగానే స్వర్ణకా రులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. గీత కార్మికులకు మద్యంషాపులు, బార్ల కేటాయింపుల్లోనూ 10 శాతం మేర కేటా యించారు. మద్యం షాపుల లైసెన్స్‌లో 50 శాతం రాయితీ ఇచ్చా రు. వడ్డెరలకు క్వారీల కేటాయింపుల్లో 33 శాతం మేర రిజర్వేషన్లు, 50 శాతం మేర సినరేజీ మినహాయింపు ఇచ్చారు. చేపల వేట నిషేధకాలంలో మత్స్యకారులకు ఆర్థిక సాయం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచాం. స్థానిక మత్స్యకా రుల కడుపుకొడుతూ జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 217ను రద్దు చేశాం. నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు గౌరవ వేతనం రూ.20 వేల నుంచి రూ.25 వేలకు పెంచారు. 62,541 నేతన్నలకు 200లు, 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. 85,940 మంది నేతన్నలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, 71,536 మంది చేనేతలకు నేతన్నల సేవలో పథకం కింద రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద 2024–26 మధ్య 15.67 లక్షల బీసీ లబ్ధిదారులకు రూ.15,588.64 కోట్లు చెల్లించారు. దీపం –2 కింద 13.46 లక్షలకు పైగా బీసీ లబ్ధిదారులకు రూ.5085.93 కోట్లు చెల్లించారు. తల్లికి వందనం పథకం కింద రూ.15 వేల చొప్పున 10.46 లక్షల మంది బీసీ విద్యార్థులకు రూ.1,360.61 కోట్లు అందజేశారు. స్త్రీ శక్తి పథకం వల్ల ఆటో డ్రైవర్ల నష్టపోకూడదన్న ఉద్దేశంతో ఆటో డ్రైవర్ సేవలో పథకంలో భాగంగా 40,610 మంది ఆటో డ్రైవర్లకు రూ.60.91 కోట్లు అందజేశారు. పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే బీసీలకు కూటమి ప్రభుత్వం అదనంగా రూ.20 వేలు రాయితీ అందజేస్తున్నారు. ఆదరణ 1, ఆదరణ 2 పథకాల కంటే మరింత మెరుగ్గా బీసీ లబ్ధిదారులకు సాంకేతిక పరికరాలు అందజేయాలన్న ఉద్దేశంతో రూ.1000 కోట్లతో ఆదరణ 3.0 అమలు చేయబోతున్నారు. రాజకీయ, ఆర్థిక గుర్తింపుతో పాటు బీసీలకు నాణ్యమైన విద్య అందజేయాలన్న ఉద్దేశంతో బీసీ గురుకులాలు, హాస్టళ్లను అభివృద్ధి చేస్తున్నారు. కొత్త గురుకులాలను ఏర్పాటు చేస్తున్నారు. మెగా డీఎస్సీ పోటీ పరీక్షల్లో సత్తా చాటేలా బీసీ అభ్యర్థులకు 26 జిల్లాల్లోనూ బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా 5,720 మందికి ఉచిత శిక్షణ అందజేశారు. ఆన్ లైన్ ద్వారా డిఎస్సీ శిక్షణ అందజేశారు. త్వరలో కూటమి ప్రభు త్వం మరో డీఎస్సీ ప్రకటించనుంది. ప్రకటన రాగానే డీఎస్సీ ఉచిత కోచింగ్ ప్రారంభించబోతున్నాం. 100 మంది బీసీ అభ్యర్థు లకు సివిల్ సర్వీస్ కు ఉచిత కోచింగ్ అందజేస్తున్నాం. గతేడాది మొదటి విడత బ్యాచ్ కు శిక్షణ ఇవ్వగా, ప్రస్తుతం మరో రెండో విడత బ్యాచ్ కు నిపుణులైన అధ్యాపకులతో తర్ఫీదు ఇస్తున్నాం.

బీసీల ఆత్మగౌరవానికి పెద్ద పీట వేస్తూ ఆ సామాజిక వర్గానికి చెందిన మహనీయుల జయంతులను రాష్ట్ర పండుగలుగా నిర్వ హిస్తున్నాం. వాల్మీకి మహర్షి, వడ్డే ఓబన్న, మొల్ల, సర్దార్ గౌతు లచ్చన్న, భక్త కనకదాస జయంతులను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నాం. మహాత్మా జ్యోతిరావు పూలే 200 ఏళ్ల జయంతిని ఘనంగా నిర్వహించాం. అగ్ని కులక్షత్రియుల జాతిపిత పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ, ప్రజాబంధు ప్రగడకోటయ్య, శెట్టి బలిజల ఆరాధ్య దైవం దొమ్మేటి వెంకటరెడ్డి జయంతులను కూడా రాష్ట్ర పండుగలుగా నిర్వహిస్తున్నాం. అమరావతిలో పొట్టి శ్రీరాముల స్మృతివనం నిర్మిస్తున్నాం. ఆర్యవైశ్యుల ఆత్మగౌరవాన్ని గౌరవిస్తూ... వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆరోజు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పి స్తున్నాం. వాసవీ మాత పేరుతో ఆమె జన్మస్థలమైన పెనుగొండను వాసవీ పెనుగొండగా నామకరణం చేశాం. ఇలా ప్రతి బీసీ కులాల ను, వృత్తులను పేరు పేరును గుర్తించుకుంటూ సీఎం చంద్రబాబు వారి అభ్యున్నతికి, రాజకీయ, సామాజిక, ఆర్థిక గుర్తింపునకు అహర్నిశలు కృషి చేస్తున్నారు. బీసీలు అంటే వెనుకబడిన వర్గమే కాదు సమాజానికి బ్యాక్‌బోన్‌లని, బీసీల అభివృద్ధితోనే రాష్ట్రాభి వృద్ధి ముడిపడి ఉందని నమ్మిన వ్యక్తి సీఎం చంద్రబాబు. అందుకే బీసీల్లో ఉండే రైతు, చేనేత, కుమ్మరి, నాయీ, రజక, వడ్రంగి వంటి ఎన్నో కులాల కుటుంబాల్లో పెద్దన్నయ్యగా ఉంటూ వారి సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేస్తున్నారు.

**ఎస్.సవిత,**
**బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ,**
**చేనేత జౌళి మంత్రి**





## ఐఐటీ, నీట్ ఎక్సలెన్స్ సెంటర్‌లో సౌకర్యాలు

**మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఆదేశం**

అమరావతి(చైతన్యరథం): ఐఐటీ, నీట్ ఎక్సలెన్స్ సెంటర్‌లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు అత్యాధునిక సౌకర్యాలు కల్పించాలని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి సంబంధిత అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయంలో గురువారం గుంటూరు జిల్లా తాడికొండలోని ఐఐటీ నీట్ ఎక్సలెన్స్ సెంటర్‌లో అదనపు భవనాల నిర్మాణం,విద్యార్థులకు సౌకర్యాల కల్పనపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఐఐటీ,నీట్ క్యాంపస్ నిర్మాణ నమూనాను మంత్రి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. క్యాంపస్‌లో అదనపు భవనాల నిర్మాణం, అంతర్గత రోడ్లతో పాటు వాకింగ్ ట్రాక్, బ్యాడ్మింటన్ కోర్టు, కోకో కోర్టు, మల్టీపర్పస్ కోర్టు ఏర్పాటు చేయాలని తెలిపారు.ఐఐటీ నీట్ ఎక్సలెన్సీ సెంటర్లద్వారా పేదవిద్యార్థులకు బంగారు భవితను అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ సమీక్షలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి వి.ప్రసన్న వెంకటేష్, ఏపీ ఈడబ్ల్యూఐడీసీ ఈఈ అనిల్ కుమార్, గుంటూరు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయి, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ డీసీవో తదితరులు పాల్గొన్నారు.

# పంటల బీమాలో రైతులు త్వరపడాలి



- **నమోదుకు ఈ నెలాఖరు వరకే గడువు**
- **ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రతి రైతు రక్షణ పొందాలి**
- **రైతు చెల్లించాల్సిన ప్రీమియం వాటా స్వల్పమే**
- **ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో రైతులకు అవగాహన కల్పించాలి**
- **అసెంబ్లీ వేదికగా రైతులకు మంత్రి అచ్చెన్నాయుడు పిలుపు**

అమరావతి (చైతన్యరథం): ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం, అనిశ్చిత వర్షపాతం పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు పంటల బీమా విషయంలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. పంటల బీమా నమోదు చేసుకునేందుకు ఈ నెలాఖరు వరకే గడువు ఉన్నందున రైతులు ఆలస్యం చేయకుండా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని శాసనసభ వేదికగా పిలుపునిచ్చారు. వాతావరణ పరిస్థితులు ఎప్పుడు ఎలా మారతాయో అంచనా వేయలేమని, ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం వంటి పరిస్థితుల్లో రైతుకు ఆర్థిక రక్షణ కల్పించడంలో పంటల బీమా అత్యంత కీలకమని మంత్రి పేర్కొన్నారు. రైతులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు.

**రైతుపై ప్రీమియం భారం చాలా స్వల్పమే**

పంటల బీమా కోసం రైతులు చెల్లించాల్సిన ప్రీమియం వాటా చాలా తక్కువగా ఉంటుందని అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రాంతం, పంటను బట్టి రైతు వాటా మారుతుందని, కొన్ని ప్రాంతాల్లో రైతు చెల్లించాల్సిన మొత్తం అత్యంత స్వల్పంగా ఉందన్నారు. మిగిలిన ప్రీమియం భారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తున్నాయని వివరించారు. స్వల్ప మొత్తాన్ని చెల్లించడం ద్వారా పంట నష్టం సంభవించినప్పుడు బీమా రక్షణ పొందే అవకాశం ఉన్నందున రైతులు దీనిని నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.

**ఎమ్మెల్యేలు ప్రత్యేక చొరవ తీసుకోవాలి**

పంటల బీమా నమోదును కేవలం వ్యవసాయ శాఖ కార్యక్రమంగా చూడకుండా ప్రజాప్రతినిధులు కూడా బాధ్యత తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. ప్రతి ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో రైతులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, పంటల బీమా వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్హులైన రైతులందరూ బీమా నమోదు చేసుకునేలా ఎమ్మెల్యేలు చొరవ చూపాలని కోరారు. ఎల్‌నినో ప్రభావం ఉన్న నేపథ్యంలో రైతులు పంటల బీమాను తేలికగా తీసుకోవద్దు. ఈ నెలాఖరు వరకే అవకాశం ఉంది. చివరి రోజు వరకు వేచి చూడకుండా ప్రతి రైతు వెంటనే నమోదు చేసుకోవాలి. స్వల్ప ప్రీమియంతో లభించే బీమా రక్షణను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి అని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు.

# రాజధానిలోకి మరిన్ని రోడ్ల కనెక్టివిటీ

- **నిర్మాణాల పూర్తికి వేగంగా చర్యలు**
- **ఈ 13, ఈ 15, ఈ 1, ఈ 3 రోడ్ల పురోగతిపై మంత్రి నారాయణ సమీక్ష**



అమరావతి (చైతన్యరథం): రాజధాని అమరావతిలోకి వివిధ ప్రాంతాల నుంచి మరింత సులభంగా, వేగంగా ప్రవేశించేలా అదనపు రోడ్లను త్వరితగతిన అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఇప్పటికే సీడ్ యాక్సెస్ రోడ్డు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో.. రాజధానికి ఇతర ప్రాంతాల నుంచి ఉన్న రహదారి కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంపై పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ దృష్టి సారించారు.

ఈ నేపథ్యంలో ఈ 13, ఈ 15, ఈ 1, ఈ 3 రోడ్ల నిర్మాణ పనుల పురోగతిపై మంత్రి నారాయణ గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు సీఆర్డీఏ కమిషనర్ విజయరామరాజు, అడిషనల్ కమిషనర్ కార్తీక్, గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మతో పాటు సంబంధిత ఇంజినీర్లు, అధికారులు హాజరయ్యారు.

సమీక్షలో ఆయా రోడ్ల నిర్మాణ పనుల ప్రస్తుత పరిస్థితి, పెండింగ్‌లో ఉన్న అనుమతులు, భూసంబంధిత అంశాలు, రైల్వే అనుమతులు, తదితర అంశాలపై అధికారులను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోడ్ల నిర్మాణానికి సంబంధించి అవసరమైన రైల్వే, ఇతర అనుమతులు దాదాపు కొలిక్కి వచ్చాయని అధికారులు వివరించారు.

**మంగళగిరి-అమరావతి ఈ 15 రోడ్డు**

మంగళగిరి నుంచి అమరావతిలోకి నేరుగా ప్రవేశించే ఈ 15 రోడ్డు నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని అధికారులు మంత్రికి తెలిపారు. ఈ రహదారి పూర్తయితే మంగళగిరి వైపు నుంచి అమరావతికి వచ్చే వాహనాలకు మరింత మెరుగైన రాకపోకల సౌకర్యం అందుబాటులోకి రానుంది.

**జాతీయ రహదారి-ఎయిమ్స్ మీదుగాఈ 13**

16వ నంబర్ జాతీయ రహదారి నుంచి ఎయిమ్స్ మీదుగా అమరావతిలోకి ప్రవేశించే ఈ 13 రోడ్డు కూడా రాజధాని రహదారి కనెక్టివిటీలో కీలకంగా మారనుంది. ఈ రహదారి నిర్మాణాన్ని కూడా వేగవంతం చేసి అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరంపై సమీక్షలో చర్చించారు.

**సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ 3 - ఎలివేటెడ్ కారిడార్**

ఇప్పటికే సీడ్ యాక్సెస్ రోడ్డు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో.. దాని తదుపరి దశ పనులపై కూడా మంత్రి నారాయణ ప్రత్యేకంగా దృష్టి సారించారు. సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ 3 మూడో దశలో నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్‌ను (స్టీల్ బ్రిడ్జి-మణిపాల్ హాస్పిటల్) కూడా త్వరగా ప్రారంభించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే రాజధాని ప్రాంతంలోని కీలక ప్రాంతాలకు మరింత మెరుగైన రవాణా కనెక్టివిటీ ఏర్పడనుంది.

**కరకట్టకు సమాంతరంగా ఈ 1 రోడ్డు**

సీడ్ యాక్సెస్ రోడ్డుకు సమాంతరంగా కరకట్టను వెడల్పు చేస్తూ ప్రకాశం బ్యారేజి వరకు నిర్మిస్తున్న ఈ 1 రోడ్డు పనులపై కూడా మంత్రి సమీక్షించారు. ఈ రహదారి ద్వారా విజయవాడ వైపు నుంచి అమరావతికి మరింత ప్రత్యామ్నాయ, సులభమైన రహదారి కనెక్టివిటీ అందుబాటులోకి రానుంది.

రాజధాని ప్రాంతంలో ఒకే రహదారిపై ఆధారపడకుండా వివిధ ప్రాంతాల నుంచి బహుళ మార్గాల్లో అమరావతిలోకి ప్రవేశించే అవకాశం కల్పించడమే లక్ష్యంగా రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.

అన్ని రోడ్ల పనులు నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా సంబంధిత శాఖలు, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మను మంత్రి నారాయణ ఆదేశించారు.

రాజధాని నిర్మాణం వేగం పుంజుకున్న నేపథ్యంలో.. అమరావతికి రహదారి కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడం ద్వారా భవిష్యత్‌లో పెరగనున్న ట్రాఫిక్, రవాణా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను సిద్ధం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# రేర్ ఎర్త్ మినరల్స్‌కు చిరునామాగా ఏపీని మారుస్తాం

- **పర్మినెంట్ మేగ్నెట్స్ స్థానికంగానే తయారు చేసేలా చర్యలు**
- **మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టీకరణ**
- **ఏపీ సముద్ర తీరంలో అపారమైన వనరులున్నాయి**
- **రేర్ ఎర్త్ మినరల్స్‌పై ఏపీలో ప్రత్యేక కోర్సులు ప్రారంభించాలి**
- **మంత్రికి ప్రతిపాదనలు అందించిన ప్రొఫెసర్ల బృందం**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో రేర్ ఎర్త్ మినరల్స్ నిక్షేపాలు సమృద్ధిగా ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకుంటటూ దేశ మైనింగ్ రంగంలో ఏపీని అగ్రస్థానంలో నిలిపుదామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. అటామిక్ ఎనర్జీ మాజీ శాస్త్రవేత్త ఆచార్య యుగంధర్ రావు బృందం సచివాలయంలోని మంత్రి చాంబర్లో గురువారం కలిసి ప్రతిపాదనలు అందించారు. విమానాలు, ఈవీలు, రక్షణరంగ వాహనాల తయారీకి వినియోగించే సూపర్ మెటల్ మినరల్స్ వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని విన్నవించారు. రేర్ ఎర్త్ మినరల్స్ మీద వర్సిటీల్లో ప్రత్యేక కోర్సులు ప్రవేశపెడితే భవిష్యత్తు మొత్తం ఏపీదేనన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రేర్ ఎర్త్ మినరల్స్‌ని అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదాయం పెంచడంతో పాటుగా, ఖనిజాలను సమృద్ధిగా వినియోగించుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతంలో అందుబాటులో ఉన్న ఖనిజాలు, వాటి ద్వారా కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఏపీ సముద్రతీరంలో ఇల్లిమనైట్, రూటాయిల్, జిర్కాన్, గార్నెట్, సిలిమినైట్ అండ్ మోనజైట్ అపారంగా ఉన్నాయి. ఈ వనరుల వెలికితీతను కేవలం ప్రభుత్వ రంగంలో నిర్వహించడం కాస్త కష్టతరమైనందున.. ప్రైవేట్ ఇన్వెస్ట్మెంట్ అవసరం. టెక్నాలజీ ప్రాసెసింగ్ ఫీల్డ్‌లో చైనా చాలా ముందు ఉంది. తర్వాతి స్థానంలో జపాన్, ఆస్ట్రేలియా ఉన్నాయి. ప్రత్యేకంగా రేర్ ఎర్త్ మినరల్స్, పర్మినెంట్ మేగ్నెట్స్ విషయంలో ఏపీలోని యూనివర్శిటీల్లో ప్రత్యేక కోర్సులు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అదే సమయంలో నేషనల్ క్రిటికల్ మినరల్ పాలసీ 2026 ద్వారా కేంద్ర ప్రభుత్వం కూడా తోడ్పాటు అందిస్తోందని తెలిపారు.

దీనిపై మంత్రి రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో రేర్ ఎర్త్ మినరల్స్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తోందని పేర్కొన్నారు. ఈ అంశాలన్నింటినీ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి స్థానికంగా రేర్ ఎర్త్ మినరల్స్, పర్మినెంట్ మేగ్నెట్స్ విషయంలో ప్రత్యేక కోర్సులు ప్రవేశ పెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే ఐఆర్ఈఎల్ కేంద్రాన్ని పరిశీలించేలా చొరవ తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ యుగంధర్, సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ డా. హెచ్.పురుషోత్తం, ప్రొ.వేణుబాబు పాల్గొన్నారు.

## ఏడుగురు మత్స్యకారుల కోసం

# భారీ సెర్చ్ ఆపరేషన్

- నేవీ, కోస్ట్‌గార్డ్‌కు చెందిన 7 నౌకలతో సముద్రంలో విస్తృత గాలింపు
- డోర్నియర్ విమానాలు, నేవీ హెలికాప్టర్‌తో గగనతలం నుంచి సెర్చ్
- హల్దియా, పారాదీప్ కోస్ట్‌గార్డ్ కేంద్రాలు కూడా రంగంలోకి
- అందుబాటులో ఉన్న అన్ని వనరులతో గాలింపు చర్యలు ముమ్మరం
- మత్స్యకారులను సురక్షితంగా తీసుకొచ్చే వరకు కొనసాగిస్తాం
- కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలి
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి (చైతన్యరథం): ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు చెందిన బోటులో చేపల వేటకు వెళ్లి అదృశ్యమైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం భారత నౌకాదళం, భారత తీర రక్షక దళం సమన్వయంతో సెర్చ్ అండ్ రెస్క్యూ (ఎస్ఏఆర్) ఆపరేషన్‌ను మరింత ముమ్మరం చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మత్స్యకారులను సురక్షితంగా వెనక్కి తీసుకురావడమే లక్ష్యంగా సముద్రం, గగనతలం నుంచి విస్తృతంగా గాలిస్తున్నామని చెప్పారు. ఆగస్టు 3న ఏడుగురు మత్స్యకారులతో బోటు చేపల వేటకు వెళ్లిందని, నిర్ణీత సమయానికి తిరిగి రాకపోవడంతో సమాచారం అందిన వెంటనే సంబంధిత శాఖలను అప్రమత్తం చేసి గాలింపు చర్యలు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ఆగస్టు 17 నుంచి భారత తీర రక్షక దళానికి చెందిన ఐదు నౌకలు గాలింపు చర్యల్లో పాల్గొంటుండగా, భారత నౌకాదళం మరో రెండు నౌకలను రంగంలోకి దించడంతో ప్రస్తుతం మొత్తం ఏడు నౌకలు సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్నాయని వెల్లడించారు. నేవీకి చెందిన ఒక నౌక విశాఖపట్నం నుంచి పారాదీప్ వైపు, మరో నౌక ఓడలరేవు వైపు గాలింపు కొనసాగిస్తున్నట్లు వివరించారు.

సముద్రంలో గాలింపుతో పాటు వైమానిక సెర్చ్ ఆపరేషన్‌ను కూడా మరింత విస్తృతం చేసినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. విశాఖపట్నం, కోల్‌కతా, చెన్నై కేంద్రాల నుంచి డోర్నియర్ విమానాలతో సెర్చ్ పార్టీలు నిర్వహిస్తున్నామని, కోల్‌కతా నుంచి నేవీ హెలికాప్టర్‌ను కూడా గాలింపు చర్యలకు వినియోగిస్తున్నామని చెప్పారు. సముద్రంలోని సంభావ్య ప్రాంతాలను గగనతలం నుంచి జల్లెడ పడుతూ గాలింపు పరిధిని నిరంతరం విస్తరిస్తున్నట్లు పేర్కొన్నారు. హల్దియా, పారాదీప్ కోస్ట్‌గార్డ్ కేంద్రాలను కూడా గాలింపు చర్యల్లో భాగస్వామ్యం చేశామని మంత్రి తెలిపారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగిస్తూ సముద్ర ప్రాంతంలో విస్తృతంగా గాలిస్తున్నామని, గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు.

భారత నౌకాదళం, భారత తీర రక్షక దళం పరస్పర సమన్వయంతో గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయని, రాష్ట్ర మత్స్యశాఖ అధికారులు కూడా సంబంధిత అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. అందుబాటులో ఉన్న వివరాల ఆధారంగా బోటు ప్రయాణించి ఉండే అవకాశమున్న సముద్ర మార్గాలు, తీర ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని గాలింపు పరిధిని మరింత విస్తరిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు మత్స్యకారుల ఆచూకీకి సంబంధించి సానుకూల సమాచారం అందకపోయినా ఏ దశలోనూ ప్రయత్నాలను ఆపడం లేదు. ఏడు నౌకలతో పాటు డోర్నియర్ విమానాలు, నేవీ హెలికాప్టర్‌తో విస్తృతంగా గాలిస్తున్నాం. నేవీ, కోస్ట్‌గార్డ్, మత్స్యశాఖ మధ్య నిరంతర సమన్వయం కొనసాగుతోంది. ఒక్క అవకాశం కూడా వదలకుండా మన మత్స్యకారులను గుర్తించి సురక్షితంగా తీసుకురావడానికి సాధ్యమైన ప్రతి చర్య చేపడుతున్నాం అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఏడుగురు మత్స్యకారుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని మంత్రి కోరారు. వారి కుటుంబాల ఆందోళనను ప్రభుత్వం అర్థం చేసుకుంటోంది. మన మత్స్యకారులు క్షేమంగా తిరిగి రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. వారిని గుర్తించి సురక్షితంగా తీసుకొచ్చే వరకు గాలింపు చర్యలు నిరంతరాయంగా కొనసాగిస్తాం అని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.

## అభివృద్ధి, సంక్షేమం

# రెండు కళ్ళుగా కూటమి పాలన

- సూపర్ సిక్స్ ని సూపర్ హిట్ చేశాం
- దేశానికే ఆదర్శంగా మన రాష్ట్ర సంక్షేమం
- మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



అమరావతి (చైతన్యరథం): అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా కూటమి పాలన సాగుతోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. గురువారం అసెంబ్లీలో మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ... సూపర్ సిక్స్ ని సూపర్ హిట్ చేశామన్నారు. దేశానికే ఆదర్శంగా మన రాష్ట్ర సంక్షేమం నిలుస్తోంది.

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పెద్ద మొత్తంలో ఫించన్లు ఇస్తున్నాం. అన్న క్యాంటీన్లతో పేదలకు రూ. 5 భోజనం పెడుతున్నాం. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తున్నాం. పాఠశాలల బలోపేతం, తల్లికి వందనంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సంఖ్య గణనీయంగా పెరిగింది, స్త్రీ శక్తికి సమర్థవంతంగా అమలు చేస్తున్నాం. ఎన్నికల్లో చెప్పకపోయినా దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు.

ఎన్నికల హామీలన్నీ నెరవేర్చాం. తల్లికి వందనం: రూ.20,090 కోట్లు చెల్లింపు, 67.27 లక్షల మంది విద్యార్థులకు సాయం. స్త్రీ శక్తి: మహిళలకు ఉచితంగా ఏపీఎస్ఆర్టీసీ బస్సు ప్రయాణం– 87 కోట్ల ప్రయాణాలు. దివ్యాంగ శక్తి: దివ్యాంగులకు ఉచితంగా ఏపీఎస్ ఆర్టీసీ బస్సు ప్రయాణం– 6.40 కోట్ల ప్రయాణాలు. దీపం 2 పథకం: ఏటా ఉచితంగా 3 సిలిండర్ల పంపిణీ ఇప్పటికి 4.57 కోట్ల సిలిండర్లు. అన్న క్యాంటీన్లు: రాష్ట్రంలో 269 ఏర్పాటు 10.71 కోట్ల భోజనాలు. అన్నదాత సుఖీభవ : 46 లక్షల మంది రైతులకు 4 విడతలు కలిపి రూ.14,664 కోట్లు జమ. ఎన్టీఆర్ భరోసా: ఇప్పటివరకు సామాజిక భద్రతా పెన్షన్ల కోసం రూ.71 వేల కోట్లకు పైగా వ్యయం. మత్స్యకార సేవలో: ఏడాదికి 20 వేల చొప్పున 1.30 లక్షల మందికి రూ.505 కోట్లు. ఆటో డ్రైవర్ల సేవలో: ఏడాదికి రూ.15,000... రూ.436 కోట్లు జమ, 2.90 లక్షల మందికి లబ్ధి. అంగన్ వాడీ కార్యకర్తలు, ఆశాలకు గ్రాట్యుటీ అమలు, బాలింతలకు ఎన్టీఆర్ బేబీ కిట్లు, 300 తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్లు ప్రారంభం. పీ 4 ద్వారా పేదరిక నిర్మూలన 2 లక్షల బంగారు కుటుంబాలకు మార్గదర్శుల చేయూత. 5.5 లక్షల ఇళ్లు పేదలకు అందజేత... మరో 5 లక్షల ఇళ్ల నిర్మాణానికి సంకల్పం.

బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం కోసం పలు పథకాలు తెచ్చాం. మత్స్యకారుల కోసం జీ.వో 217 రద్దు– నీటి వనరులపై హక్కు. గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపుల కేటాయింపు. వివాదాలకు తావివ్వకుండా ఎస్సీ వర్గీకరణ. స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు. ఈ ఏడాది మైనారిటీ సంక్షేమానికి రూ.3,670 కోట్లు. 8,427 మంది పాస్టర్లకు నెలకు రూ.5,000 చొప్పున గౌరవ వేతనానికి రూ.51 కోట్లు. ఇమామ్ కు నెలకు రూ.10,000 మౌజన్లకు రూ.5,000 చొప్పున ఏడాదికి రూ.90 కోట్లు. వక్ఫ్ బోర్డు పునరుద్ధరణ– అన్ని వర్గాలకు ప్రాధాన్యం. పురోహితులకు నెలకు రూ.15,000కు వేతనాల పెంపు. నాయీ బ్రాహ్మణులకు నెలకు రూ.25,000కు వేతనాల పెంపు. చేనేతలకు ఉచిత విద్యుత్: నెలకు మగ్గానికి 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు, నేతన్న నేస్తం కింద రూ.25 వేల ఆర్థిక సాయం. జూనియర్ లాయర్లకు రూ.10,000 గౌరవ వేతనం. 20 లక్షల ఎస్సీ, ఎస్టీల కుటుంబాలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్. సోలార్ రూఫ్ టాపు బీసీలకు రూ.20 వేల అదనపు సాయం. లక్ష మంది మహిళా పారిశ్రామిక వేత్తలు ఏర్పాటుతో పాటు మరో 5 లక్షల మంది లక్ష్యంగా పనిచేస్తున్నాం.


అదే విధంగా ప్రభుత్వ ఉద్యోగాల నియామకంతో పాలు ఉద్యోగుల మేలు చేకూర్చేలా పలు నిర్ణయాలు తీసుకున్నాం. మెగా డీఎస్సీ రిక్రూట్మెంట్... ముఖ్యమంత్రి తొలి సంతకం, 15,941 టీచర్ పోస్టుల భర్తీ. 5,757 కానిస్టేబుల్ పోస్టుల నియామకాలు పూర్తి, రూ.4,500 నుంచి రూ.12,500కు స్టైఫండ్ పెంపు. ప్రభుత్వ ఉద్యోగులకు రెండేళ్లలో రూ.30 వేల కోట్ల బకాయిలు చెల్లింపులు చేశామన్నారు.

సీఎం చంద్రబాబుకు మంచి పేరొస్తుందన్న కుట్రతో అమరావతిని జగన్ విధ్వంసం చేయాలని చూశారు. మెక్కవోని దీక్షతో సీఎం చంద్రబాబు అమరావతి నిర్మిస్తున్నారు. విశాఖకు రైల్వే జోన్ తెచ్చాం, చెప్పిన మాట ప్రకారం మార్కాపురం, పోలవరం జిల్లాలు ఏర్పాటు చేశామని, వెలుగొండ పూర్తి చేసి ఈ నెలలోనే నీళ్లిస్తున్నామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు.

## గోదావరి పుష్కరాలకు

# రూ.1,294 కోట్ల నిధులు

- మండలిలో మంత్రి నారాయణ వెల్లడి




అమరావతి (చైతన్యరథం): రాబోయే గోదావరి పుష్కరాల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఏర్పాట్లు, నిధుల కేటాయింపుపై శాసనమండలిలో పురపాలక శాఖ మంత్రి నారాయణ గురువారం కీలక వివరాలు వెల్లడించారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాబోయే గోదావరి పుష్కరాల కోసం పురపాలక శాఖకు ఆర్థిక శాఖ రూ.150 కోట్లు కేటాయించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. పుష్కరాల నిర్వహణకు అవసరమైన అదనపు నిధుల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం కోరుతోందని మంత్రి వెల్లడించారు. ఈ మేరకు కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారని తెలిపారు. ఇవిగాక, గోదావరి పుష్కరాలు జరిగే ప్రాంతాల్లోని మున్సిపాలిటీల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం యూఐడీఎఫ్, యూసీఎఫ్ వంటి పథకాల ద్వారా రూ.1,144 కోట్లను కేటాయించినట్లు మంత్రి నారాయణ వివరించారు.

పుష్కరాల సందర్భంగా భక్తులకు అవసరమైన మౌలిక వసతులు, పట్టణ సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. పుష్కరాలు జరిగే ప్రాంతాల్లో మున్సిపాలిటీల పరిధిలో అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టేందుకు ఈ నిధులను వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో నిధులు సమకూర్చుతూ, పుష్కర ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరిచే చర్యలు చేపడుతోందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. మొత్తంగా గోదావరి పుష్కరాల కోసం పురపాలక శాఖకు రూ.150 కోట్లు, యూఐడీఎఫ్, యూసీఎఫ్ వంటి పథకాల ద్వారా పుష్కర ప్రాంతాల మున్సిపాలిటీలకు మరో రూ.1,144 కోట్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు.

# రైతు సంక్షేమమే లక్ష్యం..

# వ్యవసాయ రంగంలో సమూల మార్పులు

- **అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్‌తో రైతుల ఖాతాల్లో రూ.14,664.33 కోట్లు**
- **AP AIMS 2.0తో 15.69 లక్షల మంది రైతులకు పారదర్శకంగా ఎరువుల పంపిణీ**
- **3.20 లక్షల మందికి పైగా కౌలు రైతులకూ ఎరువులు**
- **అక్టోబర్ అవసరాలకు 9.20 లక్షల మెట్రిక్ టన్నులు సిద్ధం**
- **రెండేళ్లలో మార్కెట్ ఇంటర్వెన్షన్‌కు దాదాపు రూ.800 కోట్లు**
- **రూ.1,900 కోట్ల బీమా వాటా కట్టకుండా రైతులను నష్టపరిచిన గత ప్రభుత్వం**
- **దమ్ముంటే వైసీపీ నేతలు సభకు వచ్చి ఐదేళ్ల పాలనపై చర్చించాలి**
- **శాసనసభలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర జనాభాలో దాదాపు 60 నుంచి 65 శాతం మంది వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారని, అందుకే రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. శాసనసభలో వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపై గురువారం జరిగిన చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పెట్టుబడి సాయం నుంచి పంటల బీమా వరకు, ఎరువుల పంపిణీ నుంచి మార్కెట్ ఇంటర్వెన్షన్ వరకు రైతుకు ప్రతి దశలో ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ ద్వారా ఇప్పటివరకు రైతుల బ్యాంకు ఖాతాల్లో మొత్తం రూ.14,664.33 కోట్లు జమ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.8,903.10 కోట్లు, కేంద్ర ప్రభుత్వ వాటా రూ.5,761.23 కోట్లు అని వివరించారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో దాదాపు 47 లక్షల మంది రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. తణుకు నియోజకవర్గంలోనే 16,954 రైతు కుటుంబాలు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందాయని చెప్పారు. డీబీటీ విధానంలో ఎన్‌పీసీఐ అనుసంధానిత బ్యాంకు ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేస్తున్నామని తెలిపారు. ఆధార్, ఎన్‌పీసీఐ మ్యాపింగ్, బ్యాంకు ఖాతాల అనుసంధానం వంటి సాంకేతిక సమస్యల కారణంగా నగదు అందని అర్హులైన రైతులను గుర్తించి, వారి వివరాలను జిల్లాలకు పంపించామని చెప్పారు. ఆయా జాబితాలను రైతు సేవా కేంద్రాలతో పాటు అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. రిజెక్టెడ్ పేమెంట్స్ సమస్యలను సరిచేసి అర్హులైన ప్రతి రైతుకు ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

**ఎరువుల పంపిణీలో సమూల మార్పు - AP AIMS 2.0**

ఎరువుల పంపిణీలో అక్రమ మళ్లింపులు, అధిక ధరలు, రైతులు గంటల తరబడి క్యూలలో నిలబడే పరిస్థితులకు అడ్డుకట్ట వేసేందుకు AP AIMS 2.0 విధానాన్ని అమలు చేస్తున్నామని అచ్చెన్నాయుడు తెలిపారు. వాస్తవ సాగుదారు, సర్వే నంబర్, సాగు విస్తీర్ణం, పంట రకం, వ్యవసాయ విశ్వవిద్యాలయం సిఫార్సుల ఆధారంగా రైతుకు ఎంత ఎరువు అవసరమో శాస్త్రీయంగా నిర్ధారించి సరఫరా చేస్తున్నామన్నారు. పంట అవసరాలకు అనుగుణంగా దశలవారీగా ఎరువులు అందిస్తున్నామని చెప్పారు. AP AIMS ద్వారా ఇప్పటివరకు 15.69 లక్షల మంది రైతులకు పారదర్శకంగా ఎరువులు అందించామని మంత్రి వెల్లడించారు.

కౌలు రైతులకు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని, ఇప్పటివరకు 3,20,880 మంది కౌలు రైతులకు ఎరువులు అందించినట్లు వివరించారు. ప్రారంభంలో రైతులు ఎదుర్కొన్న ఓటీపీ సమస్యలను పరిష్కరించి ప్రస్తుతం బయోమెట్రిక్ వేలిముద్ర ద్వారా కూడా ఎరువులు పొందే అవకాశం కల్పించామని చెప్పారు. రైతు సేవా కేంద్రాల్లో సహాయక వ్యవస్థతో పాటు హెల్ప్‌డెస్కులు, కాల్‌సెంటర్ల ద్వారా రైతుల సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. సీఎస్‌సీల ద్వారా ఉచిత ప్రీ-బుకింగ్ సౌకర్యాన్ని కల్పించామని, ఇందుకోసం ప్రతి లావాదేవీకి సీఎస్‌సీకి ప్రభుత్వం రూ.15 చెల్లిస్తోందని వివరించారు. రాష్ట్రంలో ఎరువుల కొరతపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. 2026 అక్టోబర్ వరకు అంచనా అవసరాలను దృష్టిలో పెట్టుకుని మొత్తం 9.20 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఇందులో 3.69 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 89 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. రైతుకు అవసరమైన సమయంలో అవసరమైన ఎరువు అందించేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో పనిచేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం కృష్ణా, కాకినాడ జిల్లాల్లో చేపట్టిన పైలట్ విధానంతో పోలిస్తే రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన [illegible] విధానం సమర్థవంతమైన ఫలితాలు ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేసే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలించే స్థాయికి ఈ వ్యవస్థ చేరిందన్నారు.

గత వైసీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కింద రూ.12,500 ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేవలం రూ.7,500 మాత్రమే ఇచ్చి రైతులను మోసం చేసిందని అచ్చెన్నాయుడు విమర్శించారు. ఐదేళ్ల పాలనలో భూసార పరీక్షలు, వ్యవసాయ యాంత్రీకరణ, సకాలంలో విత్తనాల సరఫరా, మార్కెట్ ఇంటర్వెన్షన్ వంటి కీలక వ్యవసాయ కార్యక్రమాలను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటన్నింటినీ ఒక్కొక్కటిగా పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. రైతులకు ఉచిత భూసార పరీక్షలు, వ్యవసాయ యాంత్రీకరణకు ప్రోత్సాహం, నియోజకవర్గాల వారీగా ట్రాక్టర్ల పంపిణీ కార్యక్రమాలను చేపడుతున్నామని వివరించారు.

**ధరలు పడితే చూస్తూ కూర్చోలేదు.. రూ.800 కోట్లతో అండ**

పంటల ధరలు పడిపోయినప్పుడు రైతును మార్కెట్‌కు వదిలేయకుండా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుందని మంత్రి తెలిపారు. గడిచిన రెండేళ్లలో పొగాకు, ఉల్లిపాయలు, మామిడి, కోకో, టమోటా, చీని, తదితర పంటల రైతులను ఆదుకునేందుకు మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా దాదాపు రూ.800 కోట్ల మేర సాయం అందించామని వెల్లడించారు. పంట పండించడం రైతు బాధ్యత అయితే.. ధర పడిపోయినప్పుడు రైతుకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. పంటల బీమా విషయంలో గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని అచ్చెన్నాయుడు ఆరోపించారు. కేంద్రానికి చెల్లించాల్సిన సుమారు రూ.1,900 కోట్ల బీమా వాటాను చెల్లించకపోవడంతో రాష్ట్ర రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులకు పంటల బీమా రక్షణ కల్పించేందుకు నమోదు గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించినట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో రైతు చెల్లించాల్సిన వాటా అత్యంత స్వల్పంగా ఉందని, ఉదాహరణకు కోనసీమలో సుమారు రూ.70, కర్నూలులో సుమారు రూ.32 వరకు మాత్రమే రైతు వాటా ఉండగా, మిగిలిన ప్రీమియం భారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే భరిస్తున్నాయని వివరించారు. ప్రతి ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి రైతు నమోదు చేసుకునేలా చొరవ తీసుకోవాలని మంత్రి కోరారు.

**50 లక్షల ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయమే లక్ష్యం**

రసాయనిక ఎరువుల విచక్షణారహిత వినియోగాన్ని తగ్గించి శాస్త్రీయంగా అవసరమైన మేరకే ఎరువులు వినియోగించేలా రైతుల్లో అవగాహన కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రాష్ట్రంలో 50 లక్షల ఎకరాలకు విస్తరించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. 'రైతన్నా మీ కోసం' కార్యక్రమం ద్వారా అధికారులు నేరుగా రైతుల వద్దకు వెళ్లి [illegible] సహా ఆధునిక వ్యవసాయ విధానాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. వైసీపీ నేతలు శాసనసభకు వచ్చి రైతుల సమస్యలపై చర్చించకుండా బయట కూర్చొని ప్రభుత్వం ఏమీ చేయడం లేదని విమర్శించడం విడ్డూరంగా ఉందని అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు రైతులకు ఏం చేశారో చెప్పండి. దమ్ముంటే సభకు రండి. మీ ఐదేళ్ల పాలనలో రైతులకు ఏం చేశారో మీరు చెప్పండి.. ఈ రెండేళ్లలో మేం ఏం చేశామో చెబుతాం. ఎవరు రైతుకు అండగా నిలిచారో ప్రజలే నిర్ణయిస్తారు అని వైసీపీ నేతలకు మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. పెట్టుబడి సాయం నుంచి పంటల బీమా వరకు.. విత్తనం నుంచి ఎరువు వరకు.. భూసార పరీక్ష నుంచి యాంత్రీకరణ వరకు.. పంట ఉత్పత్తి నుంచి గిట్టుబాటు ధర వరకు రైతుకు ప్రతి అడుగులో అండగా నిలవడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ విధానం అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## సజ్జలపై 'సంగం' న్యాయపోరాటం

**- తప్పుడు ఆరోపణలపై పరువు నష్టం కేసు దాఖలు చేసిన డెయిరీ**

అమరావతి (చైతన్యరథం): వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై సంగం డెయిరీ పరువు నష్టం కేసు దాఖలు చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) సంగం డెయిరీ నెయ్యి సరఫరా చేస్తోందని, అయితే పాల సేకరణ చేయకుండానే నెయ్యి సరఫరా చేస్తున్నారంటూ సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన ఆరోపణలను సంగం డెయిరీ తీవ్రంగా ఖండించింది. వాస్తవాలను కప్పిపుచ్చి తమ సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించేలా తప్పుడు ఆరోపణలు చేశారని పిటిషన్‌లో పేర్కొంది. చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల్లో సంగం డెయిరీ రైతుల నుంచి ఆవుపాలను సేకరిస్తోందని, అందుకు సంబంధించిన వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా ఆరోపణలు చేశారని తెలిపింది. టీటీడీకి నెయ్యి సరఫరా విషయంలో భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారని సంగం డెయిరీ ఆరోపించింది.

ఈ వ్యవహారంపై సంగం డెయిరీ ఎండీ గోపాలకృష్ణన్ గుంటూరు కోర్టులో పరువు నష్టం కేసు దాఖలు చేశారు. సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు ఆరోపణలు చేసిన ఎమ్మెల్సీ తూమాటి మాధవరావుపైనా కేసు నమోదు చేయాలని కోరారు. అలాగే సజ్జల చేసిన వ్యాఖ్యలను ప్రసారం చేసిన సాక్షి టీవీతో పాటు సోషల్ మీడియా వేదికలపైనా కేసు దాఖలు చేసినట్లు తెలిపారు. తమ సంస్థపై నిరాధార ఆరోపణలు చేయడం ద్వారా ప్రతిష్టకు నష్టం కలిగించారని పేర్కొంటూ రూ.10 కోట్ల పరువు నష్టం చెల్లించాలని కోర్టును కోరారు. టీటీడీకి నెయ్యి సరఫరా అంశంలో తమపై వచ్చిన ఆరోపణలు వాస్తవ విరుద్ధమని సంగం డెయిరీ స్పష్టం చేస్తూ.. తమ ప్రతిష్టను దెబ్బతీసే వ్యాఖ్యలపై న్యాయపోరాటానికి దిగింది.



# వాగు పోరంబోకు భూమి ఆక్రమించిన వైసీపీ నేతలు

- పొలాలకు దారి ఇవ్వకుండా దౌర్జన్యం, బెదిరింపులు
- హద్దు రాళ్లు పీకేసి ప్లాట్ కబ్జా చేసిన వైసీపీ నేత
- పలమనేరు-కుప్పం హైవే పక్కన స్థలంపై రియల్టర్ల కన్ను.. పాసు పుస్తకాలు ఇవ్వకుండా అధికారుల కాలయాపన
- నకిలీ పాసుపుస్తకాలతో భూ దందా.. అడిగితే చంపుతామని బెదిరింపులు
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో బాధితుల వినతులు
- అర్జీలు స్వీకరించిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

అమరావతి (చైతన్యరథం): వాగు పోరంబోకు భూమిని ఆక్రమించిన వైసీపీ నేతలు పొలాలకు దారి లేకుండా చేస్తారని మార్కాపురం జిల్లా పుల్లలచెరువు మండలం కుండంపల్లి గ్రామానికి చెందిన పెద్ద కొండయ్య గురువారం టీడీపీ నేతలకు విన్నవించుకున్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు సమస్యలపై తరలివచ్చిన ప్రజలు అర్జీలు సమర్పించారు. ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అరీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా పెద్ద కొండయ్య అర్జీ ఇచ్చి తమ గ్రామంలో సర్వే నెం. 497లోని తన 5.50 ఎకరాల భూమికి వెళ్లేందుకు సర్వే నెం. 199లోని వాగు పోరంబోకు రస్తాను పూర్వీకుల కాలం నుంచి వినియోగిస్తున్నామని తెలిపారు. అయితే గత కొంతకాలంగా కొందరు వైసీపీ నేతలు ఆ రస్తాను ఆక్రమించి దారి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశాం. ఈ ఫిర్యాదుపై రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్ క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. రికార్డుల ప్రకారం సర్వే నెం. 199లోని మొత్తం 14.15 ఎకరాల భూమి "వాగు పోరంబోకు"గా నమోదై ఉంది. ఇందులో ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు వైసీపీ నేతలు భూములు ఆక్రమించి సాగు చేస్తున్నారు. ప్రభుత్వ వాగు పోరంబోకు భూమిని ఎవరూ ఆక్రమించరాదని, రస్తాకు ఆటంకం కలిగించకూడదని తహశీల్దార్ ఆదేశించినా కూడా వారు తమకు దారి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తమ స్థలాన్ని వైసీపీ నేతలు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని కర్నూలు జిల్లా ఆలూరు మండలం పెద్దహోతురు ఉచ్చీరమ్మ ఫిర్యాదు చేశారు. తమకు ఆదోని మండలం మండిగిరి గ్రామంలో సర్వే నెం. 482 లేఅవుట్ లోని ప్లాట్ నెం. 123లో దక్షిణ భాగం సుమారు 166.66 చదరపు గజాల స్థలాన్ని తమ కుమారుడు శివకుమార్ పేరిట దానపూర్వకంగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చానని తెలిపారు. సదరు స్థలానికి సంబంధించి స్పష్టమైన సరిహద్దులు, కొలతలు, లీగల్ పత్రాలు తమ వద్ద ఉన్నాయి. పక్క స్థలానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, అతని అనుచరులు దౌర్జన్యంగా తమ స్థలంలోకి ప్రవేశించి, పాత హద్దు రాళ్లను పీకివేసి కబ్జా చేశారు. స్థలంలో ఏర్పాటు చేసిన నంబర్ బోర్డులు, రాళ్లను ఎందుకు తొలగించారని నిలదీయగా.. నువ్వు ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో.. స్థలం నాదే, దీని జోలికి వస్తే చంపేస్తాం" అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.



చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలం కంచనపల్లి గ్రామానికి చెందిన విమలమ్మ విజ్ఞప్తి చేస్తూ..జీలుపల్లి రెవెన్యూ పరిధి సర్వే నెం. 935లో సుమారు 9.33 ఎకరాల భూమి తరతరాలుగా తమ కుటుంబాలైన మునెప్ప, గంగప్ప, కృష్ణప్ప, వెంకటేష్, తదితరుల అనుభవంలో ఉందని తెలిపారు. ఈ భూమికి సంబంధించి పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు గతంలో వినతిపత్రం అందజేశాం. దీనిపై విచారణ జరిపిన ఉన్నతాధికారులు తమ న్యాయం చేయాలని ఆదేశించినప్పటికీ, స్థానిక రెవెన్యూ అధికారులు కాలయాపన చేస్తూ రికార్డులను తారుమారు చేసే ప్రయత్నం చేస్తున్నారు. పలమనేరు – కుప్పం ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ విలువైన భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసం ఇతరులకు కట్టబెట్టేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

మార్కాపురం జిల్లా దొర్నాల మండలం పెద్దబొమ్మలాపురం గ్రామానికి చెందిన శాయపనాయని విజయలక్ష్మి విజ్ఞప్తి చేస్తూ.. మనోహర్ ప్రసాద్ (రాజా) అనే వ్యక్తి మూడు మండలాల పరిధిలో రెవెన్యూ రికార్డులను తారుమారు చేస్తూ, దొంగ పాసుపుస్తకాలు సృష్టిస్తూ భూకబ్జాలకు పాల్పడుతున్నాడని ఫిర్యాదు చేశారు. ఉమ్మడి సర్వే నంబర్లలో అతడికి రావాల్సిన వాటా భూమిని గతంలోనే అమ్ముకున్న సదరు వ్యక్తి, ప్రస్తుతం నకిలీ రిజిస్ట్రేషన్లు సృష్టించి క్షేత్రస్థాయిలో తమ వాటా భూమిని ఇతరులకు కట్టబెట్టేందుకు యత్నిస్తున్నారు. మొత్తం 25 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 5.50 ఎకరాల భూమికి నకిలీ పాసుపుస్తకాలు తయారు చేసి దౌర్జన్యంగా ఆక్రమించారు. తమ భూమిని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తే తీవ్ర పరుష పదజాలంతో దూషిస్తూ, "చంపుతాం.. నరుకుతాం" అంటూ నిత్యం ప్రాణహాని బెదిరింపులకు గురిచేస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

నంద్యాల జిల్లా దొర్నిపాడు మండలం భ్యాగనగరానికి చెందిన మూళ్ల సరళ విజ్ఞప్తి చేస్తూ..వివాహ సమయంలో తన తండ్రి తనకు పసుపు-కుంకుమ కానుకగా డోన్ మండలం పరిధిలోని సర్వే నెం. 483లో సుమారు 0.65 సెంట్ల భూమిని ఇచ్చారని తెలిపారు. ఈ స్థలాన్ని తన తండ్రి 1991లో ఆర్మీ విశ్రాంత ఉద్యోగి అయిన దేవసహాయం అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. గతంలో ప్రభుత్వం ఆ భూమిని సదరు ఆర్మీ ఉద్యోగికి కేటాయించింది. అయితే ప్రస్తుతం ఆ భూమిని ఆన్‌లైన్ చేసేందుకు ప్రయత్నించగా.. రికార్డులలో 'పోరంబోకు'గా చూపిస్తుండటంతో ఆన్‌లైన్ ప్రక్రియ నిలిచిపోయింది. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. తగు చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన మంచాల తాతరావు విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో తనకు రికార్డుల ప్రకారం 2.00 ఎకరాల భూమి ఉండాల్సి ఉందన్నారు. అయితే క్షేత్రస్థాయిలో కొలతలు వేయగా సుమారు 21 సెంట్ల భూమి తక్కువగా కనిపిస్తోంది. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. తగు చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం ఏకపాదంపల్లి గ్రామానికి చెందిన మణిలత విజ్ఞప్తి చేస్తూ..తమకు వాస్తవంగా 4.50 ఎకరాల పొలం మాత్రమే ఉందన్నారు అయితే ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన రీసర్వేలో సాంకేతిక పొరపాట్ల వల్ల ఆన్‌లైన్ రికార్డులలో తమ పేరుపై పరిమితికి మించి ఎక్కువ భూమి నమోదైంది. దీని ప్రభావంతో ఈ విద్యా సంవత్సరంలో తమ ఇద్దరు పిల్లలకు రావాల్సిన 'తల్లికి వందనం' ఆర్థిక సాయం నిలిచిపోయింది. రెవెన్యూ ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదైన అదనపు భూమి వివరాలను తక్షణమే సరిచేసి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం చిన్నబల్దార్ గ్రామానికి చెందిన రాజగోపాల్ విజ్ఞప్తి చేస్తూ.. గోరివిమాకులపల్లి రెవెన్యూ పరిధి సర్వే నెం. 172 (పుంజ ఇనాం)లోని మొత్తం 2.95 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 150 ఏళ్లుగా వివిధ వర్గాలు నివాసాలు, భూములు కలిగి ఉన్నామని తెలిపారు. ఇందులో వడ్డెర కులస్తులమైన తమకు 0.23 సెంట్ల పుంజ నేల ఉండగా, దానికి సంబంధించి అధికారిక పట్టాదారు పాసుపుస్తకాలు కూడా ఉన్నాయి. ఈ భూమి వివాదంపై గతంలో చిత్తూరు జాయింట్ కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి, 2017 డిసెంబర్ 11న ఈ భూములు తమకే చెందుతాయని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. అధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో భూమిని కొలిచి, హద్దులు నిర్ణయించి సర్వే రాళ్లు కూడా నాటారు. నాటి నుంచి నేటి వరకు ఆ భూమి తమ స్వాధీన అనుభవంలోనే ఉంది. అన్ని అధికారిక పత్రాలు తమ వద్ద ఉన్నప్పటికీ, గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి తమ భూమిని లాక్కునేందుకు నిత్యం దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. భూమి వద్దకు వెళ్తే మహిళలు, పిల్లలని కూడా చూడకుండా కులం పేరుతో దూషిస్తూ, "ఈ భూమిలోకి వస్తే చంపేస్తాం" అంటూ ప్రాణహాని బెదిరింపులకు గురిచేస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం ఏకపాదంపల్లి గ్రామానికి చెందిన వేలూరి సూర్యనారాయణ విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో తమకు 9.68 ఎకరాల వ్యవసాయ భూమి మాత్రమే ఉందని తెలిపారు. అయితే ఆన్‌లైన్ ల్యాండ్ రికార్డులలో సాంకేతిక పొరపాట్ల వల్ల తన పేరుపై ఏకంగా 13.50 ఎకరాల భూమి ఉన్నట్లు తప్పుగా నమోదైంది. ప్రభుత్వ నిబంధనల పరిమితి కంటే ఎక్కువ భూమి ఉన్నట్లు రికార్డులు చూపించడంతో, గత విద్యా సంవత్సరం (2025-26)తో పాటు ప్రస్తుత ఏడాది కూడా 'తల్లికి వందనం' పథకం సాయం అందలేదు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. తగు చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

వీటితో పాటు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై పలువురు అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

# 25వ రోజూ ప్రజలతో ప్రత్యక్ష మమేకం.. 'ఇంటింటికీ తెలుగుదేశం'

- 2,53,832 ఇళ్లను సందర్శించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు
- మొత్తం 71.80 లక్షల ఇళ్లకు చేరుకున్న టీడీపీ శ్రేణులు
- 70 లక్షల మైలురాయిని దాటి మరింత విస్తృతంగా ఇంటింటి పర్యటనలు
- ప్రజలతో ప్రత్యక్ష సంబంధాన్ని బలోపేతం చేస్తున్న కార్యక్రమం





అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు.. క్షేత్రస్థాయిలో ప్రజలతో ప్రత్యక్ష సంబంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం - 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం 25వ రోజు గురువారం కూడా రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగింది. 70 లక్షల ఇళ్ల సందర్శనల మైలురాయిని దాటి ముందుకు సాగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా 25వ రోజు రాష్ట్రవ్యాప్తంగా 2,53,832 ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. దీంతో ఇప్పటివరకు మొత్తం 71.80 లక్షల ఇళ్లకు పార్టీ శ్రేణులు చేరుకున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఇంటింటి పర్యటనలు విస్తృతంగా కొనసాగుతుండటంతో కార్యక్రమం మరింత వేగాన్ని అందుకుంది. ఇంటింటి పర్యటనల్లో భాగంగా కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను పార్టీ శ్రేణులు వివరిస్తున్నారు. రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్యతరగతి వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను ఆయా కుటుంబాల వద్దకు తీసుకెళ్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను తెలియజేయడంతో పాటు ప్రజలతో నేరుగా మాట్లాడి వారి స్పందనను తెలుసుకోవడంపై పార్టీ శ్రేణులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. స్థానికంగా ఉన్న అవసరాలు, మౌలిక వసతుల పరిస్థితి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వారి నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నారు. ప్రజల నుంచి వచ్చిన అంశాలను సంబంధిత నాయకులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లేలా క్షేత్రస్థాయిలో సమన్వయం చేస్తున్నారు. ఇప్పటికే 71.80 లక్షల ఇళ్లకు చేరుకున్న 'ఇంటింటికీ తెలుగుదేశం-2026'.. కేవలం సంఖ్యాపరమైన లక్ష్యాన్ని చేరుకోవడానికే పరిమితం కాకుండా ప్రతి కుటుంబంతో ప్రత్యక్ష సంబంధాన్ని ఏర్పరచుకునే కార్యక్రమంగా ముందుకు సాగుతోంది.

# కూటమి పాలనలో ఆధ్యాత్మిక వైభవం

ఆంధ్రప్రదేశ్ ఆధ్యాత్మిక సంస్కృతికి, సనాతన ధర్మానికి పట్టుగొమ్మ. గతంలో భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా జరిగిన ఘటనలను అధిగమిస్తూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దేవాలయాల పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారించింది. పారదర్శకత, పవిత్రత, జవాబుదారీతనం అనే త్రిసూత్రాలతో దేవాలయాల ప్రక్షాళన చేపట్టి, కోట్లాది మంది భక్తులలో విశ్వాసాన్ని నిలబెడుతూ ఆలయాలకు పూర్వవైభవాన్ని తీసుకొచ్చింది.

దేవాలయాల నిర్వహణలో చిన్న గుడులకు పెద్ద దిక్కుగా నిలుస్తూ ధూపదీప నైవేద్య పథకం గౌరవ భత్యాన్ని రూ. 5,000 నుంచి రూ. 10,000కు పెంచారు. రాష్ట్రవ్యాప్తంగా 6,137 దేవాలయాలకు ఈ పథకాన్ని అమలు చేస్తూ ప్రభుత్వం ఏటా రూ. 73 కోట్ల నిధులను కేటాయిస్తోంది. పురాతన కట్టడాలను, నిర్లక్ష్యానికి గురైన ఆలయాలను పునర్నిర్మించేందుకు సర్వశ్రేయోనిధి (సీజీఎఫ్) ద్వారా చరిత్రలోనే మొదటిసారిగా 692 ఆలయాల అభివృద్ధికి రూ. 813 కోట్లు మంజూరు చేయడం విశేషం.

సమాజంలోని ప్రతి గ్రామానికి దైవ చైతన్యాన్ని చేరవేయాలనే లక్ష్యంతో తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ. 750 కోట్ల వ్యయంతో 5,000 భజన మందిరాల నిర్మాణానికి సంకల్పించారు. ఇప్పటికే 1,270 భజన మందిరాలకు అనుమతులిచ్చి రూ. 267 కోట్ల నిధులు కేటాయించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వెనుకబడిన ప్రాంతాలలో భక్తి వాతావరణాన్ని పెంపొందిస్తూ సామాజిక ఐక్యతకు ఇవి ప్రతీకలుగా నిలుస్తున్నాయి.


ఆలయానికి వచ్చే భక్తులు ఆకలితో వెళ్లకూడదనే ఉద్దేశంతో రాష్ట్రంలోని 111 ఆలయాల్లో అన్నప్రసాద వితరణ సాగుతుండగా, 65 ప్రధాన దేవాలయాల్లో నిత్య అన్నదానం దిగ్విజయంగా నడుస్తోంది. రోజుకు సుమారు 80 వేల మంది భక్తులకు కడుపునిండా భోజనం పెడుతూ ప్రభుత్వం ఏటా రూ. 84 కోట్లను వ్యయం చేస్తోంది. నాణ్యమైన ప్రసాదాలు, క్రమబద్ధమైన క్యూలైన్లు, పారిశుధ్యం కోసం ప్రామాణిక నిర్వహణ విధానాలు అమలు చేస్తుండటంతో 54 ప్రధాన ఆలయాలలో భక్తుల తాకిడి గతంతో పోలిస్తే 70 శాతానికి పైగా పెరిగింది.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 'టెంపుల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' (టీఎంఎస్), 'మన మిత్ర' వాట్సాప్ సేవలను ప్రవేశపెట్టి దర్శనం, వసతి, ప్రసాదాల బుకింగ్‌ను భక్తుల చెంతకు తెచ్చారు. దేవాలయాల భూములను పరిరక్షించేందుకు బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో డిజిటలైజేషన్ చేపట్టారు. మరోవైపు ఆలయ ధర్మకర్తల మండళ్లలో బ్రాహ్మణ, నాయీ బ్రాహ్మణ ప్రతినిధులకు చట్టబద్ధ స్థానం కల్పిస్తూ సంస్కరణలు అమలు చేశారు.

అర్చకులు, వేద పండితుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అర్చకుల వేతనాలను పెంచడం, నిరుద్యోగ వేద పండితులకు నెలకు రూ.3,000 గౌరవ వేతనం అందించడం, నాయీ బ్రాహ్మణులకు గౌరవప్రదమైన భరోసా కల్పించడం వంటి మేనిఫెస్టో హామీలను నెరవేర్చింది. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను దేవాదాయ శాఖ పరిధిలోకి తెచ్చి వారి సంక్షేమానికి సరికొత్త బాటలు వేసింది.

పిల్లల విద్యాభ్యాసాన్ని దైవ సమక్షంలో ప్రారంభించేలా సుమారు 50 వేల మంది చిన్నారులకు ఉచిత అక్షరాభ్యాసం చేయించడం, హరితహారం వంటి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను చేపట్టడం ద్వారా దేవాలయాలను సామాజిక చైతన్య కేంద్రాలుగా మలిచారు. 2027లో రానున్న గోదావరి పుష్కరాలను మహాకుంభమేళా తరహాలో గ్రీన్ పుష్కరాలుగా నిర్వహించేందుకు భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

"దేవాలయాల అభివృద్ధి అంటే కేవలం గోపురాల నిర్మాణం మాత్రమే కాదు... భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టడం, ధర్మాన్ని సంరక్షించడం" అనే దృక్పథంతో కూటమి ప్రభుత్వం సాగిస్తున్న ఈ ప్రయాణం రాష్ట్ర ఆధ్యాత్మిక రంగంలో సువర్ణాధ్యాయాన్ని లిఖిస్తోంది. విధ్వంసం నుంచి వికాసం వైపు అడుగులు వేస్తూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆదర్శ ఆధ్యాత్మిక పరిపాలనా రాష్ట్రంగా తీర్చిదిద్దే సంకల్పం దిగ్విజయంగా సాగుతోంది.



# ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్న నేరమయ రాజకీయం!

దేశంలో నేరమయ రాజకీయం మన ప్రజాస్వామ్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా పరిహాసం చేస్తోంది. నేడు మన సమాజాన్ని ఇంతగా చెండుకు తింటున్న నేరగ్రస్థ రాజకీయాలకు వికృత ప్రతిరూపం అవినీతే. దేశంలో మహాపాతకుల అవినీతి ధాటికి జాతి వనరులు పప్పు బెల్లాలైపోతున్నాయి. సమాజానికి ఆదర్శప్రాయులుగా ఉండాల్సిన రాజకీయ నాయకులే అవినీతిలో మునిగి తేలుతున్నారు. అవినీతి పరులు చట్టసభల్లోకి అడుగుపెట్టి – ప్రజాప్రయోజనాలకు, ప్రజాధనానికి తీవ్ర నష్టం చేస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని నేర రాజకీయాల నుంచి ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. అవినీతి నేర రాజకీయాలకు ముగింపు పలికినప్పుడే ప్రజాస్వామ్యం పరిహాసం కాకుండా ప్రజల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుంది. అధికారాన్ని అడ్డం పెట్టుకొని అక్రమాస్తులు పోగేసుకొని విచారణలు ఎదుర్కొంటున్న రాజకీయ నాయకులు తమకి ఏ పాపమూ తెలియదంటూ తెగ నటిస్తున్నారు. ఆర్థిక నేరస్థులను అందలాలు ఎక్కకుండా నివారించాలంటే– కేంద్ర ప్రభుత్వం గతంలో సూచించినట్లు, ప్రజాప్రతినిధులపై కేసుల విచారణకు కాలపరిమితి విధించి నిర్దేశిత గడువులోగా ఆ కేసులన్నిటిని కొలిక్కి వచ్చేలా వ్యవస్థాగత సంస్కరణలను తీసుకురావాలి. అధికారాన్ని అడ్డుపెట్టుకుని దర్యాప్తులను ప్రభావితం చేస్తూ, వాయిదాలతో వ్యాజ్యాలను దశాబ్దాల పాటు నడిపించే అవినీతి నేతలను కట్టడి చేయకపోతే– ప్రజాధన దోపిడీ పర్వం మాత్రం ఆగదు. ఆర్థికనేరాలు, మనీ లాండరింగ్ వంటి హేయనేరాలకు సంబంధించి తీవ్ర అభియోగాలు ఎదుర్కొంటున్న వారిపై రోజువారీ విచారణ చేపట్టి ఏడాది లోగా కేసుల్ని ఒక కొలిక్కి తేవాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలు కొన్నేళ్లుగా నీరోడుతున్నాయి. నేరమయ రాజకీయాలను పరిమార్చాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలను విచారిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇస్తూనే వుంది. కానీ సుప్రీం ఆదేశాలను నీరుగార్చే దుస్తంత్రం యథేచ్ఛగా సాగిపోతోంది. ప్రజా ప్రయోజనాలు ఇమిడి వున్న ప్రజాప్రతినిధులకు సంబంధించిన కేసుల్లో అనవసరమైన వాయిదాలు వేయవద్దని కూడా కింది స్థాయి కోర్టులకు సుప్రీంకోర్టు ఎప్పుడో దిశా నిర్దేశం చేసింది. వ్యక్తిగత లాభం కోసం ఉద్దేశ పూర్వకంగా పక్కా ప్రణాళికతో అవినీతికి పాల్పడిన ఆర్థిక నేరగాళ్ళను కఠినంగా శిక్షించక పోతే మొత్తం సమాజమే అన్యాయమై పోతుందని గతంలో సుప్రీంకోర్టే స్పష్టం చేసింది. నేరగ్రస్త రాజకీయాలకు చరమగీతం పాడాలన్న సుప్రీం తీర్పుల స్ఫూర్తికీ తూట్లుపొడిచి నేరస్తులనే గెలుపు గుర్రాలుగా ఏరికోరి చేరదీస్తున్న నేరంలో అన్ని రాజకీయ పక్షాలదీ– తిలా పాపం తలా పిడికెడు అని చెప్పాలి.

దేశవ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్యేలపై మొత్తం 4,192 కేసులు పెండింగ్ లో ఉన్నట్లు సుప్రీంకోర్టుకు అమికస్ క్యూరీ హన్సారియా అఫిడవిట్ రూపంలో నివేదిక సమర్పించారు. బీజేపీ నేత అశ్వినీకుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణకు హన్సారియా సహకరిస్తున్నారు. విచారణను వేగవంతం చేయడానికి తక్షణమే ప్రత్యేక కోర్టులు నెలకొల్పాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ఈ ట్రయల్స్‌ను క్రియాశీలంగా పర్యవేక్షించాలని సంబంధిత హైకోర్టులను కూడా ఆదేశించాలని కోరారు. 543 మంది ఎంపీల లోక్‌సభలో 251 మంది పై, వివిధ రాష్ట్రాల నుంచి రాజ్యసభకు ఎన్నికైన 233 మంది సభ్యుల్లో 75 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, ప్రజాప్రతినిధులపై ఉన్న కేసులలో 519 కేసులు పదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని, 700 కేసులలో పోలీసులు అసలు దర్యాప్తు కూడా ప్రారంభించలేదని, చార్జిషీటు కూడా దాఖలు కాకుండా 360 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, కేరళకు చెందిన 95% మంది ఎంపీలు తీవ్ర క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారని, తెలంగాణలో 82% మంది ఎంపీలపై, ఒడిసాలో 76% మంది పార్లమెంటు సభ్యులపై కేసులు ఉన్నాయని, హరియాణా, ఛత్తీస్ గడ్‌లో ఒక్కో ఎంపీ మాత్రమే కేసులు ఎదుర్కొంటున్నారని, సీరియస్ క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు పశ్చిమ బెంగాల్లో 58% మంది ఉన్నారని, కేరళలో 57%, ఆంధ్రప్రదేశ్‌లో 56 శాతం, తెలంగాణలో 49 శాతం, ఒడిసాలో 45 శాతం మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు ఉన్నాయని హన్సారియా తన అఫిడవిట్ నివేదికలో వెల్లడించారు. ఈ కేసులన్నీ ఎన్నేళ్లకు తెమలాలి? అవినీతికి పాల్పడి ప్రజాప్రయోజనాలను కాలరాసిన ప్రబుద్ధ నేతలకు ఎప్పుడు శిక్షలు పడాలి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏడాది కేడాది భారత ప్రజాస్వామ్యంలో నేర చరిత్ర కలిగిన ప్రజాప్రతినిధుల సంఖ్య పెరిగిపోవడం ఆందోళనకరం. ఏడీఆర్ సంస్థ నివేదించిన లెక్కల ప్రకారం 2004 సార్వత్రిక ఎన్నికలలో ఎన్నికైన ఎంపీలలో 24 శాతం మంది నేరచరితులు ఉంటే అది 20 ఏళ్ళు తిరిగే సరికి ఆ సంఖ్య రెట్టింపు కావడం అంటే మన దేశంలో ఆర్థిక నేరస్థుల ప్రగతి ఎంత పెరిగిందో అర్థం అవుతుంది. ఏపీ మాజీ సీఎం వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డిపై 11 సీబీఐ, 9 ఈడీ కేసులు ఉన్నాయి. ఆయన కాలికి వేస్తే వేలికి, వేలికి వేస్తే కాలికి వేస్తూ ఆ కేసుల్లో విచారణ జరగకుండా అడ్డుకుంటున్న సంగతి విదితమే. ఆయన అయిదేళ్ల పాటు సీఎంగా కూడా పనిచేశారు. తీవ్రస్థాయి ఆర్థిక నేరాభియోగాలను ఎదుర్కొంటున్న వ్యక్తికి రాష్ట్ర ఖజానా అప్పజెప్పడం, అటువంటి వారికి రాజ్యాధికారం ఇవ్వకూడదనే విషయం ప్రజలు కూడా తెలుసుకోవడం లేదు.

వేల కోట్ల రూపాయల ప్రజాధనం దోపిడీ చేసిన ఆర్థిక నేరస్థుల కేసుల విచారణలు ఏళ్ల తరబడి కొనసాగుతున్నాయని, చట్టం ముందు అందరూ సమానమే అన్న సూత్రం ఆచరణలో ఎక్కడా కనిపించడం లేదు అంటున్నారు ప్రజలు. ప్రజాస్వామ్యంలో రాజకీయ నైతికత ప్రధాన మైనదని, చట్టం ముందు అందరూ సమానమనే రాజ్యాంగ విలువను కాపాడినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుందంటున్నారు. చట్టాలు ప్రజలను, ప్రజాధనాన్ని రక్షించడానికి, ప్రభుత్వాలు న్యాయాన్ని నిలబెట్టడానికి, ప్రజాప్రతినిధులు విలువలకు కట్టుబడి ఉండడానికి ఏర్పడ్డ వ్యవస్థలను రాజకీయ అవసరాలకోసం ఆ చట్టాలను, వ్యవస్థలను చట్టు బండలు చేయ్యడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అవినీతి, మనీలాండరింగ్, బ్యాంకు మోసాలు, నకిలీ కంపెనీల ద్వారా అక్రమ లావాదేవీలు, ప్రజాధన దుర్వినియోగం వంటి నేరాల వల్ల వేల కోట్ల రూపాయల ప్రజా సంపద దోపిడీకి గురవుతుంది. చివరకు ఆ నష్టాన్ని సామాన్య ప్రజలే భరించాల్సి వస్తుంది. దేశం–రాష్ట్రం అధోగతి పాలు కావాల్సి వస్తుంది. అవినీతి, ఆర్థిక నేరస్థులపై రాజీలేని వైఖరితో విచారణ జరిగితే తప్ప దేశంలో సుస్థిర అభివృద్ధి సాధ్యం కాదు. వెంటనే శిక్షలు పడతాయనే వాతావరణం కల్పిస్తే తప్ప అవినీతి తగ్గదు. ఏళ్ల తరబడి వాయిదాల మీద పడి బతికేద్దామనే ఆలోచనను ఆర్థిక నేరగాళ్లూ మానుకుంటారు. అనేక ప్రజాస్వామ్య దేశాల్లో అవినీతికి పాల్పడిన ప్రజాప్రతినిధులపై చట్టాలు కఠినంగా ఉంటాయి. ప్రపంచంలో అనేక దేశాలలో తప్పు చేస్తే ఎంతటి ప్రముఖులు అయినా, దేశాధ్యక్షులు, ప్రధాన మంత్రులు అయినా బోనెక్కించ గల స్థాయిలో ప్రాసిక్యూషన్ వ్యవస్థ రాణిస్తుంటే, ఇండియాలో మాత్రం అధికారాన్ని అడ్డం పెట్టుకొని జనం సొమ్ముతో అవినీతి సామ్రాజ్యాలు నిర్మించుకున్న ఆర్థిక నేరస్థుల కేసులు ఏళ్ళు గడుస్తున్నా అతి, గతి ఉండటం లేదు. అవినీతిపరుల కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి ఏడాది లోపు విచారణ చేసి కటకటాల వెనక్కి నెడతామంటూ ఆచరణకు నోచుకోని ఆదర్శ ప్రసంగాలతో అధికారంలోకి వచ్చిన రాజకీయ పార్టీలు వారిపై చర్యలు తీసుకోక పోగా ఆర్థిక నేరస్థులకే అండగా నిలవడంతో నేరమయ రాజకీయం మన ప్రజాస్వామ్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా పరిహాసం చేస్తోంది.

**- నీరుకొండ ప్రసాద్**

# బీసీలకు బాబు అండ..
# 34%తో రాజకీయ సాధికారత

ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో మరో చారిత్రాత్మక అధ్యాయం మొదలైంది. బీసీలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను పెంచుతూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శాసనసభ వేదికగా ప్రకటించడంతో 'జయహో బీసీ' అంటూ సభ మార్మోగింది. ఇది కేవలం ఒక ప్రభుత్వ నిర్ణయం కాదు. ఇది ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేసిన ఘనత. ఇది కేవలం రిజర్వేషన్ పెంపు కాదు. బీసీలకు రాజకీయంగా మరిన్ని అవకాశాల ద్వారాలు తెరిచే నిర్ణయం. ఇది కేవలం స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన అంశం కాదు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి వరకు బీసీ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసే సంకల్పం. మాట ఇస్తే నిలబెట్టుకోవాలి.. హామీ ఇస్తే అమలు చేసి చూపించాలి. కూటమి ప్రభుత్వం అదే చేసింది.




**ఎన్టీఆర్ బాటలో చంద్రబాబు**

బీసీల రాజకీయ సాధికారతకు టీడీపీకి ఉన్న అనుబంధం నేటిది కాదు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బీసీలను రాజకీయంగా ముందుకు తీసుకెళ్లడం ఒక ప్రధాన లక్ష్యంగా కొనసాగుతోంది. ఎన్టీఆర్ హయాంలోనే బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లకు బలమైన పునాది పడింది. 1984లో స్థానిక సంస్థలు, మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా ప్రజా పరిషత్‌లలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఎన్టీఆర్ నిర్ణయం అప్పట్లో రాజకీయాల్లో ఒక కొత్త మార్పుకు నాంది పలికింది. ఆ తర్వాత చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టిన సమయంలో బీసీలకు ఉన్న 20 శాతం రిజర్వేషన్లను 34 శాతానికి పెంచారు. 'యాక్ట్ ఆఫ్ 5' ద్వారా తీసుకున్న ఈ నిర్ణయం బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత విస్తరించింది. 1995, 2001, 2006, 2013 సంవత్సరాల్లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు కావడం తెలుగుదేశం ప్రభుత్వాల బీసీ అనుకూల విధానానికి నిదర్శనం. అందుకే ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న 34 శాతం రిజర్వేషన్ల నిర్ణయం కొత్తగా మొదలైన ప్రయోగం కాదు. ఎన్టీఆర్ ప్రారంభించిన బీసీ సాధికారత ప్రయాణానికి కొనసాగింపు.

**ఎన్నికల హామీ.. నేడు కార్యరూపం**

2024 ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం బీసీలకు స్పష్టమైన హామీ ఇచ్చింది.స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని కాగితాలకే పరిమితం చేయకుండా కార్యాచరణలోకి తీసుకొచ్చింది. బీసీ రిజర్వేషన్ల అంశానికే ప్రత్యేకంగా కేబినెట్ సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోవడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం రాజకీయాల్లో సాధారణం. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడం అసలైన నాయకత్వానికి కొలమానం. చెప్పిన మాటను చేయడం.. చేసిన పనిని ప్రజలకు చెప్పడం.. ఇదే కూటమి ప్రభుత్వ విధానం. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల విషయంలో కూడా అదే జరిగింది.

**34 శాతం అంటే సంఖ్య కాదు..**

**అవకాశాల విస్తరణ**

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అంటే కేవలం ఎన్నికల గణాంకం కాదు. ఇది వేలాది కుటుంబాలకు రాజకీయ అవకాశాలు అందించే మార్గం. స్థానిక సంస్థల్లో ఒక సర్పంచ్‌గా ప్రారంభమైన రాజకీయ ప్రయాణం ఎంపీటీసీ,




జెడ్పీటీసీ, మున్సిపల్ చైర్మన్, మేయర్, ఎమ్మెల్యే, ఎంపీ స్థాయికి వెళ్లగలదు. క్షేత్రస్థాయిలో నాయకత్వాన్ని పెంచే వ్యవస్థ బలపడితేనే రాష్ట్రానికి, దేశానికి కొత్త నాయకత్వం వస్తుంది. కర్నూలుకు చెందిన ఎంపీటీసీ బస్తిపాటి నాగరాజుకు ఎంపీగా అవకాశం కల్పించిన విషయాన్ని సీఎం సభలో ప్రస్తావించడం ఈ ఆలోచనకు ఒక ఉదాహరణ. ఎంపీటీసీ నుంచి ఎంపీ వరకు.. సామాన్య కార్యకర్త నుంచి ప్రజాప్రతినిధి వరకు.. ఇదే తెలుగుదేశం రాజకీయ పంథా. ఎర్రన్నాయుడు, యనమల రామకృష్ణుడు, కేఈ కృష్ణమూర్తి, దేవేందర్ గౌడ్, అయ్యన్నపాత్రుడు వంటి బీసీ నాయకులు అత్యున్నత రాజకీయ స్థానాలకు ఎదగడానికి టీడీపీ కల్పించిన అవకాశాలే బలమైన పునాది. ఇది ఒక్క నాయకుడి ఎదుగుదల కాదు. ఒక సామాజిక వర్గంలో నాయకత్వాన్ని తయారు చేసిన రాజకీయ సంస్కృతి.

**బీసీలకు అన్యాయం చేసిన గత పాలన**

ఒకవైపు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన చరిత్ర టీడీపీదైతే.. మరోవైపు గత వైసీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను తగ్గించిందన్నది వాస్తవం. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం జీవో 176 తీసుకురావడం, అనంతరం జీవోలు 559, 560 ద్వారా బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి సుమారు 24.15 శాతానికి తగ్గించిందని ముఖ్యమంత్రి సభలో వివరించారు. దీని ప్రభావంగా సుమారు 16,800 మంది బీసీ నాయకులు స్థానిక సంస్థల్లో రాజకీయ అవకాశాలు కోల్పోయారని ప్రభుత్వం పేర్కొంది. ఇది కేవలం సంఖ్య కాదు. 16,800 రాజకీయ అవకాశాలు అంటే 16,800 కుటుంబాల ఆశలు. వేలాది మంది యువతకు నాయకత్వం వహించే అవకాశం కోల్పోవడం. గ్రామాల్లో, మండలాల్లో కొత్త నాయకత్వం ఎదగడానికి తలుపులు మూసుకుపోవడం. బీసీలకు అవకాశం ఇవ్వడం ఒక రాజకీయ నిర్ణయం అయితే.. ఆ అవకాశాన్ని తగ్గించడం కూడా అంతే తీవ్రమైన రాజకీయ నిర్ణయమే. అందుకే కూటమి ప్రభుత్వం గతంలో జరిగిన నష్టాన్ని సరిదిద్దే దిశగా 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తోంది.

**బీసీలకు ద్రోహం చేసినవారికి..**

**సమాధానం ఇదే**

బీసీలను రాజకీయంగా అణచివేసిన గత ప్రభుత్వానికి భిన్నంగా కూటమి ప్రభుత్వం బీసీలకు అండగా నిలుస్తోంది. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడు, పల్లా శ్రీనివాస్, కూన రవికుమార్ వంటి బీసీ నాయకులపై గత పాలనలో కేసులు, వేధింపులు జరిగాయనేది జగమెరిగిన సత్యం. పార్టీకి మద్దతుగా నిలిచినందుకు అనేక మంది బీసీ కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే కూటమి ప్రభుత్వం గతాన్ని తవ్వుకోవడం కోసం ఈ నిర్ణయం తీసుకోలేదు. గతంలో కోల్పోయిన అవకాశాలను తిరిగి కల్పించడమే లక్ష్యం. అందుకే ఈ ప్రభుత్వం బీసీలను రాజకీయంగా ముందుకు తీసుకెళ్లడమే కాకుండా, ఆర్థికంగా, విద్యాపరంగా, సామాజికంగా కూడా బలోపేతం చేసే కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోంది.

**బీసీ అంటే వెనుకబడినవారు కాదు..**

**అవకాశం రాక వెనుకబడినవారు**

సీఎం చంద్రబాబు చెప్పిన ఒక మాట ఈ మొత్తం విధానానికి అద్దం పడుతుంది. "బీసీ అంటే వెనుకబడిన వారు కాదు.. అవకాశం రాక వెనుకబడిన వారు మాత్రమే". బీసీ సమాజంలో అపారమైన ప్రతిభ ఉంది. చేనేతలో అద్భుత నైపుణ్యం ఉంది. చేతివృత్తుల్లో తరతరాల అనుభవం ఉంది. వ్యవసాయంలో, మత్స్యరంగంలో, వివిధ వృత్తుల్లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బీసీలు అందిస్తున్న సేవ అపారం. ఆ సంప్రదాయ నైపుణ్యాలకు ఆధునిక సాంకేతికతను జోడిస్తే బీసీ యువత ప్రపంచ స్థాయిలో పోటీ పడగలదు. అందుకే కూటమి ప్రభుత్వం బీసీలకు కేవలం రాజకీయ పదవులు ఇవ్వడానికే పరిమితం కావడం లేదు. విద్య, నైపుణ్యం, ఉపాధి, వ్యాపారం, రాజకీయ ప్రాతినిధ్యం.. ఈ ఐదు రంగాల్లోనూ బీసీలకు బలమైన అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

**ఆదరణ నుంచి ఉపాధి వరకు..**

**కులవృత్తులకు అండ**

బీసీల సంప్రదాయ వృత్తులకు అండగా నిలవాలన్న ఉద్దేశంతో గతంలో 'ఆదరణ' ద్వారా పనిముట్లను రాయితీపై అందించిన విషయాన్ని ప్రభుత్వం గుర్తు చేస్తోంది. 341 రకాల పనిముట్లను 90 శాతం రాయితీతో అందించడం ద్వారా కులవృత్తులకు ఆధునిక పరికరాలను అందించే ప్రయత్నం జరిగింది. నేతన్న సేవ కింద ప్రతి కుటుంబానికి రూ.25 వేల సాయం, మత్స్యకారులకు అండగా మత్స్యకార సేవలో, మత్స్యకారుల ప్రయోజనాలకు సంబంధించిన 217 జీవోను రద్దు చేయడం, దేవాలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణుల జీతాలను రూ.25 వేలకు పెంచడం వంటి చర్యలు బీసీ వృత్తులకు అండగా నిలిచే ప్రభుత్వ విధానాన్ని ప్రతిబింబిస్తున్నాయి. వడ్డెర సామాజిక వర్గానికి చెందిన దళవాయి రమాదేవికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించడం, వడ్డెర్లకు10 శాతం మైనింగ్ లీజులు కల్పించే చర్యలు కూడా బీసీల్లోని వెనుకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలన్న ప్రభుత్వ సంకల్పానికి సంకేతాలు.

**విద్యతోనే సాధికారతకు బలమైన పునాది**

రాజకీయ ప్రాతినిధ్యం ఎంత ముఖ్యమో విద్య కూడా అంతే ముఖ్యం. బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో బీసీ వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలను మరింత మెరుగుపరచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎందుకంటే ఒక తరం చదువుకుంటే తర్వాతి తరం వెనక్కి చూడాల్సిన అవసరం ఉండదు. బీసీ యువతలో నైపుణ్యాలను పెంచి ఉపాధి అవకాశాలను కల్పించడం, వ్యాపారాల్లోకి రావాలనుకునే వారికి ప్రోత్సాహం అందించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం ద్వారా వారిని పోటీ ప్రపంచానికి సిద్ధం చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. పదవి ఒక్కరిని ముందుకు తీసుకెళ్తుంది.. విద్య ఒక కుటుంబాన్ని ముందుకు తీసుకెళ్తుంది.. నైపుణ్యం ఒక తరాన్ని ముందుకు తీసుకెళ్తుంది. అందుకే బీసీ సాధికారతను ప్రభుత్వం సమగ్ర దృక్పథంతో చూస్తోంది.

**స్థానిక సంస్థలతో కొత్త నాయకత్వానికి బాట**

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లా ప్రజా పరిషత్‌ల ఏర్పాటు, పట్టణ స్థానిక సంస్థల్లో మేయర్లు, మున్సిపల్ చైర్మన్లకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలన్న నిర్ణయాలు కూడా స్థానిక పాలనను బలోపేతం చేసే దిశలో కీలకమైనవే. స్థానిక సంస్థలు బలపడితే ప్రజలకు పాలన మరింత చేరువవుతుంది. గ్రామం నుంచి జిల్లా వరకు నాయకత్వం పెరుగుతుంది. ఆ నాయకత్వంలో బీసీలకు మరింత ప్రాతినిధ్యం లభిస్తుంది. 16వ ఆర్థిక సంఘం నుంచి గ్రామీణ ప్రాంతాలకు రూ.2,300 కోట్లు, పట్టణ ప్రాంతాలకు రూ.1,562 కోట్ల గ్రాంట్లు రావాలంటే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం అత్యవసరమని ప్రభుత్వం స్పష్టం చేసింది. అంటే స్థానిక ఎన్నికలు కేవలం రాజకీయ ప్రక్రియ కాదు. గ్రామీణ, పట్టణ అభివృద్ధికి అవసరమైన ఆర్థిక వనరులతో కూడా ముడిపడి ఉన్నాయి.

**బీసీలకు మాత్రమే కాదు..**

**ప్రతి వర్గానికి న్యాయం**

కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తోందంటే ఇతర వర్గాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం పనిచేస్తోందని అర్థం కాదు. సామాజిక న్యాయం అంటే ఒకరి అవకాశాన్ని లాక్కుని మరొకరికి ఇవ్వడం కాదు. వెనుకబడిన వారికి రాజ్యాంగబద్ధంగా అవకాశాలు కల్పించి సమాజాన్ని మొత్తం ముందుకు తీసుకెళ్లడం. అందుకే ప్రభుత్వం స్పష్టంగా చెబుతోంది– బీసీ రిజర్వేషన్లు ఎవరికీ వ్యతిరేకం కావు. రాజ్యాంగ పరిమితులకు లోబడి, చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా సామాజిక న్యాయం చేయడమే లక్ష్యం. ప్రతి వర్గానికీ గౌరవం ఉండాలి. ప్రతి వర్గానికీ అవకాశం ఉండాలి. ప్రతి కుటుంబం తన పిల్లల భవిష్యత్తుపై ఆశతో ముందుకు సాగాలి. ఇదే కూటమి ప్రభుత్వ సామాజిక న్యాయ దృక్పథం.

**చరిత్ర పునరావృతం కాదు..**

**చరిత్రకు కొనసాగింపు**

ఎన్టీఆర్ బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యానికి తలుపులు తెరిచారు. చంద్రబాబు ఆ తలుపులను మరింత విస్తరించారు. ఇప్పుడు మరోసారి 34 శాతం రిజర్వేషన్లతో ఆ అవకాశాలను మరింత బలోపేతం చేస్తున్నారు. అందుకే ఈ నిర్ణయాన్ని కేవలం ఒక ప్రభుత్వ ఉత్తర్వుగా చూడకూడదు. ఇది ఒక రాజకీయ సిద్ధాంతానికి కొనసాగింపు. ఇది ఒక ఎన్నికల హామీకి అమలు రూపం. ఇది బీసీ కుటుంబాల ఆశలకు సమాధానం. ఇది కొత్త తరం నాయకత్వానికి ఆహ్వానం. ఇది సామాజిక న్యాయానికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న హామీ.

"అనాడు ఎన్టీఆర్.. నేడు చంద్రబాబు"అనే మాట ఈ సందర్భంలో కేవలం నినాదం కాదు. బీసీల రాజకీయ సాధికారతకు తెలుగుదేశం పార్టీ కొనసాగిస్తున్న విధానానికి ప్రతిబింబం. మాట ఇచ్చాం.. నిలబెట్టుకున్నాం. బీసీలకు అండగా ఉంటామని చెప్పాం.. అండగా నిలిచాం. 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చాం.. ఇప్పుడు నిర్ణయం తీసుకున్నాం. ఇక ముందున్న లక్ష్యం ఒక్కటే–ఈ అవకాశాలను బీసీ సమాజం పూర్తిగా వినియోగించుకునేలా చేయడం. గ్రామ పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు కొత్త నాయకత్వాన్ని తయారు చేయడం. విద్య, నైపుణ్యం, ఉపాధి, వ్యాపారం, రాజకీయ ప్రాతినిధ్యంలో బీసీలకు సముచిత స్థానం కల్పించడం. బీసీల అభ్యున్నతి అంటే రాష్ట్ర అభ్యున్నతి. బీసీల సాధికారత అంటే సమాజ సాధికారత. బీసీల రాజకీయ ప్రాతినిధ్యం అంటే ప్రజాస్వామ్యానికి మరింత బలం. అందుకే ఇది కేవలం 34 శాతం రిజర్వేషన్ కాదు.. బీసీల భవిష్యత్తుకు 34 శాతం కొత్త అవకాశాల తలుపు.




ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి... విద్య, సాంకేతికత, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమర్థ నాయకత్వంలో గత రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్ సమాచార, సాంకేతిక రంగంలో అపూర్వ ప్రగతి సాధించింది. ఆధునిక సాంకేతికతను ప్రజా పరిపాలనకు, పరిశ్రమలకు, యువత ఉపాధికి అనుసంధానిస్తూ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం పటిష్టమైన అడుగులు వేసింది.



# హైటెక్ ఆంధ్ర

## ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తో రాష్ట్రంలో డిజిటల్ విప్లవం

## మంత్రి లోకేష్ నాయకత్వంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో అపూర్వ ప్రగతి




రతన్ టాటా ఆవిష్కరణ కేంద్రం ద్వారా యువ పారిశ్రామికవేత్తలకు విశేష ప్రోత్సాహం లభించింది. గత రెండేళ్లలో ఐదువేల మందికి పైగా నూతన ఆలోచనలతో ముందుకొచ్చిన యువతను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఆరు వందలకుపైగా నూతన సంస్థలకు మార్గదర్శకత్వం, శిక్షణ, ప్రోత్సాహక నిధులు, పెట్టుబడి అవకాశాలు కల్పించారు. అరవైకి పైగా సంస్థలకు నేరుగా ఆర్థిక సహాయం అందించడంతో పాటు పద్నాలుగు కోట్ల రూపాయలతో ఆధునిక మౌలిక వసతులను అభివృద్ధి చేశారు. రూ.11.76 కోట్ల ప్రోత్సాహక నిధులు విడుదల చేసి భవిష్యత్ విస్తరణ కోసం రూ.25కోట్లకు పైగా సామాజిక బాధ్యత నిధులను సమీకరించారు. ఈ కార్యక్రమాల ద్వారా ఐదు వందలకు పైగా ఉపాధి అవకాశాలు ఏర్పడగా ఏడు వేలకుపైగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఆవిష్కరణలతో అనుసంధానించారు. 450కి పైగా సాంకేతిక కార్యక్రమాలు నిర్వహించి 19 దేశాల్లోని 500 మందికి పైగా ప్రవాస ఆంధ్రులను రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములను చేశారు. 15 అంతర్జాతీయ భాగస్వామ్య ఒప్పందాలు, మూడు అత్యుత్తమ ప్రతిభా కేంద్రాలు, మూడు గ్రామీణ ఆవిష్కరణ కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రంలో సృజనాత్మకతకు కొత్త దిశ చూపారు.

### భౌగోళిక సమాచారంతో సమర్థ పరిపాలన

ఆంధ్రప్రదేశ్ అంతరిక్ష అనువర్తనాల కేంద్రం రాష్ట్రంలోని ఇరవైకి పైగా ప్రభుత్వ శాఖలకు భౌగోళిక సమాచార సేవలను అందిస్తోంది. జలవనరుల నిర్వహణ, భూ వినియోగ విశ్లేషణ, అడవుల పర్యవేక్షణ, వరదలు, కరువు పరిస్థితుల అంచనా, పర్యావరణ సంరక్షణ, డ్రోన్ సర్వేలు, కృత్రిమ మేధస్సు ఆధారిత విశ్లేషణ వంటి అనేక రంగాల్లో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. ఈ సమాచార వ్యవస్థల ద్వారా ప్రభుత్వ నిర్ణయాలు మరింత వేగవంతంగా, శాస్త్రీయంగా మారడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాల అమలు మరింత సమర్థవంతంగా జరుగుతోంది.

### క్వాంటం సాంకేతికతలో దేశానికే మార్గదర్శి

అమరావతిని దేశంలోని తొలి క్వాంటం సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. ప్రముఖ అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో వెయ్యి కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులతో క్వాంటం వ్యాలీ నిర్మాణం ప్రారంభమైంది. దేశంలోనే తొలి క్వాంటం విధానాన్ని రూపొందించి 28 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. 11 ప్రాజెక్టులకు ప్రభుత్వ అనుమతులు జారీ చేయగా మరో 11 ప్రాజెక్టులకు మంత్రివర్గ ఆమోదం లభించింది. ఇప్పటికే నాలుగు ప్రాజెక్టులు కార్యరూపం దాల్చాయి. 48 పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు ఇందులో భాగస్వాములయ్యాయి. క్వాంటం పరిశోధన కేంద్రాలు, శిక్షణా వేదికలు, విద్యా సంస్థల్లో 380 చిన్న క్వాంటం ఆవిష్కరణ కేంద్రాలు ఏర్పాటుచేసి భవిష్యత్ తరాలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారు.

### పరిశ్రమలకు తొలి ఎంపికగా ఆంధ్రప్రదేశ్

గత రెండేళ్లలో సమాచార సాంకేతికత, ప్రపంచ సేవా కేంద్రాలు, అర్ధవాహక తయారీ, దత్తాంశ కేంద్రాలు, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఎలక్ట్రానిక్ విడిభాగాల తయారీ వంటి రంగాలకు ప్రత్యేక పారిశ్రామిక విధానాలను ప్రభుత్వం రూపొందించింది. ఈ విధానాల ఫలితంగా దేశీయ, విదేశీ సంస్థలు ఆంధ్రప్రదేశ్ వైపు అడుగులు వేస్తున్నాయి. భాగస్వామ్య సదస్సులో లక్షా తొంభై ఐదువేల కోట్ల రూపాయల పెట్టుబడి ఒప్పందాలు కుదరగా 1.60 లక్షల మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయి. రెండేళ్లలోనే రూ.2.78 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. కృత్రిమ మేధస్సు ఆధారిత డేటా సెంటర్లు, సాఫ్ట్‌వేర్ సంస్థల విస్తరణ, ఎలక్ట్రానిక్స్ తయారీ పరిశ్రమలు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపునిచ్చాయి.

### సమాచార మౌలిక వసతుల విస్తరణ

రాష్ట్రవ్యాప్తంగా సమాచార ప్రసార వ్యవస్థలను




బలోపేతం చేయడానికి కొత్త నిబంధనలు అమలు చేశారు. 1,353 కొత్త నాలుగో తరం ప్రసార గోపురాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర సమాచార కేంద్రాలను ఆధునిక గణన వ్యవస్థలు, దత్తాంశ నిల్వ కేంద్రాలు, భద్రతా వ్యవస్థలు, ప్రత్యామ్నాయ సమాచార నిల్వలతో బలోపేతం చేశారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వ్యక్తిగత మేఘ గణన వేదికలు, తిరుపతిలో విపత్తు పునరుద్ధరణ కేంద్రం ఏర్పాటు దిశగా చర్యలు కొనసాగుతున్నాయి.

### సమాచార భద్రతకు ప్రాధాన్యం

ఆంధ్రప్రదేశ్ సాంకేతిక సేవల సంస్థ ద్వారా ప్రభుత్వ శాఖల సమాచార వ్యవస్థలను మరింత భద్రపరిచారు. రూ.700 కోట్ల విలువైన సమాచార సాంకేతిక పరికరాల కొనుగోలు, రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర సమాచార భద్రతా పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు, ప్రతి జిల్లాలో సమాచార సాంకేతిక కార్యాలయాల స్థాపన వంటి చర్యలు చేపట్టారు. సైబర్ భద్రతను అంతర్జాతీయ ప్రమాణాలకు తీసుకెళ్లేందుకు ఆధునిక పర్యవేక్షణ వ్యవస్థలు, కృత్రిమ మేధస్సు ఆధారిత కొనుగోలు విధానాలు, ప్రభుత్వ శాఖలకు స్వదేశీ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి వంటి కార్యక్రమాలు అమలవుతున్నాయి.

### యువతకు ఉపాధి-రాష్ట్రానికి అభివృద్ధి

సమాచార సాంకేతిక రంగంలో చేపట్టిన సంస్కరణలతో 1.81 లక్షలకు పైగా ఉపాధి అవకాశాలు ఏర్పడుతున్నాయి. యువతలో నైపుణ్యాభివృద్ధి, నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం, పరిశ్రమలకు అనుకూల విధానాలు, ఆధునిక మౌలిక వసతుల కల్పనతో ఆంధ్రప్రదేశ్ దేశంలోని ప్రముఖ సాంకేతిక రాష్ట్రంగా వేగంగా ఎదుగుతోంది.

### రాబోయే లక్ష్యాలు

రానున్న మూడేళ్లలో దేశంలోనే అగ్రగామి ఎలక్ట్రానిక్స్ తయారీ రాష్ట్రంగా నిలవడం, అర్ధవాహక పరిశ్రమల్లో అగ్రస్థానాల్లో నిలవడం, సమాచార సాంకేతిక ఎగుమతుల్లో తొలి మూడు రాష్ట్రాల్లో స్థానం సంపాదించడం, ప్రపంచ స్థాయి దత్తాంశ కేంద్రాల నిలయంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడం ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. అత్యాధునిక క్వాంటమ్ గణన వ్యవస్థ, క్వాంటం పరికరాల తయారీ కేంద్రం, ప్రపంచ స్థాయి పరిశోధనా వేదికలు, గ్రామీణ ప్రాంతాల వరకు ఆవిష్కరణల విస్తరణ, లక్షలాది యువతకు నైపుణ్య శిక్షణ కల్పించడం ద్వారా సాంకేతిక రంగంలో రాష్ట్రాన్ని కొత్త శిఖరాలకు చేర్చాలని ప్రభుత్వం సంకల్పించింది.

శశికుమార్
తెలుగుదేశం సైనికుడు



# రూ.2.10 కోట్లతో ప్రసూతి, శిశు ఆరోగ్య విభాగం

**● నేడు ప్రారంభించనున్న రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు**



కోటబొమ్మాళి (చైతన్యరథం): కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రి ప్రాంగణంలో రూ.2.10 కోట్లతో నిర్మించిన నూతన ప్రసూతి, శిశు ఆరోగ్య విభాగాన్ని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం ప్రారంభించనున్నారు. ఈ విభాగం అందుబాటులోకి రావడంతో కోటబొమ్మాళి పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రసూతి, శిశు వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి. గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు అవసరమైన వైద్య సేవలను స్థానికంగానే అందించే అవకాశం కలగనుంది. ప్రసవం కోసం శ్రీకాకుళం, టెక్కలి వంటి పట్టణ ప్రాంతాల్లోని ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం చాలా వరకు తగ్గనుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రయాణ ఖర్చులు, సమయం ఆదా కావడంతోపాటు అత్యవసర సమయాల్లో సకాలంలో వైద్యం అందే అవకాశం ఏర్పడుతుంది. నూతన విభాగం ద్వారా గర్భిణులకు ప్రసవానికి ముందు, ప్రసవ సమయంలో, ప్రసవానంతరం అవసరమైన వైద్య పర్యవేక్షణతోపాటు శిశువుల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సేవలు అందుబాటులోకి రానున్నాయి. తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించేందుకు ఈ విభాగం దోహదపడనుంది. కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రిని మరింత బలోపేతం చేసి, స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంలో భాగంగానే ఈ నూతన విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఆధునిక సౌకర్యాలతో ప్రసూతి, శిశు వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో పరిసర మండలాల ప్రజలకు ఇది ఎంతో ప్రయోజనకరంగా మారనుంది.

**ప్రజలకు వైద్యం మరింత చేరువ చేయడమే లక్ష్యంగా..**

ప్రభుత్వ వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాల ప్రజలకు చేరువ చేయడంలో భాగంగా కోటబొమ్మాళి ఆసుపత్రిలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నారు. తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ నిర్మించిన ఈ నూతన విభాగం ద్వారా కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నరసన్నపేట పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.

# చీపురుపల్లి 100 పడకల ఆసుపత్రికి నిధులివ్వండి : ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే కళా వెంకట్రావు



గరివిడి (చైతన్యరథం): చీపురుపల్లిలోని 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రి నూతన భవనాల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు రూ.30 కోట్లు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో గురువారం ఆయన ఈ అంశాన్ని సభ దృష్టికి తీసుకెళ్లారు. 100 పడకల ఆసుపత్రికి అవసరమైన వైద్యులు, సిబ్బందిని ప్రభుత్వం కేటాయించినప్పటికీ, ప్రస్తుతం ఉన్న భవనం 50 పడకలకే సరిపోతుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. రోజురోజుకూ రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఆసుపత్రి విస్తరణ అత్యవసరమన్నారు. ఆసుపత్రి విస్తరణకు అవసరమైన ఐదు ఎకరాలకు పైగా స్థలం ఇప్పటికే సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. నూతన భవనాల నిర్మాణంతో పాటు ఆధునిక వైద్య పరికరాలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు రూ.30 కోట్లు అవసరమవుతాయని, దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిధులను త్వరితగతిన మంజూరు చేసి, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కళా వెంకటరావు ప్రభుత్వాన్ని కోరారు. 100 పడకల ఆసుపత్రి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే చీపురుపల్లి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు.

# సీఎం చంద్రబాబు ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారు

విశాఖపట్నం (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యక్ష పద్ధతిలో జడ్పీ ఎన్నిక జరగాలంటూ ఏపీ కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని ఎంపీ శ్రీభరత్ అభినందించారు. గురువారం విశాఖ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఎంపీ తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలు ప్రశాంతంగా ఉన్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వం చేసిన అరాచకాలు నుంచి రాష్ట్రం ఇంకా పూర్తిగా రికవరీ అవ్వలేదని ఎంపీ అన్నారు. రాష్ట్రంలో మంచి ప్రతిపక్షం లేదని... ప్రతిపక్షంలో ఉన్నవారికి వారి పాత్ర అర్థం కావడం లేదని చెప్పుకొచ్చారు. ఎల్‌నినో వలన నీటి సమస్య తలెత్తుతోందన్నారు. దీన్ని అనరాగా తీసుకొని డేటా సెంటర్ల వలన నీటి సమస్య వస్తోందని కొన్ని శక్తులు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. డేటా సెంటర్లు రావడానికి ఇంకా రెండు సంవత్సరాల సమయం పడుతుందని తెలిపారు. వర్షాలపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు.

# ఏపీకి మరో భారీ రైల్వే ప్రాజెక్టు... రూ.2,229 కోట్ల వ్యయం



తెలుగు రాష్ట్రాల్లో రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణ దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల మధ్య రైల్ కనెక్టివిటీని మరింత బలోపేతం చేసేందుకు గూడూరు–గుమ్మిడిపూండి సెక్షన్ మధ్య రూ.2,229 కోట్ల వ్యయంతో మరో రెండు (3,4వ) కొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకోగా, వివరాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. వైజాగ్–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌తో పాటు ఈస్ట్ కోస్ట్ ఎకనామిక్ కారిడార్‌లో ఈ మార్గం అత్యంత కీలకమైనదిగా మారనుంది. గూడూరు నుంచి గుమ్మిడిపూండి మధ్య 90 కిలోమీటర్ల పొడవునా సాగే ఈ ప్రాజెక్టును రాబోయే నాలుగేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నిర్మాణంలో భాగంగా స్వర్ణముఖి నదిపై ఒక భారీ బ్రిడ్జి, 21 పెద్ద వంతెనలు, 127 చిన్న వంతెనలతో పాటు 34 ఆర్వోబీ లేదా ఆర్‌యూబీలను నిర్మించనున్నారు. ఈ కొత్త లైన్ల వల్ల పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల అభయారణ్యం వంటి పర్యాటక ప్రాంతాలకు రవాణా సౌకర్యం మరింత సులువవుతుంది.

**రైల్వే నెట్‌వర్క్ విస్తరణ, కోట్లాది మందికి ప్రయోజనం:**

ఈ ప్రాజెక్టుతో పాటు దేశవ్యాప్తంగా మొత్తం రూ. 9,450 కోట్ల అంచనా వ్యయంతో 4 మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనివల్ల భారతీయ రైల్వే నెట్‌వర్క్ మరో 410 కిలోమీటర్ల మేర విస్తరించనుంది. దాదాపు 6,448 గ్రామాలకు చెందిన 60 లక్షల మంది జనాభాకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. 2030–31 నాటికి ఈ విస్తరణ లక్ష్యాలను పూర్తిగా సాధిస్తామని కేంద్రం స్పష్టం చేసింది.

# వినూత్నంగా ఇంటింటికీ ... మన్యం పోలీస్ కార్యక్రమం



పార్వతీపురం (చైతన్యరథం): పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్ శాఖ ప్రజల భద్రతకు వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు మరింత చేరువగా వెళ్లి, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, పోలీస్ సేవలు మరియు ప్రజా భద్రతపై అవగాహన కల్పించే లక్ష్యంతో రాష్ట్రం, జిల్లా లోనే మొదటగా రూపొందించిన "ఇంటింటికీ... మన్యం పోలీస్" కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ శ్రీ ఎస్.వి. మాధవ్ రెడ్డి, ఐపీఎస్ ఆదేశాల మేరకు పాలకొండ పెద్ద కాపు వీధిలో నిర్వహించారు. పాలకొండ ఎస్సై సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మాదకద్రవ్యాల నిర్మూలన, మహిళలు–చిన్నారుల భద్రత, రోడ్ సేఫ్టీ, చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ ,ప్రజలకు పోలీస్ శాఖ అందిస్తున్న వివిధ సేవలు, అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన టోల్ ఫ్రీ నంబర్స్ తదితర అంశాలపై రూపొందించిన కరపత్రాలను, స్టిక్కర్స్ పాలకొండ పట్టణంలో ప్రజలకు పంపిణీ చేస్తూ వాటి ఆవశ్యకతను విస్తృత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటుగా డిఎస్పీ ఎం.రాంబాబు, చినమేరంగి పట్టణ సిఐ తిరుపతి రావు , ఎస్సై నీలకంఠం, ఎల్విన్‌పేట ఎస్సై శివప్రసాద్, జియ్యమ్మవలస ఎస్సై ప్రశాంత్ మరియు సిబ్బంది, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో ప్రజలు,యువత పాల్గొన్నారు.

# శాసనసభకు వచ్చి ప్రశ్నించే దమ్ము జగన్‌కు లేదు : ఎంపీ కలిశెట్టి



విజయనగరం (చైతన్యరథం): ప్రజా సమస్యలు, పరీక్షల నిర్వహణపై శాసనసభ వేదికగా ఆధారాలతో చర్చకు రావాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సవాల్ విసిరితే, సమాధానం చెప్పే ధైర్యం లేక పారిపోయిన మాజీ సీఎం వైఎస్ జగన్.. తన ప్యాలెస్లో ప్రెస్మీట్ పెట్టి యథావిధిగా అబద్ధాలు చెబుతున్నారని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మండిపడ్డారు. కష్టపడి చదివి డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించి పాఠశాలల్లో విధుల్లో చేరిన ఉపాధ్యాయులపై నిరాధార ఆరోపణలు చేయడం వారి ప్రతిభను అవమానించడమే అవుతుందన్నారు. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్, కన్వీనర్ బాధ్యతలను ఒకే అధికారి నిర్వహించకూడదని ఎక్కడా లేదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నియామకాలు జరిగాయని ఎంపీ స్పష్టం చేశారు. 2019 ఎన్నికల ముందు ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ అంటూ నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిన చరిత్ర జగన్‌ని ధ్వజమెత్తారు. ఐదేళ్లపాటు డీఎస్సీ వేయకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న వ్యక్తి, ఇవాళ వేలాది కుటుంబాల్లో ఉద్యోగాలతో వెలుగులు నిండుతుంటే చూసి ఓర్వలేకపోతున్నారని విమర్శించారు.

# మెడికల్ కాలేజీ పనులు వేగవంతం చేయాలి : ఎంపీ



రాజమహేంద్రవరం (చైతన్యరథం): నగరంలో నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ పనుల పురోగతిపై ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సమీక్ష నిర్వహించారు. మెడికల్ కాలేజీలో నిర్మించిన రెండు లెక్చరర్ గ్యాలరీలను కూటమి నాయకులతో కలిసి వారు ప్రారంభించారు. అనంతరం మెగా సంస్థ ప్రతినిధులు, మెడికల్ కాలేజీ అధ్యాపకులు, అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. వీటిలో విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కాలేజీలను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ ఐదు కాలేజీల నిర్మాణానికి సుమారు రూ.8 వేల కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం మెడికల్ కాలేజీ నిర్మాణానికి సుమారు రూ.450 కోట్ల నుంచి రూ.465.75 కోట్ల వరకు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రాధాన్యత క్రమంలో చేపట్టిన ఐదు మెడికల్ కాలేజీలతో పోలిస్తే రాజమహేంద్రవరం మెడికల్ కాలేజీ పనులు కొంత వేగంగా ముందుకు సాగుతున్నాయని పురందేశ్వరి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ అధికారులను అప్రమత్తం చేయడం వల్లే ఈ పురోగతి సాధ్యమైందని అభినందించారు. అయితే ఇంకా కొన్ని పనులు పూర్తి కావాల్సి ఉన్నదన్నారు. ఇప్పటికే విద్యార్థులు కాలేజీలో చేరారని, సుమారు 500 మంది విద్యార్థులకు సరిపడే బాలుర, బాలికల హాస్టల్ సామగ్రి అందుబాటులో ఉందని తెలిపారు. కొత్తగా చేరే విద్యార్థులకు కూడా అవసరమైన వసతి కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. ముఖ్యంగా బాలికల హాస్టల్ విషయంలో పూర్తి భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని ప్రిన్సిపల్, యాజమాన్యానికి సూచించినట్లు చెప్పారు. కొత్తగా నిర్మిస్తున్న జీ+7 బాలుర, బాలికల హాస్టళ్ల పనులు పూర్తయ్యే వరకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు.

# ఐటీడీపీ డిజిటల్ సైనికులు సమిష్టిగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలి

**•ఐటీడీపీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించిన టీడీపీ నేత బుద్దా వెంకన్న**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బుద్దా వెంకన్న ఆధ్వర్యంలో నియోజకవర్గ ఐటీడీపీ సభ్యులతో గురువారం ఒక ముఖ్యమైన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న ఐటీడీపీ సభ్యులకు భవిష్యత్తు కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ మరియు పార్టీ సేవా కార్యక్రమాలను సోషల్ మీడియా వేదికగా ప్రతి ఇంటికీ, ప్రతి వ్యక్తికీ తెలిసే విధంగా విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పశ్చిమ నియోజకవర్గంలోని 22 డివిజన్లలో డివిజన్ స్థాయి నుంచి ఐటీడీపీని బలోపేతం చేయాలని, డిజిటల్ వేదికలపై పార్టీ విజయాల కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులు మధురాంతకం సాయి చైతన్య, ప్రధాన కార్యదర్శి బోగవల్లి రమేష్, ఉపాధ్యక్షులు ఎస్ రెడ్డి గౌరీ, బొల్లు అనుదీప్, అధికార ప్రతినిధి సతీష్ కుమార్, జిల్లా ఐటీడీపీ నాయకులు పుప్పాల దుర్గ, ఆర్గనైజింగ్ సెక్రటరీలు బందారు దుర్గారావు, కొత్తమల్ రాజు, కార్యదర్శులు అమర మల్లేశ్వరి, షేక్ మునీర్ తదితరులు పాల్గొన్నారు.

# గన్నవరం నియోజకవర్గంలో దేవాలయ భూములను పరిరక్షించాలి

**•ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో పెండింగ్ పరిహారం వెంటనే చెల్లించాలి : యార్లగడ్డ వెంకట్రావు**



గన్నవరం (చైతన్యరథం): నియోజకవర్గంలోని దేవాలయ భూములను పరిరక్షించడంతో పాటు విమానాశ్రయ నిర్వాసితులు, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అసెంబ్లీ వేదికగా కోరారు. శాసనసభ సమావేశంలో భాగంగా గురువారం ఆయన మాట్లాడుతూ నిడమానూరు గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 12.42 ఎకరాల భూమి 20 ఏళ్లుగా ఇతరుల అధీనంలో ఉందని తెలిపారు. ఈ విషయం పై హైకోర్టులోనూ దేవస్థానానికి అనుకూలంగా తీర్పు వచ్చిందని, పాస్‌బుక్ కూడా దేవస్థానం పేరుతో జారీ అయిందని చెప్పారు. అన్యాక్రాంతమైన భూమిని వెంటనే స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఎండోమెంట్స్ మంత్రి కోరారు. అలానే పాతపాడులోని చెన్నకేశవస్వామి ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. విజయవాడ బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం ఆలయానికి చెందిన భూమి పోయిందని ఇందుకు సంబంధించిన రూ.38.98 లక్షలు ఎన్‌హెచ్‌ఏఐ, కలెక్టర్ ల్యాండ్ అక్విజిషన్ ఉమ్మడి ఖాతాలో ఉన్నాయని తెలిపారు. ఆ నిధులను ఎండోమెంట్స్ శాఖకు బదలాయించి ఆలయ పునర్నిర్మాణానికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కృష్ణా జిల్లాలో గతంలో జరిగిన మైనింగ్ అక్రమాలపై రూ.87 కోట్ల జరిమానా విధించగా, గన్నవరం ప్రాంతంలోనే సుమారు రూ.52 కోట్ల జరిమానా విధించినప్పటికీ ఇప్పటివరకు వసూలు కాలేదని వెంకట్రావు తెలిపారు. ఈ వ్యవహారంపై సామాజిక కార్యకర్త హైకోర్టును ఆశ్రయించారని చెప్పారు. గతంలో విజిలెన్స్ విచారణకు ఆదేశించిన సమయంలో అప్పటి తహసీల్దార్‌గా పనిచేసిన నరసింహారావుపై విచారణ చేపట్టాలని పలుమార్లు కోరినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో నీటి తీరువాను రద్దు చేయాలని కోరారు. గన్నవరం ప్రాంతంలో పోలవరం కాలువ పరిధిలోని పరిహార ప్రాంతాల్లో చెరువులను నింపితే కనీసం తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

# జర్నలిస్టులకు హౌసింగ్ సౌకర్యం కల్పించాలి : ఎమ్మెల్యే గళ్లా మాధవి



వెలగపూడి (చైతన్యరథం): అమరావతి వెలగపూడిలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాల జీరో అవర్‌లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి జర్నలిస్టుల సమస్యలను ప్రస్తావించారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలిచే జర్నలిస్టులు సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, ప్రజా సమస్యలను, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే కీలక బాధ్యతను నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా విలేఖరుల్లో అధిక శాతం మంది అత్యల్ప వేతనాలతో పనిచేస్తున్నారని, సొంత ఇల్లు నిర్మించుకోవడం వారికి పెద్ద సవాల్‌గా మారిందని తెలిపారు. జర్నలిస్టుల వృత్తిలో స్థిరత్వం, నిర్దిష్టమైన పనివేళలు లేకపోవడం వల్ల వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే ఆరోగ్య కార్డులు, గృహనిర్మాణ పథకాలు వంటి ప్రోత్సాహకాలు జర్నలిస్టుల కుటుంబాలకు సామాజిక భద్రతను కల్పిస్తాయని ఎమ్మెల్యే గళ్లా మాధవి వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జూబ్లీహిల్స్ వంటి ప్రాంతాల్లో జర్నలిస్టు కాలనీలు ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి వర్గాన్ని తన సొంత కుటుంబ సభ్యులుగా భావించి వారి అభ్యున్నతి కోసం కృషి చేసే నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టులకు గృహ సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో జీ.ఓ. నెం. 67, 107లను తీసుకువచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ జీవోలను అమలు చేస్తూ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు లేదా గృహ సౌకర్యం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని సభ ద్వారా కోరారు.

# గ్రామీణ వైద్య సేవలు బలోపేతం చేయాలి : ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు

రాయదుర్గం (చైతన్యరథం): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం మరింత శ్రద్ధ చూపాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో గురువారం ఆయన మాట్లాడుతూ, రాయదుర్గం నియోజకవర్గంలో 35 గ్రామీణ వైద్య కేంద్రాల భవన నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి అధిక నిధులు తీసుకురావడంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని అభినందించారు. రాయదుర్గం పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) ఆసుపత్రి నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయన్నారు. మంత్రి స్వయంగా పరిశీలించారని, జిల్లా అధికారుల దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లామని గుర్తు చేశారు. ఆగిపోయిన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా బొమ్మనహాల్ మండలం దర్గా హోన్నూరులో గత టిడిపి



పాలనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తాను మంజూరు చేయించానన్నారు. ఎలాంటి వసతులు, వైద్య పరికరాలు లేకుండానే గత వైసీపీ నాయకులు భవనాన్ని హడావుడిగా ప్రారంభించారన్నారు.

# ప్లాస్టిక్‌కు నో చెప్పాలి.. పర్యావరణాన్ని కాపాడాలి

**•మోరంపూడి సిటీ స్పెషల్ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో 'సే నో టూ ప్లాస్టిక్' కార్యక్రమం**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మోరంపూడి సిటీ స్పెషల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రైమరీ అండ్ హైస్కూల్‌లో నిర్వహించిన 'సే నో టూ ప్లాస్టిక్' కార్యక్రమాన్ని నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువల్లో పేరుకుపోవడం వల్ల మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడటంతో పాటు, పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందని అధికారులు వివరించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలిసిపోవడానికి ఎక్కువ కాలం పడుతుందని, వాటి వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని సూచించారు. విద్యార్థులు తమ ఇళ్లలోనూ, పరిసర ప్రాంతాల్లోనూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా గుడ్డ సంచులు, పునర్వినియోగించగల వస్తువులను వినియోగించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. పరిశుభ్రమైన నగరం, ఆరోగ్యకరమైన సమాజం కోసం పారిశుద్ధ్యంపై ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కమిషనర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు సహకరించాలని కోరారు. అనంతరం ప్లాస్టిక్ రీయూస్ కోసం రూపొందించిన పలు ప్రయోగాలను వారు తిలకించారు. ఈ సందర్భంగా 'ప్లాస్టిక్‌కు నో చెబుతాం.. పర్యావరణాన్ని కాపాడుతాం' అంటూ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, నగర పాలక సంస్థ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల మరమ్మతులకు రూ.38 కోట్లు కేటాయించండి : ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు (చైతన్యరథం): నియోజకవర్గంలోని లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల మరమ్మతులకు అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే కేటాయించి, 50 వేల ఎకరాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో జీరో అవర్‌లో నియోజకవర్గంలోని సాగునీటి సమస్యలను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గంలో 28 లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు మరమ్మతులకు గురయ్యాయని ఆయన తెలిపారు. ప్రాజెక్టులు పనిచేయకపోవడంతో పంట పొలాలకు సకాలంలో సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో దాదాపు 90 శాతం గ్రామీణ ప్రాంతమే ఉందని, అధికశాతం ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు సకాలంలో సాగునీరు అందించి, పంటలు మంచి దిగుబడులు సాధించేలా చేస్తేనే గ్రామీణ ప్రాంతాల ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, అదే స్ఫూర్తితో నియోజకవర్గంలోని 28 లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల మరమ్మతులకు రూ.38 కోట్లను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అవసరమైన నిధులను మంజూరు చేసి ప్రాజెక్టులను పునరుద్ధరిస్తే సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు.

# బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



అమృతలూరు (చైతన్యరథం): వేమూరు నియోజకవర్గం కొల్లూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 13 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.5,30,852 నిధులు మంజూరయ్యాయి. గురువారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు.. లబ్దిదారులకు, వారి కుటుంబ సభ్యులకు సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు కూటమి ప్రభుత్వం వైద్య ఖర్చులు సమకూర్చి ఆర్థిక భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు.

## రవి, సావిత్రమ్మ దంపతుల అంతిమయాత్రలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): పట్టణంలోని వెల్లటూరు రోడ్డు హనుమాన్ నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చీఫ్ విప్ గారి ఇంట్లో వంట మనిషిగా పనిచేస్తున్న సావిత్రమ్మ, భర్త రవి దుర్మరణం చెందారు. సమాచారం తెలుసుకున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు గురువారం సాయంత్రం వారి నివాసం వద్ద ఉంచిన భౌతిక కాయాలను సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రవి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని, ఆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం జరిగిన రవి, సావిత్రమ్మ ల అంతిమయాత్రలో పాల్గొని వీడ్కోలు పలికారు. చీఫ్ విప్ జీవీ వెంట పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### నేడు వినుకొండలో ప్రజాదర్బార్

నియోజకవర్గ ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక చీఫ్‌విప్ కార్యాలయంలో "ప్రజా దర్బార్" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చీఫ్ విప్ కార్యాలయ నిర్వహణ అధికారి గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఉదయం 09:30 గంటల నుండి 01:00 గంటల వరకు ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు స్వయంగా ప్రజల నుండి అర్జీలు, ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను స్వయంగా విని పరిష్కరించనున్నారు. వినుకొండ పట్టణంతోపాటు, నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ప్రజలు ప్రజా దర్బార్‌కు హాజరై తమ సమస్యలను చీఫ్ విప్ జీవీ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి అధికారులతో చర్చించి తక్షణ పరిష్కార మార్గం చూపడం జరుగుతుందని, ప్రజల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## జగ్గయ్యపేట రైల్వే స్టేషన్‌కు మహర్దశ : ఎంపీ కేశినేని

●సికింద్రాబాద్ వేదికగా సౌత్ సెంట్రల్ రైల్వే ఆధ్వర్యంలో పార్లమెంట్ సభ్యులతో సమావేశం



విజయవాడ (చైతన్యరథం): సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ వేదికగా 18 మంది పార్లమెంట్ సభ్యులతో సౌత్ సెంట్రల్ రైల్వే వారు నిర్వహించిన సమావేశంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట రైల్వే స్టేషన్ అభివృద్ధి నూతన రైల్వే లైన్ కొత్త రైల్ సేవలు రైల్వే స్టేషన్ మౌలిక సదుపాయాలు ప్రయాణికుల సౌకర్యాలు వంటి అంశాలపై ఎంపీ చిన్ని సమావేశంలో చర్చించారు ఈ సమావేశంలో ఎంపీ చిన్నితో పాటు జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... జగ్గయ్యపేట రైల్వే స్టేషన్, రైల్వే లైన్ కొత్త రైల్ సర్వీస్ వంటి మూడు ప్రధానమైన అంశాలను సౌత్ సెంట్రల్ రైల్వే ముందు ఉంచినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా మొదటి అంశంగా కాచిగూడ జగ్గయ్యపేట కొత్త రైల్వే లైన్‌పై ఎంపీ చిన్ని సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులను అడుగగా రైల్వే అధికారులు సమాధానం ఇస్తూ కాచిగూడ జగ్గయ్యపేట కొత్త రైల్వే లైన్ సుమారు 228 కిలోమీటర్ల పొడవుతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డి పి ఆర్) రూపకల్పన సైతం తుది దశకు చేరుకుందని అన్నారు. హైదరాబాదు నుండి ఏపీలోని పారిశ్రామిక ప్రాంతమైన జగ్గయ్యపేటకు ప్రయాణ దూరం సమయం ఈ ప్రాజెక్టు పూర్తయితే తగ్గనున్నాయి. మరోవైపు రెండవ అంశంగా ఎంపీ చిన్ని జగ్గయ్యపేట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాలపై రైల్వే అధికారులను అడగగా రైల్వే అధికారులు సమాధానం ఇస్తూ జగ్గయ్యపేట రైల్వే స్టేషన్లో ప్రయాణికుల సౌకర్యాలు, స్టేషన్ మౌలిక సదుపాయాల సమగ్ర ఉన్నతీకరణను ప్రస్తుతం కొనసాగుతున్న మోటమర్రి- విష్ణుపురం డబ్లింగ్ పనుల పరిధిలోకి చేర్చడం జరిగిందని కోరిన సౌకర్యాలైన అప్రోచ్ రోడ్ బుకింగ్ కౌంటర్ సౌకర్యాల మెరుగుదల మరియు ఇతర కనీస అవసరమైన సౌకర్యాల కల్పన పనులను డబ్లింగ్ పనులతో పాటే క్రమ పద్ధతిలో అమలు చేసి పూర్తి చేయడం జరుగుతుందని తెలియజేశారు.

### మౌలిక సదుపాయాలను ఉన్నతీకరించాల్సి ఉంది

మూడో ప్రధానమైన అంశంగా మోటమర్రి-జగ్గయ్యపేట- విష్ణుపురం రైల్వే లైన్‌లో తగిన పాసింజర్ రైలు సర్వీసులను ప్రవేశపెట్టాలని ఎంపీ చిన్ని రైల్వే అధికారులను అభ్యర్థించగా రైల్వే అధికారులు మాట్లాడుతూ మోటమర్రి-జగ్గయ్యపేట- విష్ణుపురం రైల్వే లైన్ ప్రస్తుతం కేవలం సరుకు రవాణాకు మాత్రమే అనువుగా ఉందని ప్రయాణికుల రైళ్లను నడపాలంటే సామర్థ్య భద్రత మెరుగుదల పనులతో మౌలిక సదుపాయాలను ఉన్నతీకరించాల్సి ఉందని అన్నారు. మంజూరైన డబ్లింగ్ పనులతో పాటు ఈ ప్రక్రియను కూడా జరుగుతుందని తెలియజేశారు.

## బ్రాహ్మణుల ఆర్థిక స్వావలంబన కోసమే క్రెడిట్ సొసైటీ

●నాడు సీఎం చంద్రబాబు దూరదృష్టితో ఏర్పాటు చేసిన సొసైటీ నేడు రూ.270 కోట్ల టర్నోవర్ స్థాయికి చేరుకోవడం హర్షణీయం : బ్రాహ్మణ సంక్షేమ సంస్థ ఛైర్మన్ కె. బుచ్చిరాంప్రసాద్



గొల్లపూడి (చైతన్యరథం): బ్రాహ్మణుల ఆర్థిక అభ్యున్నతి, స్వావలంబన కోసం నారా చంద్రబాబునాయుడు దూరదృష్టితో ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థకు అనుబంధంగా పనిచేస్తున్న బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గొల్లపూడిలోని బ్రాహ్మణ సంక్షేమ సంస్థ కార్యాలయంలో వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ ఛైర్మన్ కె.బుచ్చి రాంప్రసాద్ మాట్లాడుతూ... బ్రాహ్మణుల ఆర్థిక స్వావలంబన కోసం క్రెడిట్ సొసైటీకి పునాది వేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "బ్రాహ్మణుల కోసం చంద్రబాబు 12 సంవత్సరాల క్రితం వేసిన అడుగు నేడు దేవుడి దీవెనగా మారింది. రూ.25 కోట్లతో ప్రారంభమైన క్రెడిట్ సొసైటీ నేడు రూ.270 కోట్ల టర్నోవర్ స్థాయికి చేరుకోవడం చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనం. ఇది కేవలం ఒక ఆర్థిక సంస్థ సాధించిన విజయం కాదు.. బ్రాహ్మణులు తమ కాళ్లపై తాము నిలబడాలనే ఆయన సంకల్పానికి సజీవ సాక్ష్యం" అని బుచ్చి రాంప్రసాద్ అన్నారు. ప్రస్తుతం సొసైటీ 82,000 మందికి పైగా సభ్యులతో, రూ.77 కోట్లకు పైగా డిపాజిట్లతో, రూ.112 కోట్లకు పైగా రుణాలతో ముందుకు సాగుతోందని తెలిపారు. బ్రాహ్మణ కుటుంబాలకు పొదుపు, రుణ సదుపాయం, ఆర్థిక భరోసా కల్పించడంలో సొసైటీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

రూ.600 సభ్యత్వంతో ప్రత్యేక సంక్షేమ ప్రయోజనాలు

బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ సభ్యత్వం ద్వారా అందుబాటులో ఉన్న ప్రయోజనాలను ప్రతి బ్రాహ్మణ కుటుంబానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని ఛైర్మన్ అన్నారు. "కేవలం రూ.600తో సభ్యత్వం తీసుకునే అవకాశం ఉంది. 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల సభ్యులకు, నిబంధనలు మరియు అర్హతలకు లోబడి సహజ మరణం సంభవించినప్పుడు రూ.50,000 వరకు ఆర్థిక సహాయం అందించే ప్రత్యేక సంక్షేమ ప్రయోజనం ఉంది. ఇది సాధారణ లైఫ్ ఇన్సూరెన్స్‌కు ప్రత్యామ్నాయం కాదు... సొసైటీ సభ్యులకు అందించే సంక్షేమ ప్రయోజనం" అని ఆయన తెలిపారు. ఈ ప్రయోజనాలపై ప్రతి బ్రాహ్మణ కుటుంబానికి అవగాహన కల్పించి, అర్హత ఉన్నవారు సభ్యత్వం తీసుకుని సొసైటీ అందించే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని బుచ్చి రాంప్రసాద్ పిలుపునిచ్చారు.

## ఏపీపీఎస్సీకి - డీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్ : దేవినేని ఉమా

●పునాదులు లేని భవనం కూలిపోయినట్లే మెగా డీఎస్సీపై వాస్తవాలు లేని జగన్ ఆరోపణలు కూలిపోయాయి




విజయవాడ (చైతన్యరథం): ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెగా డీఎస్సీపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తికి పరీక్షల విధానాలు, నియామక ప్రక్రియపై కనీస అవగాహన లేకపోవడం ఆయన వ్యాఖ్యలతో స్పష్టమవుతోందన్నారు. మెగా డీఎస్సీపై జగన్ చేస్తున్న ఆరోపణలు పునాదులు లేని భవనం కూలిపోయినట్టుగా ఒక్కొక్కటిగా కూలిపోతున్నాయని పేర్కొన్నారు. మెగా డీఎస్సీపై జగన్‌ది రోజుకో మాట.. పూటకో ఆరోపణగా ఉందని దేవినేని ఉమ ఎద్దేవా చేశారు. ఒకసారి పేపర్ లీకేజీ అంటారని, మరోసారి స్పోర్ట్స్ కోటా గురించి మాట్లాడతారని, ఇంకోసారి ఉద్యోగాలు రాలేదని చెబుతున్నారని విమర్శించారు. అసలు జగన్ ఏం చెప్పదలుచుకున్నారో ఆయనకే స్పష్టత లేదన్నారు. మెగా డీఎస్సీపై జగన్ చేస్తున్న ఆరోపణలకు నియామకాలు పొందిన ఉపాధ్యాయులే సమాధానం చెబుతున్నారని తెలిపారు. 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిన కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరిగిన నియామకాలను తప్పుబట్టేలా మాట్లాడటం ద్వారా ఎంపికైన అభ్యర్థులను, వారి కుటుంబాలను జగన్ అవమానిస్తున్నారని ఆరోపించారు. స్పోర్ట్స్ కోటా ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులను క్షోభకు గురిచేసేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కోర్టుల్లో వందలాది కేసులు, న్యాయపరమైన చిక్కులు ఉన్నప్పటికీ వాటిని పరిష్కరించి మెగా డీఎస్సీ నిర్వహించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఉమ పేర్కొన్నారు. ఉపాధ్యాయ నియామకాలపై మంత్రి నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని, 16 వేలకుపైగా టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టారని తెలిపారు. నియామకాలు పొందిన ఉపాధ్యాయుల ఆనందాన్ని చూసైనా జగన్‌లో మార్పు రావడం లేదని విమర్శించారు.

## సంక్షేమమంటే కుటుంబానికి భరోసా : ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండున్నర ఏళ్ల కాలంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల గురించి, వాటి వల్ల కలిగే లబ్ధి గురించి అసెంబ్లీ సాక్షిగా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ వివరించారు. గురువారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడారు. సంక్షేమం అంటే కేవలం డబ్బు పంచడమే కాదని, ఒక కుటుంబానికి భరోసా కల్పించడం అని స్పష్టం చేశారు. బిడ్డల భవితకు అందించే నమ్మకంగానూ, అన్నదాతల పంటకు ధైర్యంగానూ, మహిళ ఆర్థిక స్వావలంబనగానూ సంక్షేమాన్ని తీసుకొచ్చామని చెప్పారు. వైసీపీ పాలనలో నవరత్నాల పేరిట నవ మోసాలు చేశారని విమర్శించారు. సంక్షేమం పేరిట సంక్షోభం తీసుకొచ్చారని తెలిపారు. ఎన్నికల్లో వాగ్దానాలను కేవలం హామీల అమలుగానే కాకుండా పరిపాలన బాధ్యతగా కూటమి ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. ప్రస్తుతం సంక్షేమ పథకాలు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి బాటలు వేసే విధంగా అమలు చేస్తున్నామన్నారు. గత వైసీపీ పాలనలో రూ. 2 వేల పింఛన్ ను రూ.3 వేలకు పెంచేందుకు నాలుగు సంవత్సరాల సమయం పట్టిందని సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒకేసారి నాలుగు వేల పింఛన్ అందిస్తోందని తెలిపారు. ఆనాడు పింఛన్లను వాలంటీర్లతో పంపిణీ చేసి ప్రజాధనాన్ని వృథా చేస్తే ప్రస్తుతం సచివాలయ సిబ్బంది ద్వారా జవాబుదారీతనంతో ఒకటో తేదీనే ఇంటి వద్దకే అందిస్తోన్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని చెప్పారు. గత వైసీపీ పాలనలో అమ్మఒడి పేరిట విద్యార్థులను దగా చేస్తే ఇప్పుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యా విప్లవానికి నాంది పలుకుతూ ప్రతి విద్యార్థికి 15 వేల రూపాయలు తల్లికి వందనం ద్వారా అమలు చేస్తున్నామన్నారు. దీపం పథకం కింద 4.57 కోట్ల సిలిండర్లు ఉచితంగా అందించడం,, స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తూ ఇప్పటివరకు 87 కోట్ల మందికి లబ్ధి చేకూర్చామని తెలిపారు.

## రాష్ట్ర చరిత్రలో బడుగు బలహీనవర్గాలకు మర్చిపోలేని రోజు

- బీసీలకు అండగా నిలిచింది అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ టీడీపీ ప్రభుత్వమే
- ఏపిఎస్ఆర్‌టిసి రీజినల్ ఛైర్మన్ పూల నాగరాజు



అనంతపురం (చైతన్యరథం): రోజున గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33 శాతం చొప్పున బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయానికి పార్టీ జాతీయ అధ్యక్షులు, ఏపి సీఎం నారా చంద్రబాబు నాయుడుకి, డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్‌కి, ఏపి ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి, బిజెపి పార్టీ నేతలకు మరియు సహచర మంత్రులకు జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఏపిఎస్ఆర్‌టిసి రీజినల్ ఛైర్మన్ పూల నాగరాజు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడుతూ... మండల పరిషత్, జిల్లా పరిషత్తు ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత నందమూరి తారక రామారావుదేనని, 73,74వ రాజ్యాంగ సవరణ స్పూర్తితో 1995లో యాక్ట్ 5 ద్వారా బీసీలకు 34% రిజర్వేషన్లను తీసుకువచ్చిన ఘనత నారా చంద్రబాబునాయుడుదని, ఈ కోటా ప్రకారమే 1995, 2001, 2006, 2013 సంవత్సరాల్లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో 34% రిజర్వేషన్లు చంద్రబాబునాయుడు అమలు చేశారు.

2019లో వచ్చిన జగన్‌రెడ్డి పాలనలో జీవో 176 తెచ్చి, బీసీలకు తీవ్ర అన్యాయం చేశారని, రాజకీయంగా బీసీలకు రాజ్యాధికారాన్నిసామాజిక ప్రాతినిధ్యాన్ని పోగొట్టి బీసీలను అణగదొక్కి, జగన్‌రెడ్డి బీసీలకు తీరని ద్రోహం చేశారని మండిపడ్డారు. జగన్‌రెడ్డి తన పాలనలో బీసీలకు ద్రోహం చేయడంలో ప్రథమ స్థానం నిలిచి, బీసీల విషయంలో జీవోలు 559, 560 ద్వారా 34 శాతం ఉన్న రిజర్వేషన్‌ను 24.15శాతానికి తగ్గించడం దారుణమని మండిపడ్డారు. దీనివల్ల రాష్ట్రంలో జగన్ ప్రభుత్వహయాంలో 16,800 మంది బీసీలు పోటీకి దూరమై రాజకీయ అవకాశాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు భాగస్వామ్యం కల్పిస్తే మంచి నాయకులుగా ఎదుగుతారని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ముఖ్యంగా బీసీలపై దాడులు చేసి, హత్యా రాజకీయాలు చేసిన ఘనత జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుంది, మా పెరిక సామాజికవర్గం చెందిన తోట చంద్రయ్యను అతి కిరాతకంగా వైసీపీ కార్యకర్తలు హత్య చేస్తే, చూసి ఆనందించిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని, ఇలాంటి ఫేక్ వ్యక్తులను, ఫేక్ పార్టీలను బీసీలు బహిష్కరించడానికి సిద్ధంగా ఉన్నారని పూల నాగరాజు దుయ్యబట్టారు.

2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక సంస్థల ఎన్నికలలో 34% రిజర్వేషన్‌ను తిరిగి కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడం బీసీ నాయకుడిగా గర్వపడుతున్నానని, గ్రామీణ ప్రాంతాల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు, పట్టణ ప్రాంతంలో 33.33 శాతం రిజర్వేషన్లు తిరిగి అమలు కాబోతుండటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

## బీసీ భవనానికి రూ.25 లక్షల ఎంపీ నిధులు



ఆదోని (చైతన్యరథం): ఆంధ్ర రాష్ట్రం బీసీలకు ప్రాధాన్యత ఇస్తూ బీసీల సంక్షేమానికి మల్టీ పర్పస్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణయ్య కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గం పెద్ద హరివనం గ్రామనికి ఇవ్వడం జరిగిందని, ఇది రాష్ట్ర కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప.... సతతంగా 6 నెలల నుంచి తిరిగి ఈ నిధులను తీసుకో రావడంలో చాలా కృషి చేయడం జరిగిందన్నారు. ఈరోజు డీఈ నాగరాజు, సంబంధించిన అధికారులు పెద్ద హరివాణం గ్రామానికి వచ్చి బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ నిధులు తీసుకొచ్చిన మాన్వి దేవేంద్రప్పకి ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు సన్మానంతో సత్కరించారు. అంతేకాదు బీసీల పట్ల బీసీల అభివృద్ధి పట్ల చైర్మన్ మాని దేవేంద్రప్ప... ఎల్లప్పుడు కృషి చేస్తానని ప్రజలకు భరోసా కల్పించారు. ఎస్సీలకు మైనార్టీలకు త్వరలోనే వీళ్లకు కూడా నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రం ఎంత అభివృద్ధి చెందుతుందో అందులో గ్రామాలు కూడా అభివృద్ధి చెందాలని ఒక నినాదంతో ముందుకు వెళతామని ప్రజలకు తెలిపారు. బీసీ కమ్యూనిటీ భవనానికి కుదిరితే మరో ఎంపీ నుంచి నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానని అన్నారు.

## ఇంటింటికి మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి

ప్రొద్దుటూరు (చైతన్యరథం): ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా గురువారం మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి పాల్గొన్నారు. టూ టౌన్ బైపాస్ లో(సంజీవనగర్ క్రాస్ నుండి) ఈ కార్యక్రమంలో ప్రజలను ప్రత్యక్షంగా కలిసి వారి సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారం కోసం కృషి చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుంది. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు స్వయంగా అభినందిస్తూ కూటమి ప్రభుత్వనికి తమ సంపూర్ణ మద్దతును తెలియజేశారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల ముంగిటకు తీసుకెళ్లే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అసెంబ్లీ వేదికగా ఎల్-నినో సమస్యను వినిపించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

- ప్రతి మండలానికి రూ.కోటి ఇవ్వాలని విజ్ఞప్తి
- సూపర్ సిక్స్ పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చాం
- ఆర్టీసీ బస్సులు, సిబ్బంది సంఖ్య పెంచాలన్న ఎమ్మెల్యే సునీత



అనంతపురం (చైతన్యరథం): ఎల్-నినో ప్రభావంతో అనంతపురం జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై అసెంబ్లీ వేదికగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత వాణి వినిపించారు. జీరో అవర్‌లో ఆమె మాట్లాడుతూ... అనంతపురం జిల్లాపై ఎల్-నినో ప్రభావం తీవ్రంగా ఉందన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో అయితే వెయ్యి అడుగులు బోరు వేసినా నీరు దొరకని పరిస్థితి ఉందన్నారు. ఇందులో అనంతపురం రూరల్ మండల పరిధిలో 70వేల ఓటర్లు ఉన్నారని.. అనేక కాలనీల్లో తాగునీటి సమస్య ఉందన్నారు. ఇప్పటికే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారని.. అయితే ఆ నీరు సరిపోవడం లేదన్నారు. అదనంగా మరిన్ని ట్యాంకర్లు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇంకా చాలా గ్రామాల్లో కూడా ఇలాంటి సమస్య ఉందన్నారు. అందుకే కేవలం తాగునీటికే ప్రతి మండలానికి కోటి రూపాయలు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కేవలం ప్రజలకే కాకుండా.. పశువులకు కూడా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో గొర్రెలు, మేకలు ఎక్కువగా ఉన్నాయని.. వీటి దాహార్తి తీర్చాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే హంద్రీనీవా ద్వారా నియోజకవర్గంలోని చెరువులకు కనీసం 30శాతం అయినా నీరు ఇవ్వాలని కోరారు. అప్పుడే భూగర్భ జలాలు కొంత వరకు ఉంటాయని.. పశువులకు నీరు అందుతుందన్నారు. మరోవైపు నియోజకవర్గంలో రైతు భరోసా కేంద్రాలు, స్వర్ణ గ్రామ సచివాలయాల భవనాలు చాలా వరకు అసంపూర్తిగా ఉన్నాయని వాటిని పూర్తి చేయాలని కోరారు..

సూపర్ సిక్స్ పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చాయి

**సూపర్ సిక్స్ పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చాయి**

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ అన్నవి కేవలం 6 సంక్షేమ పథకాలు మాత్రమే కాదని.. అవి సామాన్య ప్రజల జీవితాలను మార్చేవని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అసెంబ్లీలో చివరి రోజు జరిగిన లఘు చర్చలో ఆమె మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. తల్లికి వందనం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 42 లక్షల మంది తల్లులకు 10 వేల కోట్ల రూపాయలను 67 లక్షల మంది విద్యార్థులకు అందించారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో 40వేల మందికి 52కోట్ల రూపాయలు అందించారన్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా.. అందరికీ ఇస్తామని గతంలో జగన్ రెడ్డి మోసం చేశారన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద పంటల సాగు చేసే సమయంలో రైతులకు 20 వేలు చొప్పున ఈ ఏడాది 47లక్షల మందికి సుమారు 9 వేల కోట్లు జమ చేశారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో 51 వేల మందికి 136 కోట్ల రూపాయలు సాయం అందిందన్నారు. దీపం పథకం ద్వారా 4 కోట్లకు పైగా గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారని.. సుమారు 2 వేల 7వందల కోట్లు ఖర్చు చేశారన్నారు. యువగళం నిధి ద్వారా 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని ఆలోచన ప్రకారం ముందుకెళ్తున్నారన్నారు. సుమారు 23 లక్షల కోట్ల పెట్టుబడులు, 24 లక్షల ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే 6లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించారన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా రెండేళ్లలో 65 లక్షల 50వేల మందికి 63 వేల కోట్లకు పైగా ఖర్చు చేశారన్నారు. ప్రతి నెల మొదటి తేదీనే ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందిస్తుంటే.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెబుతున్నారన్నారు. అయితే కొత్త పింఛన్లు కావాలని చాలా మంది నుంచి విజ్ఞప్తి ఉందని.. వాటిని వెంటనే మంజూరు చేయాలని కోరారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటివరకు 87 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాలు చేశారన్నారు. ఈ పథకం ఉద్దేశ్యం బాగున్నప్పటికీ.. ఒక్కో బస్సులో 60 నుంచి 80 మంది వరకు ప్రయాణిస్తున్నారని.. చాలా మంది డ్రైవర్లు, కండక్టర్లు బస్సులు స్టాపింగులలో నిలపడం లేదన్నారు. సిబ్బంది కూడా ఇబ్బంది పడుతున్నారన్నారు. అందుకే పెరిగిన ప్రయాణాల దృష్ట్యా కొత్త బస్సులు వెంటనే ఇవ్వాలని.. అలాగే సిబ్బందిని కూడా పెంచాలని ఎమ్మెల్యే సునీత కోరారు.

## ఫిషింగ్ హార్బర్ పనులను త్వరితగతిన పూర్తి చేసి మత్స్యకారులకు అందుబాటులోకి తీసుకురావాలి : ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య




చీరాల (చైతన్యరథం): చీరాల నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోని మత్స్యకారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధి, నిర్మాణ పనులపై చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య యాదవ్ అసెంబ్లీలో ప్రశ్నించారు. ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం పూర్తయితే మత్స్యకారులకు చేపల వేట, నిల్వ, రవాణా, మార్కెటింగ్‌కు మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా వారి ఆదాయం మరియు జీవనోపాధి మెరుగుపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. హార్బర్ల నిర్మాణ పనుల్లో ఎటువంటి జాప్యం లేకుండా మిగిలిన పనులను వేగవంతం చేసి, మత్స్యకారులకు పూర్తి స్థాయి మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. చీరాల నియోజకవర్గ మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

## గ్రామాలకు సక్రమంగా తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలి

- ప్రభుత్వాన్ని కోరిన కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



గూడూరు (చైతన్యరథం): ఎల్‌నినో ప్రభావంతో కోడుమూరు నియోజకవర్గంలో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోవడంతో ప్రజలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారని కోడుమూరు శాసనసభ్యులు బొగ్గుల దస్తగిరి అన్నారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా ఆయన నియోజకవర్గంలోని నీటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల ప్రజలకు తాగు నీరు లభించక ఇబ్బందులు పడుతున్నారని, అలాగే వేసిన పంటలను కూడా రైతులు తొలగించాల్సి వస్తోందని సభ దృష్టికి తెచ్చారు. కోడుమూరు నియోజకవర్గానికి సాగు, తాగునీరందించే కేసీ కెనాల్, గాజులదిన్నె ప్రాజెక్టుల ద్వారా వచ్చే నీటి వాటా ఆధారంగా కర్నూలు, కోడుమూరు, కల్లూరు మండలాలలోని గ్రామాలకు సక్రమంగా తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి కారణంగా హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా రాయలసీమకు మునుపెన్నడూ లేని విధంగా ఎక్కువ టీఎంసీల నీటిని విడుదల చేశారన్నారు. దానివల్ల కొంతవరకు నీటి సమస్య తీవ్రత తగ్గినా, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా మెరుగుపరిచేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.




# సేవా సారధి

## ప్రసాద్‌రెడ్డి-శోభారెడ్డి దంపతుల స్ఫూర్తిదాయక దాతృత్వం

**యూఎస్ఏ:** సేవను జీవిత పరమార్థంగా, దాతృత్వాన్ని జీవన విధానంగా మార్చుకున్న ప్రసాద్‌రెడ్డి-శోభారెడ్డి దంపతులు సమాజానికి నిలువెత్తు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. భారతదేశంతో పాటు అమెరికాలోనూ వెనుకబడిన వర్గాల జీవితాల్లో ముఖ్యంగా చిన్నారుల భవిష్యత్తులో ఈ దంపతులు చెరగని ముద్ర వేస్తున్నారు.

**విద్య, పోషకాహార సేవల్లో విశేష కృషి**

**అక్షయపాత్రతో అనుబంధం:** కర్ణాటకలోని బళ్లారి జిల్లాలో విద్యార్థులకు పోషకాహార భోజనం అందించేందుకు రవాణా వాహనాల కొనుగోలుకు 25వేల డాలర్ల విరాళం అందించారు. నెల్లూరు సమీపంలోని వెంకటాచలం వద్ద సుమారు 15వేల మంది విద్యార్థులకు భోజన వసతి కల్పించేలా అక్షయపాత్ర ఫౌండేషన్ చేపట్టనున్న వంటశాల నిర్మాణానికి 2.5 లక్షల డాలర్ల భారీ విరాళాన్ని ప్రకటించారు.

**పాఠశాల విద్యార్థులకు చేయూత:** 'ప్రథమ్' నైపుణ్యాభివృద్ధి కేంద్రాల్లోని ఆర్థికంగా వెనుకబడిన బాలబాలికలకు ఉచితంగా పాదరక్షలు అందించే కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో వీరు ప్రారంభించారు.

**మొబైల్ ఐ సర్జికల్ యూనిట్:** చెన్నైలోని శంకర నేత్రాలయ కోసం 5.5 లక్షల డాలర్ల వ్యయంతో అత్యాధునిక 'మొబైల్ ఐ సర్జికల్ యూనిట్' ఏర్పాటు చేశారు. దీనిద్వారా 500 కిలోమీటర్ల పరిధిలోని మారుమూల గ్రామీణ ప్రాంతాలకు నేత్ర వైద్యం చేరువవుతోంది.

**నేత్ర శిబిరాలు:** శంకర నేత్రాలయ యూఎస్ఏ ఆధ్వర్యంలో జరుగుతున్న నేత్ర శిబిరాలకు నిరంతరం సహకారం అందిస్తున్నారు. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో ఎనిమిది శిబిరాలు నిర్వహించగా తొమ్మిదో శిబిరం త్వరలో తమిళనాడులోని శ్రీపెరుంబుదూర్‌లో జరగనుంది.

**ప్రసాద్ రెడ్డి విశిష్ట ప్రస్థానం, పురస్కారాలు:**


1988 నుంచి శంకర నేత్రాలయ యూఎస్ఏ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రసాద్‌రెడ్డి ప్రస్తుతం దానికి బోర్డు సలహాదారుగా, బ్రాండ్ అంబాసిడర్‌గా సేవలందిస్తున్నారు. 'ట్విస్టెడ్ ఎక్స్' సంస్థకు సీఈవోగా వ్యవహరిస్తూ ఏటా తన లాభాల్లో 13శాతం (సుమారు 20 లక్షల డాలర్లు) సేవా సంస్థలకు విరాళంగా ఇస్తున్నారు. ఈ విశిష్ట సేవలకు గాను న్యూజెర్సీ రాష్ట్రం ఆయన్ను ఘనంగా సత్కరించింది. అంత ేకాకుండా రతన్ టాటా వంటి ప్రముఖులు అందుకున్న ప్రతిష్ఠాత్మక 'శంకరరత్న' పురస్కారం కూడా ప్రసాద్ రెడ్డిని వరించింది. శోభారెడ్డి ప్రోత్సాహం, నిబద్ధత ఈ సేవా ప్రస్థానంలో కీలక శక్తిగా నిలుస్తున్నాయి.

## న్యూయార్క్ అటార్నీ జనరల్ రేసులో

# తెలుగు మహిళ

### రిపబ్లికన్ పార్టీ తరపున అభ్యర్థిగా పోటీ

### మద్దతు ప్రకటించిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**న్యూయార్క్:** అమెరికా రాజకీయాల్లో భారత సంతతికి చెందిన పలువురు కీలక పదవులు అధిరోహిస్తున్నారు. ఈ క్రమంలో న్యూయార్క్ అటార్నీ జనరల్ పదవికి తెలుగు సంతతి మహిళ సరిత కోమటిరెడ్డి పోటీపడుతున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి మద్దతు లభించించడంతో ఆమె డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి లెటిటియా జేమ్స్‌కు గట్టి ప్రత్యర్థిగా మారారు. ఆగస్టు 15న సరితను నామినేట్ చేసిన ట్రంప్ అటార్నీ జనరల్ పోటీలో వున్న జేమ్స్‌పై విమర్శలు గుప్పించారు. విధి నిర్వహణలో జేమ్స్ పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. ట్రంప్ తనకు మద్దతు ఇవ్వడంపై సరిత కృతజ్ఞతలు తెలియజేశారు. 'అధ్యక్షుడు నన్ను నామినేట్ చేయడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను' అని 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

తెలంగాణకు చెందిన సరిత తండ్రి డాక్టర్ హనుమంత్ రెడ్డి కార్డియాలజిస్ట్, తల్లి డాక్టర్ గీతా రెడ్డి రుమాటాలజిస్ట్. 1980ల్లోనే వీరు అమెరికాకు వలస వెళ్లారు. బ్రూక్లిన్‌లో జన్మించిన సరిత మిస్సోరిలో పెరిగారు. హార్వర్డ్ కాలేజ్ అండ్ లా స్కూల్ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా అందుకున్నారు. యూఎస్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్‌లో క్లర్క్‌గా కెరీర్ ప్రారంభించి కొలంబియా లా స్కూల్‌లో లెక్చరర్‌గా, ఆపై ఫెడరల్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సైబర్ నేరాలు, మనీలాండరింగ్, మోసాలు, విదేశీ ప్రభుత్వాల అవినీతి వంటి అనేక సంచలన కేసులను ఆమె విచారించారు. 'డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్' (డీఈఏ)కు చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా కూడా సేవలందించారు. ప్రస్తుతం 'హోల్డ్‌మన్ వోగెల్' న్యాయ సంస్థలో భాగస్వామిగా ఉన్న సరిత.. రిపబ్లికన్ పార్టీ తరపున అటార్నీ జనరల్ పదవికి నామినేషన్ పొందిన తొలి తెలుగు మహిళగా అరుదైన రికార్డు సృష్టించారు. ప్రస్తుతం ఆమె ప్రజా భద్రత అంశాన్నే ఎక్కువగా ప్రచారం చేస్తున్నారు. భారతీయ-అమెరికన్ నేపథ్యం గుర్తించి కూడా ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు.

## ఏఐ యుగంలో

# కాలేజీ చదువులు వృథా

### భారతీయ సంతతి ఎంటర్‌ప్రెన్యూర్ రజత్ సూరి

**కాలిఫోర్నియా:** భారతీయ సంతతి ఎంటర్‌ప్రెన్యూర్ రజత్ సూరి ఆధునిక విద్యపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం నడుస్తున్న ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) యుగంలో సంప్రదాయ కాలేజీ విద్య నిరుపయోగంగా మారుతోందని, తన పిల్లలు కూడా కాలేజీకి వెళ్లకుండా ఉండటమే మేలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఆయన చేసిన ఒక పోస్ట్ తీవ్ర చర్చనీయాంశమైంది. యువతకు అవసరమైన నైపుణ్యాలు, అనుభవాన్ని సంపాదించడానికి కేవలం తరగతి గదుల్లో నేర్చుకునే విద్య సరిపోదని సూరి వాదించారు. తన సొంత అనుభవాన్ని వివరిస్తూ... యూనివర్సిటీ ఆఫ్ వాటర్‌లూలో ఎకనామిక్స్ అండ్ ఇంజనీరింగ్‌లో డబుల్ డిగ్రీ పూర్తి చేసిన అనంతరం ప్రతిష్ఠాత్మక మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)లో పీహెచ్‌డీ/ఎంబీఏ ప్రోగ్రామ్‌లో చేరినట్లు తెలిపారు. అయితే తరగతి గదిలో నేర్చుకున్న దానికంటే వాస్తవ ప్రపంచంలోనే అసలైన పనులు నేర్చుకున్నానని ఆయన స్పష్టం చేశారు. వ్యవస్థాపకతపై దృష్టి సారించాలనే ఉద్దేశ్యంతోనే తాను ఎంఐటీని మధ్యలోనే వదిలేశానని పేర్కొన్నారు.



వాటర్‌లూలో తనకు లభించిన ఆరు వేర్వేరు వర్క్ ప్లేస్‌మెంట్లు వివిధ కంపెనీలు, సంస్కృతులు, మేనేజర్లు, వ్యాపార నమూనాలను పరిచయం చేశాయని రజత్ సూరి తెలిపారు. తాను స్కూల్లో నేర్చుకున్న విషయాల కంటే వాటర్‌లూలోని వర్క్ టర్మ్స్ ద్వారానే ఎక్కువ విషయాలు నేర్చుకున్నానన్నారు. తన కోర్సు వర్క్‌లో నేర్చుకున్న దానికంటే ఆ అనుభవాలే ఎంతో విలువైనవని ఆయన ఉద్ఘాటించారు.

నాలుగేళ్ల పాటు కేవలం తరగతులకు హాజరయ్యే బదులు, యువత నేరుగా వివిధ సంస్థల్లో పని అనుభవం ద్వారా విషయాలు నేర్చుకోవడమే మంచిదని సూరి సూచించారు. ఈ రోజుల్లో తరగతి గదుల కంటే ఏఐ విద్యా నైపుణ్యాలను మరింత సమర్థవంతంగా నేర్పించగలదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. వర్క్‌లైఫ్ ద్వారానే తాను చాలా నేర్చుకున్నానని, అదే తనను ప్రెస్టో, లిఫ్ట్ వంటి కంపెనీలను స్థాపించే స్థాయికి చేర్చిందని రజత్ తెలిపారు. ప్రస్తుతం ఆయన లీమా, ట్రైబ్ చాట్ కంపెనీలకు సహ వ్యవస్థాపకుడిగా వ్యవహరిస్తున్నారు.



# మస్కట్‌లో ఘనంగా 'తీజ్ ఉత్సవ్'

### ఉత్సాహంగా పాల్గొన్న రాజస్థానీ మహిళలు

**మస్కట్:** ఒమన్‌లో ఇండియన్ సోషల్ క్లబ్ రాజస్థానీ విభాగం ఆధ్వర్యంలో 'తీజ్ ఉత్సవ్'ను ఘనంగా నిర్వహించారు. మస్కట్‌లోని ఘూలాలో ఉన్న సెంటారా హోటల్‌లో వేడుకలు జరిగాయి. ఒమన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి రాజస్థానీ మహిళా సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మస్కట్‌తో పాటు బర్కా, సలాలా, సోహార్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రాజస్థానీ సంప్రదాయ దుస్తుల్లో రంగురంగులుగా ముస్తాబై వచ్చిన వారు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ఒకే వేదికపైకి చేరి తమ సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుచేసుకుంటూ ఆత్మీయంగా గడిపారు. 'తీజ్ ఉత్సవ్' ద్వారా రాజస్థానీ సంస్కృతిని, సామాజిక ఐక్యతను చాటిచెప్పినట్టు నిర్వాహకులు తెలిపారు. ఒమన్‌లో నివసిస్తున్న రాజస్థానీ మహిళల మధ్య ఆత్మీయ బంధాన్ని మరింత బలోపేతం చేయడం, రాజస్థాన్ గొప్ప సంప్రదాయాలను కొనసాగిస్తూ సమాజాన్ని మరింత దగ్గర చేయడంలో రాజస్థానీ విభాగం చేస్తున్న కృషికి ఈ వేడుక నిదర్శనంగా నిలిచిందని పేర్కొన్నారు.

# ఢిల్లీలో విద్యార్థులపై దాడి

## విచారణకు ఐదుగురు సభ్యులతో సుప్రీంకోర్టు కమిటీ

న్యూఢిల్లీ: ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఆధ్వర్యంలో గత నెల 20న భారీ నిరసన జరిగిన సంగతి తెలిసిందే. అదికాస్తా హింసాత్మకంగా మారడంతో పలువురు విద్యార్థులతోపాటు భద్రతా సిబ్బంది కూడా గాయపడ్డారు. విద్యార్థుల ఆందోళనను అణచివేయడానికి ప్రభుత్వం అదనపు బలగాల్ని ఉపయోగించిందన్న ఆరోపణలున్నాయి. ఈ అంశంపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై విచారించేందుకు ఐదుగురు సభ్యులతో కూడిన స్వతంత్రకమిటీని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ ఆర్.సుభాష్‌రెడ్డి అధ్యక్షత వహించనుండగా... పంజాబ్-హరియాణా హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ రవి శంకర్ ఝా, ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ షాలిందర్ కౌర్, సీబీఐ మాజీ డైరెక్టర్ రిషి కుమార్ శుక్లా, మేఘాలయ రిటైర్డ్ డీజీపీ డాక్టర్ ఎల్ఆర్ బిష్ణోయ్ సభ్యులుగా ఉంటారు. విద్యార్థుల నిరసన సందర్భంగా వారిపై జరిగిన లాఠీచార్జి, ఎలక్ట్రిక్ బ్యాటన్ల ప్రయోగం, పెల్లెట్ల వినియోగం, టియర్ గ్యాస్ ప్రయోగం వంటి అంశాలపై ఈ కమిటీ విచారణ జరుపుతుంది. సరైన హెచ్చరికలు లేకుండానే విద్యార్థులపై వీటిని ప్రయోగించినట్లు ఆరోపణలున్నాయి. ఇదే సమయంలో నిఘా పేరుతో విద్యార్థుల ప్రైవసీకి భంగం కలిగిందా లేదా అనే



విషయాన్ని కూడా కమిటీ పరిశీలిస్తుంది. నిరసన సందర్భంగా జరిగిన హింస, దాడులు, వేధింపులు, లైంగికపరమైన దాడులపై కూడా విచారణ జరుపుతారు. క్షతగాత్రులకు సరైన వైద్యం అందించారా.. ఆర్థిక సాయం ఏమైనా చేశారా.. అనే అంశాలపై కూడా ఆరా తీస్తుంది. ఇదే సమయంలో పోలీసులు, ఇతర భద్రతా బలగాలపైకి నిరసనకారులు, అసాంఘిక శక్తులు జరిపిన దాడి అంశంపైనా విచారణ జరుపుతుంది. ఆ రోజు చెలరేగిన హింస, ఘర్షణలో జరిగిన పబ్లిక్, ప్రైవేటు ఆస్తుల వివరాలు సేకరణ, దాడుల్లో గాయపడ్డ భద్రతా సిబ్బందికి అందిన సాయంతో పాటు మహిళలపై జరిగిన దాడులు, లైంగిక దాడులపై కూడా విచారణ జరపబోతోంది. ఈ విచారణ కోసం అవసరమైన సీసీటీవీ కెమెరా వీడియోల్ని కమిటీకి అందించాలని సుప్రీంకోర్టు అధికారుల్ని ఆదేశించింది. బాధితుల నుంచి ఫిర్యాదుల్ని కూడా కమిటీ స్వీకరిస్తుంది.

# అది దేశ వ్యతిరేక చర్య

## కాంగ్రెస్‌పై హోం మంత్రి అమిత్ షా మండిపాటు

న్యూఢిల్లీ: వందేమాతరం గేయంపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ వివాదం కొనసాగుతోంది. వందేమాతరంలోని రెండు చరణాలను మాత్రమే పాడుతామని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయం తీసుకోవడంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా మండిపడ్డారు. కాంగ్రెస్ నిర్ణయం దేశ వ్యతిరేక చర్య అని వ్యాఖ్యానించారు. ఆ పార్టీ బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. వందేమాతరం గేయంలోని ఆరు చరణాలు పాడాలి అంటూ కేంద్రం చట్టం చేసిన సంగతి తెలిసిందే. అయితే దీనిపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. వందేమాతరం గేయం విషయంలో 1937లో అప్పటి కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటామని కాంగ్రెస్ ప్రకటించింది. ఈ మేరకు



సీడబ్ల్యూసీ నిర్ణయం తీసుకుంది. కేంద్రం చట్టం చేసినట్లుగా ఆరు చరణాలు పాడబోమని స్పష్టం చేసింది. దీంతో కాంగ్రెస్ పార్టీ నిర్ణయంపై తాజాగా అమిత్ షా మీడియాతో మాట్లాడారు. వందేమాతరం గేయంలోని ఆరు చరణాలు పాడాలి అంటూ పార్లమెంట్ చేసిన చట్టాన్ని కాంగ్రెస్ అవమానించిందన్నారు. కాంగ్రెస్ చేస్తున్న ఈ బుజ్జగింపు రాజకీయాలకు అతీతంగా అందరూ గళమెత్తాలని ఆయన పిలుపునిచ్చారు. రాహుల్ నాయకత్వంలో ఆ పార్టీ బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ నిర్ణయంపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీ, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కూడా మండిపడ్డారు. జాతీయ గేయాన్ని కాంగ్రెస్ అగౌరవపరుస్తోందని, ఇది స్వతంత్రం కోసం పోరాడిన వారి త్యాగాల్ని అవమానించడమే అని వారు వ్యాఖ్యానించారు.

అయితే బీజేపీ విమర్శలపై కాంగ్రెస్ ఎదురుదాడికి దిగింది. స్వాతంత్రోద్యమంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాత్ర ఏమిటని కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేరా ప్రశ్నించారు. జాతీయ నాయకుల్ని బీజేపీ అవమానిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ నిర్ణయాన్ని విమర్శించడమంటే రవీంద్రనాథ్ ఠాగూర్, సుభాష్‌చంద్రబోస్, నెహ్రూ, పటేల్ వంటి నేతల్ని అవమానించడమే అన్నారు.

# ఇన్‌ఫ్లుయెన్సర్లకు బిహార్ ప్రభుత్వం బంపరాఫర్

## రూ.లక్ష వరకు సంపాదించే ఛాన్స్



బిహార్: సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లపై మంచి రీచ్, ఫాలోయింగ్ ఉన్న క్రియేటర్లకు బిహార్ ప్రభుత్వం ప్రభుత్వం బంఫర్ ఆఫర్ ఇచ్చింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై వీడియోలు తీసి వైరల్ చేస్తే దాదాపు లక్ష రూపాయల వరకు నగదు అందుకోవచ్చని ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియా పాలసీలో చేసిన సవరణకు ఆ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పాలసీ కింద కంటెంట్ వ్యూస్ ఆధారంగా ప్రభుత్వం నగదు చెల్లింపులు చేయనుంది. కొత్త విధానం ప్రకారం... ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కంటెంట్ కనీసం లక్ష వ్యూస్ సాధిస్తే రూ. 10వేల వరకు బిహార్ ప్రభుత్వం ఇవ్వనుంది. 10లక్షల వ్యూస్ సంపాదించే కంటెంట్‌కు గరిష్టంగా రూ.లక్ష వరకు చెల్లించనుంది. అయితే వ్యూస్ పది లక్షలకు పైన ఎంత చేరినా ఈ నిబంధన కింద గరిష్ట పరిమితి రూ.లక్ష మాత్రమే ఇస్తారు. ప్రభుత్వం విధించిన నిబంధనలకు అనుగుణంగా ఉన్న వీడియోలకే ఈ ఆఫర్ వర్తిస్తుందని బిహార్ ప్రభుత్వం స్పష్టం చేసింది.

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్, కంటెంట్ నాణ్యత, వీడియో వ్యూస్‌పై అధికారిక ధ్రువీకరణ చేసిన తర్వాత ఈ చెల్లింపులు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ పథకం కోసం సోషల్ మీడియా క్రియేటర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు సమాచార, ప్రజా సంబంధాల విభాగం (ఐపీఆర్డీ)లో పేరు రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. ఐపీఆర్డీ అనుమతి లేకుండా వీడియోలు చేసిన వాటిని ప్రభుత్వం పరిగణలోకి తీసుకోదు. అంతేకాక సంబంధిత వ్యక్తుల సోషల్ మీడియా ఖాతాలు, ఛానెల్ ఫాలోవర్లను నిరంతరం తనిఖీ చేస్తామని బిహార్ ప్రభుత్వం వెల్లడించింది.

# షిర్డీ సాయిబాబాపై అభ్యంతరకర వీడియోలు

### తక్షణం తొలగించాలని ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ: షిర్డీ సాయిబాబాను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ అవుతున్న అభ్యంతరకర, విద్వేషపూరిత వీడియోలను తొలగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు విచారణ చేపట్టింది. సంబంధిత వీడియోలను యూట్యూబ్ నుంచి వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని గ్రీవెన్స్ అప్పీలేట్ కమిటీని న్యాయస్థానం ఆదేశించింది. ఈ అంశంపై తమ స్పందన తెలియజేయాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖతో పాటు గూగుల్, జీపీసీకి నోటీసులు జారీ చేసింది. విద్వేష కంటెంట్ భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తోందని, మత సామరస్యానికి విఘాతం కలిగే ప్రమాదం ఉందని శ్రీసాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ పేర్కొంది. ఈ వివాదాస్పద పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు తదుపరి విచారణను సెప్టెంబరు 7వ తేదీకి వాయిదా వేసింది. ఈలోగా పిటిషనర్ల నుంచి ఏదైనా కొత్త ఫిర్యాదు వస్తే, దాన్ని సంబంధిత కేంద్ర ప్రభుత్వ అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.

### ఆవేశంలో మాట్లాడా...

# నన్ను క్షమించండి

### లడఖ్ 'వీ ఆర్ జెన్ జీ' యువతి



లడఖ్‌లో 'వీ ఆర్ జెన్ జీ' అంటూ భారత సైనికులతో వాగ్వాదానికి దిగి సోషల్ మీడియాలో తీవ్ర విమర్శల పాలైన యువతి తాజాగా బహిరంగ క్షమాపణలు కోరింది. ఆవేశంలో చేసిన అనుచిత వ్యాఖ్యలకు పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ భారత సైన్యం, జమ్మూకశ్మీర్, లడఖ్ పోలీసులకు ఆమె క్షమాపణలు తెలిపింది. సదరు వీడియో వైరల్ అయిన అనంతరం తొలిసారిగా ఓ మీడియా ఛానల్ ఇంటర్వ్యూలో ఆమె ఈ మేరకు స్పందించింది. చరిత్ర పుస్తకాలు, డాక్యుమెంటరీలను అన్వేషించడం కోసం లడఖ్ నుంచి ఢిల్లీకి ప్రయాణిస్తున్న క్రమంలో కార్గిల్ విజయ్ దివస్(జులై 26)ను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వీవీఐపీ భద్రత దృష్ట్యా ద్రాస్ ప్రాంతంలోని మినీమార్గ్ చెక్‌పోస్ట్ వద్ద తమ వాహనాలను నిలిపివేసినట్లు ఆ 25ఏళ్ల యువతి వివరణ ఇచ్చింది. సుమారు ఆరు గంటలపాటు నిరీక్షించాల్సి రావడం, అధికారుల నుంచి సరైన సమాచారం లేకపోవడంతో సహనంకోల్పోయి ఆగ్రహం వ్యక్తంచేశానని తెలిపింది. ఆవేశంలో తాను చేసిన వ్యాఖ్యలు ఏమాత్రం సమర్థనీయం కావని, అదిముమ్మాటికీ తప్పేనని ఆమె అంగీకరించింది. పరిసరాల్లో ఉన్న వ్యక్తులు రెచ్చగొట్టడంతో అప్రయత్నంగానే 'జెన్ జీ'అనే పదం వాడానని, అంతకుమించి తనకు మరే ఇతర ఉద్దేశం లేదని స్పష్టం చేసింది. ఈఘటన తర్వాత సోషల్‌మీడియాలో ఎదురైన ట్రోలింగ్ తనను తీవ్ర మనోవేదనకు గురిచేసిందని, మానసిక ఒత్తిడికి లోనయ్యానని ఆవేదన చెందింది.

# అంత తొందరెందుకు!

### సీబీఎస్ఈ స్కూళ్లలో త్రిభాషా విధానంపై సుప్రీంకోర్టు అభ్యంతరం




న్యూఢిల్లీ: సీబీఎస్ఈ స్కూళ్లలో త్రిభాషా విధానాన్ని అమలు చేస్తూ గతంలో బోర్డు (కేంద్ర ప్రభుత్వం) నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీని ప్రకారం ఇప్పటికే సీబీఎస్ఈ స్కూళ్లలో త్రిభాషా విధానం అమలవుతోంది. అయితే ఈ విధానాన్ని సవాలు చేస్తూ కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అత్యవసరంగా త్రిభాషా విధానం అమలు చేయాల్సిన అవసరం లేదని వారు కోర్టుకు తెలిపారు. దీనిపై విచారణ జరుపుతున్న సుప్రీంకోర్టు సీబీఎస్ఈ బోర్డును, కేంద్రాన్ని ప్రశ్నించింది. త్రిభాషా విధానంపై సమీక్షించాలని సూచించింది. అత్యవసరంగా దీన్ని అమలు చేయాల్సిన అవసరం ఏంటని బోర్డును ప్రశ్నించింది. ఈ అంశంపై పిటిషనర్ అనేక అంశాల్ని లేవనెత్తారు. పిటిషనర్ ప్రకారం.. త్రిభాషా విధానాన్ని అమలు చేసేందుకు అనుగుణంగా అనేకచోట్ల ఇప్పటికీ పుస్తకాలు అందుబాటులో లేవు. భాషా శాస్త్రం బోధించేందుకు తగిన ఉపాధ్యాయులు కూడా లేరు. చాలా పాఠశాలల్లో భాషా బోధన ఇంకా ప్రారంభం కాలేదు. ఒక పక్క పరీక్షలు సమీపిస్తున్నా ఉపాధ్యాయులు, పుస్తకాల కొరత వేధిస్తోంది. పైగా విద్యార్థులు గతంలో అసలు అలవాటులేని భాషను ఇప్పుడు చదవాల్సి వస్తోంది. ఇది వారి విద్యపై దుష్ప్రభావం చూపే అవకాశం ఉంది. దీనిపై ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి బదులిచ్చారు. త్రిభాషా విధానాన్ని అమలు చేసేందుకు ముందుగానే తగిన చర్యలు తీసుకున్నామన్నారు. అవసరమైన మెటీరియల్ కూడా అందజేశామని తెలిపారు. దీంతో స్పందించిన కోర్టు ఈ నిర్ణయం అమలు చేయడాన్ని తాము తప్పుబట్టడం లేదని, అయితే, విద్యార్థుల ఆసక్తి, అవసరాల్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలని సూచించింది.

ఇదే సమయంలో ఆరో తరగతి విద్యార్థులకు త్రిభాషా విధానాన్ని అమలు చేసే అంశంపై పునః సమీక్షించాలని సూచించింది. ఇంగ్లీష్ స్థానిక భాష కాదు అని సీబీఎస్ఈ తీసుకున్న నిర్ణయంపై కూడా సమీక్షిస్తామని చెప్పింది. స్థానిక భాష అంశాన్ని పరిశీలిస్తామంది. మరో పది రోజుల్లో ఈ కేసుపై తదుపరి విచారణ జరుపుతామని చెప్తూ కేసును వాయిదా వేసింది.

## హర్మూజ్ జలసంధిలో

# అమెరికా రహస్య కారిడార్

**రోజుకు కోటి బ్యారెళ్ల చమురు రవాణా!**

వాషింగ్టన్: ఇరాన్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో హర్మూజ్ జలసంధిలో అమెరికా సైన్యం అత్యంత రహస్యంగా ఒక ప్రత్యేక షిప్పింగ్ కారిడార్ నిర్వహిస్తోంది. దీనిద్వారా అంతర్జాతీయ చమురు నౌకలను సురక్షితంగా జలసంధి దాటిస్తున్నట్టు అమెరికా మీడియా సంచలన కథనం ప్రచురించింది. ఇరాన్‌తో చర్చలకు/శాంతి విరమణకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిరాకరించిన నేపథ్యంలో ఈ రహస్య ఆపరేషన్ వెలుగులోకి రావడం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

**రహస్య కారిడార్ ఎలా పనిచేస్తోంది?**

గత కొన్ని వారాలుగా అమెరికా దళాలు ప్రతిరోజూ రాత్రి సమయంలో 15 నుంచి 20 వరకు ట్యాంకర్లను రహస్యంగా, సురక్షితంగా హర్మూజ్ జలసంధి దాటిస్తున్నాయి. ఒమన్ తీరానికి సమీపంలో ఉన్న దక్షిణ ఛానెల్ మార్గాన్ని ఇందుకోసం వినియోగిస్తున్నారు. ఈ ప్రత్యేక మార్గం ద్వారా ప్రస్తుతం రోజుకు కనీసం కోటి (10 మిలియన్) బ్యారెళ్ల చమురు ప్రపంచ మార్కెట్లకు అందుబాటులోకి వస్తోంది. ఇది యుద్ధానికి ముందు సరఫరా అయ్యే మొత్తం చమురులో సగానికి సమానం. కేవలం చమురు మోసుకెళ్లే నౌకలకే కాకుండా, ఖాళీ ట్యాంకర్లు తిరిగి గల్ఫ్ దేశాల రేవులకు వెళ్లి చమురు నింపుకుని రావడానికి కూడా అమెరికా సైన్యం రక్షణ కల్పిస్తోంది. ఈ సైనిక ఆపరేషన్



మొత్తాన్ని ఉత్తర కరోలినాలోని ఫోర్ట్ బ్రాగ్‌లో ఉన్న 'అమెరికా టాస్క్ ఫోర్స్' సమన్వయం చేస్తోంది. దీనికి గల్ఫ్ దేశాల నుంచి పూర్తి సహకారం లభిస్తుండగా నిర్దేశిత సమయానుగుణంగా ట్యాంకర్ల కాన్వాయ్‌లు కదులుతున్నాయి.

**ఇరాన్ రాడార్ వ్యవస్థల ధ్వంసం:**

ఇటీవల రెండు వారాల పాటు నిర్వహించిన విమాన దాడుల్లో ఇరాన్‌కు చెందిన సముద్ర రాడార్, నిఘా వ్యవస్థలను అమెరికా సెంట్రల్ కమాండ్ దారుణంగా దెబ్బతీసింది. దీనివల్ల ఒమన్‌వైపు సముద్రంలో నౌకల కదలికలపై కన్నుసారించే ఇరాన్ సామర్థ్యం తీవ్రంగా తగ్గిపోయింది. తాజా పరిస్థితుల్లో చమురు నౌకలపై డ్రోన్, క్షిపణి దాడులు జరగకుండా నిరోధించేందుకు అమెరికా వాయుసేన ఫైటర్ జెట్లు నిరంతరం ఆకాశంలో రక్షణగా పహారా కాస్తున్నాయి.

మరోవైపు... హర్మూజ్ జలసంధిపై ఇరాన్ తన ఆధిక్యతను 80 శాతం వరకు కోల్పోయిందని అమెరికా మీడియా కథనాలు పేర్కొన్నాయి. గడిచిన రెండు వారాలుగా ఒమన్ మార్గం ద్వారానే 80 శాతానికి పైగా నౌకలు హర్మూజ్ దాటాయని షిప్ ట్రాకింగ్ సంస్థ 'కేప్లర్' డేటా స్పష్టం చేస్తోంది.

## ఉత్తర కొరియా వద్ద 57 అణ్వాయుధాలు

# ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

వాషింగ్టన్: ఉత్తర కొరియా వద్ద అత్యంత శక్తివంతమైన 57 అణ్వాయుధాలు ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది చివర్లో ఆ దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో ప్రత్యక్షంగా భేటీ అయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. వైట్‌హౌస్ వద్ద విలేకరులతో మాట్లాడిన ట్రంప్... కిమ్‌తో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని, ఇద్దరి మధ్య సద్భావన కొనసాగడం ప్రపంచానికి ఎంతో మంచిదని పేర్కొన్నారు.

ట్రంప్ వ్యాఖ్యల ప్రకారం... ఉత్తర కొరియా అణ్వాయుధాలు సమకూర్చుకోకుండా గత పాలకులు అడ్డుకోవాల్సిందని, తాను అప్పట్లో అధ్యక్షుడిగా ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని తెలిపారు. అయినప్పటికీ ప్రస్తుతం కిమ్‌తో తనకు ఉన్న మంచి సంబంధాల కారణంగా పరిస్థితులు అదుపులోనే ఉంటాయన్నారు. మరోవైపు, ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలు దక్కించుకోకుండా అడ్డుకుంటానని ఆయన స్పష్టం చేశారు. ఉత్తర కొరియా వైపు ట్రంప్ సానుకూల సంకేతాలు పంపుతూ, దక్షిణ కొరియాతో సంయుక్తంగా చేపట్టే సైనిక విన్యాసాలను కుదించాలని రక్షణ శాఖను ఆదేశించారు. కిమ్‌తో సత్సంబంధాలు చూపించి విదేశాంగ విధాన విజయాన్ని సాధించేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. అయితే ట్రంప్ ఆశలపై కిమ్ జోంగ్ ఉన్ సోదరి కిమ్ యో జోంగ్ నీళ్లు చల్లారు. తమ నాయకుడితో సంప్రదింపుల్లో ఉన్నానని ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ... అలాంటి సమాచారమేదీ తనకు తెలియదని



తేల్చి చెప్పారు. అంతే కాకుండా దక్షిణ కొరియాతో విన్యాసాల పరిమాణాన్ని తగ్గించడం వల్ల అమెరికా వైఖరిలో మార్పు వచ్చినట్లు భావించలేమని ఎద్దేవా చేశారు.

**దక్షిణ కొరియా విముఖత-ఒంటరి అయిన ట్రంప్**

ఇరాన్ వ్యవహారంలో అమెరికాకు సైనిక మద్దతు ఇవ్వడానికి మిత్రదేశం దక్షిణ కొరియా విముఖత వ్యక్తం చేయడంతోనే, ట్రంప్ ఉత్తర కొరియా నేతను పొగడటం మొదలుపెట్టారని విశ్లేషణలు వస్తున్నాయి. ఈ కోపంతోనే దక్షిణ కొరియాతో ఉమ్మడి సైనిక విన్యాసాలను గణనీయంగా తగ్గించాలని ట్రంప్ నిర్ణయించినట్లు వార్తలు వెలువడుతున్నాయి.

# కెన్యాలో కుప్పకూలిన హెలికాప్టర్

**ఈక్వెడార్ ఇంటెలిజెన్స్ చీఫ్ సహా ఏడుగురి దుర్మరణం**

కెన్యాలోని సంబురు కౌంటీలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ఈక్వెడార్ ఇంటెలిజెన్స్ చీఫ్ మిచెల్ సెన్సి-కాంటుగి, ఆయన భార్య స్టెఫానీ హోలిహాన్ సహా ఒక అమెరికన్ మీడియా ఎగ్జిక్యూటివ్, నలుగురు ఇతర అమెరికన్లు... మొత్తం ఏడుగురు దుర్మరణం చెందారు. లోయిసాబాలోని ఒక వన్యప్రాణి సంరక్షణ కేంద్రం నుంచి ఇవాసో నైరో నదికి హెలికాప్టర్‌లో విహారయాత్రకు వెళ్తుండగా ఉదయం 9:13 గంటలకు ఈ ప్రమాదం సంభవించిందని కెన్యా పౌర విమానయాన అథారిటీ తెలిపింది. ఈ దుర్ఘటనలో మిచెల్ సెన్సి-కాంటుగి మరణించినట్టు ఈక్వెడార్ మాజీ అధ్యక్షుడు గిల్లెర్మో లాసో వెల్లడించారు. ఇంటెలిజెన్స్ చీఫ్ మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం తరపున అధ్యక్షుడి కార్యాలయం నివాళులర్పించింది. అమెరికా మీడియా కథనం ప్రకారం ఈ ప్రమాదంలో



మరణించిన అమెరికన్లలో మయామి రెస్టారెంట్ యజమాని రోజర్ డువార్టే కూడా ఉన్నారు.

## బంగ్లాదేశ్ నూతన అధ్యక్షుడిగా మీర్జా ఫఖ్రుల్



ఢాకా: బంగ్లాదేశ్ 23వ నూతన అధ్యక్షుడిగా బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) సీనియర్ నేత, మాజీ సెక్రటరీ జనరల్ మీర్జా ఫఖ్రుల్ ఇస్లామ్ అలంగీర్ (78) ఎన్నికయ్యారు. పార్లమెంట్‌లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఆయనకు 255 మంది పార్లమెంటు సభ్యుల మద్దతు లభించినట్టు బంగ్లాదేశ్ ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించింది. శుక్రవారం ఆయన నూతన అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. దాదాపు 35 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత బంగ్లాదేశ్‌లో అధ్యక్ష పదవికి ఒకరి కంటే ఎక్కువ అభ్యర్థులు పోటీపడి ఎన్నికలు జరగడం గమనార్హం.

ఓటింగ్ వివరాలు: అధ్యక్ష ఎన్నికల్లో భాగంగా పార్లమెంట్‌లో మొత్తం 349 మంది సభ్యులు నమోదు చేసుకోగా అందులో 343 మంది ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆరుగురు ఎంపీలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. విపక్ష 11 పార్టీల కూటమి అభ్యర్థి, లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ) చైర్మన్ రిటైర్డ్ కర్నల్ ఓలి అహ్మద్‌కు 88 ఓట్లు లభించాయి.

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు అత్యంత సన్నిహితుడిగా పేరున్న మాజీ అధ్యక్షుడు ముహమ్మద్ షాబుద్దీన్ ఇటీవల తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఐదేళ్ల పదవీకాలం పూర్తి కాకుండానే ఆరోగ్య సమస్యలను కారణాలుగా చూపుతూ ఆయన తన బాధ్యతల నుంచి వైదొలిగారు. ఆయన రాజీనామాతో ఖాళీ అయిన ఈ స్థానానికి పార్లమెంట్ ద్వారా కొత్త అధ్యక్షుడిని ఎన్నుకున్నారు.

## అమెరికా చర్య 'ఆర్థిక ఉగ్రవాదం'

**ఇరాన్ విదేశాంగ మంత్రి**



టెహ్రాన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ దేశంపై ఆర్థిక యుద్ధం ప్రకటించడాన్ని ఇరాన్ తీవ్రంగా ఖండించింది. అమెరికాలో భారీగా పెరిగిపోతున్న రుణ భారం, విపరీతంగా పెరుగుతున్న వడ్డీ ఖర్చుల వంటి తీవ్రమైన స్వదేశీ ఆర్థిక సంక్షోభాల నుంచి ప్రపంచం దృష్టిని మరల్చేందుకే ట్రంప్ ఈ రకమైన చర్యలకు దిగుతున్నారని ఆరోపించింది. విఫలమైన ఆర్థిక విధానాలను కొనసాగించడం వల్ల అమెరికాకు మళ్లీ ఓటమి ఖాయమని, పైగా ఇరాన్ ప్రజల తీవ్ర శత్రుత్వాన్ని మూటగట్టుకోవడం తప్ప సాధించేదేమీ ఉండదని స్పష్టం చేసింది.

అమెరికా అనుసరిస్తున్న తీరును 'ఆర్థిక ఉగ్రవాదం'గా అభివర్ణించిన ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, దేశాల సార్వభౌమాధికారానికి తీవ్ర ముప్పు అని సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పేర్కొన్నారు. అమెరికా జాతీయ అప్పు రికార్డు స్థాయిలో 40 ట్రిలియన్ డాలర్లకు చేరుకుందనే అంతర్జాతీయ మీడియా నివేదికలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. అమెరికాలో ఆర్థిక క్రమశిక్షణను పునరుద్ధరిస్తానని డొనాల్డ్ ట్రంప్ హామీ ఇచ్చినప్పటికీ ఆయన అనుసరించిన తప్పుడు నిర్ణయాలు దేశ రుణ భారాన్ని మరింత పెంచాయని ఎద్దేవా చేశారు.

ట్రంప్ హెచ్చరికలు: ఇరాన్‌ను ఆర్థికంగా దెబ్బతీసి పూర్తిగా ఒంటరిని చేయడమే లక్ష్యంగా 'ఆర్థిక డి-డే' పేరుతో అత్యంత తీవ్రమైన చర్యలు తీసుకోనున్నట్టు ట్రంప్ 'ట్రూత్ సోషల్' వేదికగా సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌కు ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ సహాయం చేసే ఇతర దేశాలు కూడా తీవ్రమైన ఆర్థిక పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధం కలిగి ఉండకుండా అడ్డుకోవడానికి మిత్రదేశాలన్నీ అమెరికాతో కలిసి నిలబడాలని పిలుపునిచ్చారు.

ఇరాన్ కౌంటర్: ట్రంప్ బెదిరింపులకు భయపడేది లేదని, అమెరికా సొంత సంక్షోభాలను కప్పిపుచ్చుకోవడానికే ఇటువంటి దాడుల ప్రకటనలు చేస్తోందని ఇరాన్ కొట్టిపారేసింది.

## శ్రీలంకతో రెండో టెస్టు ఆల్‌రౌండర్ సారాంశ్ జైన్ అరంగేట్రం!



కొలంబో: భారత్, శ్రీలంక జట్ల మధ్య ఈ నెల 23న ప్రారంభం కానున్న రెండో టెస్టు మ్యాచ్‌కు భారత తుది జట్టులో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. గాలెలో జరిగిన తొలి టెస్టులో విజయం సాధించి మంచి ఊపుమీదున్న టీమిండియా ఈ మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని పట్టుదలతో ఉంది. ఈ క్రమంలో తొలిసారి జాతీయ టెస్టు జట్టులోకి ఎంపికైన మధ్యప్రదేశ్ ఆల్‌రౌండర్ సారాంశ్ జైన్ కొలంబో వేదికగా జరిగే రెండో టెస్టు ద్వారా అంతర్జాతీయ అరంగేట్రం చేయడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.

**కుల్దీప్ స్థానానికి గండి?**

శ్రీలంక తుది జట్టులో ఎక్కువ మంది ఎడమ చేతి వాటం (లెఫ్ట్ హ్యాండ్) బ్యాటర్లు ఉన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆఫ్ స్పిన్నర్ అయిన సారాంశ్ జైన్‌ను తుది జట్టులోకి తీసుకోవాలని టీమ్ మేనేజ్‌మెంట్ యోచిస్తోంది. అతడికి అవకాశం కల్పిస్తే గాలె టెస్టులో 25 ఓవర్లు వేసి కేవలం ఒక్క వికెట్ మాత్రమే తీసిన ఎడమ చేతి వాటం స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌పై వేటు పడటం ఖాయంగా కనిపిస్తోంది. మరోవైపు మానవ్ సుతార్, రవీంద్ర జడేజా తొలి టెస్టులో రాణించడంతో వారిద్దరి స్థానాలకు ఎలాంటి ముప్పు లేదు.

**11 ఏళ్ల నిరీక్షణకు ఫలితం**

మధ్యప్రదేశ్‌కు చెందిన 31 ఏళ్ల వెటరన్ స్పిన్నర్ సారాంశ్ జైన్ రెడ్‌బాల్ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చి దాదాపు 11 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత భారత జట్టు నుంచి పిలుపు అందుకున్నాడు. ఇటీవల శ్రీలంక పర్యటనకు వెళ్లిన ఇండియా-'ఎ' జట్టు తరఫున రెండో అనధికారిక టెస్టులో ఆరు వికెట్లు పడగొట్టడమే కాకుండా బ్యాటింగ్‌లోనూ మొదటి ఇన్నింగ్స్‌లో 70 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతడి ప్రస్తుత ఫామ్ దృష్ట్యా రెండో టెస్టులో తుది జట్టులో చోటు దక్కించుకునే బలమైన అవకాశాలున్నాయి.

# జడేజా అటాకింగ్ స్పిన్నర్ కాదు

**రవిచంద్రన్ అశ్విన్ వ్యాఖ్యలు**



కొలంబో: భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా బౌలింగ్ పాత్రలో మార్పు వచ్చిందని, ఆయన ఇప్పుడు ప్రాథమికంగా వికెట్లు తీసే అటాకింగ్ స్పిన్నర్ కాదని టీమిండియా మాజీ దిగ్గజ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డారు. గాలె వేదికగా శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో భారత్ భారీ విజయం సాధించిన అనంతరం తన యూట్యూబ్ ఛానెల్‌లో అశ్విన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం జడేజా మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా కీలక పాత్ర పోషిస్తూ బౌలింగ్‌లో తన సీనియారిటీ, సుదీర్ఘ అనుభవంతో జట్టుకు అవసరమైన నియంత్రణను అందిస్తున్నారని తెలిపారు. గాలె టెస్టులో యంగ్ ఆల్‌రౌండర్ మానవ్ సుతార్ ఏకంగా 10 వికెట్లు తీసి అదరగొట్టగా, జడేజా 4 వికెట్లు పడగొట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

జడేజా, మానవ్ సుతార్ ఇద్దరూ పూర్తిగా వేర్వేరు బౌలర్లు. సుతార్ బంతిపై తిరుగుడు (రొటేషన్) సాధించి తిప్పడంలో దిట్ట కాగా జడేజా వికెట్ల ఆధారంగా స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకుని బంతిని సంధిస్తూ పరుగులను కట్టడి చేస్తారు. జడేజా ప్రధాన స్పిన్నర్‌గా కాకుండా బ్యాటర్‌గా జట్టుకు తోడ్పడుతూ బౌలింగ్‌లో అనుభవాన్ని అందిస్తున్నారు. ఇది జట్టుకు మంచి పరిణామమే. గత టెస్టుతో పాటు ఈ టెస్టులోనూ మానవ్ సుతార్ అద్భుతంగా రాణించాడు. బ్యాటర్ల మానసిక స్థితికి అనుగుణంగా ఫీల్డింగ్ అమర్చుకుని వికెట్లు తీయడంలో మంచి నైపుణ్యం ప్రదర్శించాడు. టీమ్‌ఇండియా స్పిన్ రంగానికి అతడు చాలా కీలకమైన ఆటగాడు.

## పాకిస్తాన్‌కు ఊరట

**- గడాఫీ స్టేడియంపై డీమెరిట్ పాయింట్ ఎత్తివేసిన ఐసీసీ**

పాకిస్తాన్ క్రికెట్ బోర్డుకు ఐసీసీ నుంచి ఊరట లభించింది. లాహోర్‌లోని గడాఫీ స్టేడియం పిచ్‌పై విధించిన డీమెరిట్ పాయింట్‌ను ఐసీసీ అప్పీల్స్ ప్యానెల్ గురువారం రద్దు చేసింది. జూన్ 4న పాకిస్తాన్-ఆస్ట్రేలియా మధ్య జరిగిన మూడో వన్డేలో గడాఫీ స్టేడియం పిచ్‌కు మ్యాచ్ రిఫరీ 'అసంతృప్తికరం' రేటింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఐసీసీ పిచ్ అండ్ అవుట్ ఫీల్డ్ మానిటరింగ్ ప్రక్రియ కింద స్టేడియానికి ఒక డీమెరిట్ పాయింట్ విధించారు. దీనిపై పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అప్పీల్ చేయడంతో ఐసీసీ అప్పీల్స్ ప్యానెల్ మ్యాచ్ వీడియో ఫుటేజ్, మ్యాచ్ రిఫరీ నివేదిక, ఇరు జట్ల కెప్టెన్ల అధికారిక వ్యాఖ్యలను పరిశీలించింది. విచారణ అనంతరం మ్యాచ్ రిఫరీ మార్గదర్శకాలను సరిగ్గానే అనుసరించారని ప్యానెల్ పేర్కొంది. అయితే పిచ్ 'అసంతృప్తికరం'గా రేటింగ్ ఇవ్వాల్సిన స్థాయిలో లేదని తేల్చింది. పిచ్‌లో అధిక అసమానతలు, అతిగా స్పిన్ లభించినట్లు ఆధారాలు కనిపించలేదని స్పష్టం చేసింది. దీంతో గడాఫీ స్టేడియంపై విధించిన డీమెరిట్ పాయింట్‌ను రద్దు చేసింది.

**కెనడా స్టేడియానికీ ఊరట... కానీ!**

కెనడాకు చెందిన మ్యాపుల్ లీఫ్ క్రికెట్ గ్రౌండ్‌కు సంబంధించిన రెండు అప్పీళ్లను కూడా ఐసీసీ అప్పీల్స్ ప్యానెల్ పరిశీలించింది. జూన్ 8న అమెరికా-నెదర్లాండ్స్ మధ్య జరిగిన ఐసీసీ పురుషుల ప్రపంచకప్ లీగ్-2 మ్యాచ్‌లో ఈ మైదానం పిచ్‌కు 'అసంతృప్తికరం' రేటింగ్ వచ్చింది. అయితే ఈ పిచ్ సాధారణ ప్రమాణాలకు అనుగుణంగానే ఉందని ప్యానెల్ గుర్తించింది. అధిక అసమానతలు, సీమ్ కదలిక లేదా అధిక స్పిన్ కనిపించలేదని పేర్కొంటూ ఆ మ్యాచ్‌కు సంబంధించిన డీమెరిట్ పాయింట్‌ను కూడా ఉపసంహరించింది. అయితే జూన్ 16న కెనడా-నెదర్లాండ్స్ మ్యాచ్ సందర్భంగా పిచ్‌కు 'అన్‌ఫిట్' రేటింగ్ ఇచ్చి విధించిన మూడు డీమెరిట్ పాయింట్లు మాత్రం కొనసాగనున్నాయి. ఆ మ్యాచ్‌లో పిచ్ పరిస్థితులు ప్రమాదకరంగా ఉన్నాయని, అందువల్ల 'అన్‌ఫిట్' రేటింగ్ సరైనదేనని అప్పీల్స్ ప్యానెల్ తేల్చింది.

## భారత అమ్మాయిలు అదరగొట్టారు

**- ఏడో సీడ్‌కు షాక్**

**- చరిత్రాత్మక పతకానికి అడుగుదూరంలో...**



బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత అమ్మాయిలు అదరగొట్టారు. మహిళల డబుల్స్‌లో సంచలన ఆటతో ఏడో సీడ్‌కు గాయత్రి గోపిచంద్, ట్రీసా జాలీ షాకిచ్చారు. గురువారం జరిగిన 16వ రౌండ్‌లో రిన్ ఇవనగా, కీ నకనిషి(జపాన్) ద్వయాన్ని భారత జంట వరస సెట్లలో చిత్తుగా ఓడించింది. దాంతో చరిత్రాత్మక పతకానికి మరొక విజయం దూరంలో నిలిచింది గాయత్రి, జాలీ జోడీ. ఆద్యంతం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో ఫేవరెట్ జపాన్ ద్వయాన్ని అద్భుతంగా నిలువరించింది ట్రీసా-గాయత్రి జోడీ. తొలి సెట్‌ను 21-16తో నెగ్గిన భారత అమ్మాయిలు రెండో సెట్‌లో మరింత రెచ్చిపోయారు. 21-12తో సెట్‌ను గెలిచిన ట్రీసా గాయత్రి మరొక్క విజయం సాధిస్తే పతకం ఒడిసిపట్టడం ఖాయం.

'ఈసారి ఎలాగైనా పతకం గెలవాలని మేము అనుకున్నాం. అయితే అతిగా ఆలోచించకుండా వర్తమానంలోనే ఉంటున్నాం. ఈ విజయాన్ని ఆస్వాదించి.. తదుపరి మ్యాచ్‌పై దృష్టి సారిస్తాం' అని ట్రీసా వెల్లడించింది. తర్వాతి రౌండ్‌లో నాలుగో సీడ్ జియా యీ ఫాన్-ఘాంగ్ షు గ్జియాన్ (చైనా)తో భారత జోడీ తలపడనుంది.

# భారత్ నాకు రెండో ఇల్లు

**ఆస్ట్రేలియా దిగ్గజ ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్**



సిడ్నీ: భారతదేశంతో తనకు ఎంతో బలమైన అనుబంధం ఉందని, అది తనకు 'రెండో ఇల్లు' వంటిదని ఆస్ట్రేలియా మాజీ స్టార్ ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్ వ్యాఖ్యానించారు. సిడ్నీలోని భారత కాన్సులేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఈ వేడుకల్లో భాగం కావడం తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. సొంత దేశం ఆస్ట్రేలియా కంటే భారత్‌లోనే తనకు ఎక్కువ ఆదరణ లభించిందని, 19 ఏళ్ల వయసులో తొలిసారి భారత పర్యటనకు వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు దేశంలో చోటుచేసుకున్న శరవేగమైన అభివృద్ధిని స్వయంగా చూశానని పేర్కొన్నారు. అంతే కాకుండా భారతదేశంలోని రుచికరమైన శాకాహార వంటకాలంటే తనకు ఎంతో ఇష్టమని వెల్లడించారు.

వాట్సన్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు: భారత ప్రజలు తన జీవితం, వృత్తిపై ఎంతో సానుకూల ప్రభావం చూపారని, ఐపీఎల్ ప్రారంభమైన 2008 నుంచి ఈ అనుబంధం మరింత బలపడిందని తెలిపారు. ఆస్ట్రేలియాలో మ్యాచ్ సరిగ్గా ఆడకపోతే తీవ్ర విమర్శలు ఎదురయ్యేవని, కానీ భారత్‌లో ఎప్పుడూ తన ప్రదర్శనను ఆదరించి ప్రోత్సహించారని గుర్తు చేసుకున్నారు. ఆస్ట్రేలియాలో బార్బెక్యూ ఆనందించినప్పటికీ భారత్‌లోని రుచికరమైన వెజిటేరియన్ వంటకాలను ఎంతగానో ఇష్టపడతానని చెప్పారు.

**ఐపీఎల్ రికార్డులు:**

షేన్ వాట్సన్ 2008 నుంచి 2020 వరకు ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, చెన్నై సూపర్ కింగ్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించారు. మొత్తం 145 మ్యాచ్‌ల్లో 4 సెంచరీలు సహా 3,874 పరుగులు చేయడమే కాకుండా, బౌలర్‌గా 92 వికెట్లు తీసి అత్యుత్తమ ఆల్‌రౌండర్‌గా నిలిచారు.

## వయసు వివాదంలో బీసీసీఐ అధ్యక్షుడు

**సెప్టెంబరు 3లోగా నివేదిక ఇవ్వాలని కోర్టు ఆదేశం**



శ్రీనగర్: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధ్యక్షుడు మిథున్ మన్హాస్ చిక్కుల్లో పడ్డారు. జూనియర్ స్థాయి క్రికెట్ సెలక్షన్లలో అర్హత సాధించేందుకు తన పుట్టిన తేదీని మార్చినట్లు (వయసు మార్పిడి) ఆయనపై తీవ్ర ఆరోపణలొచ్చాయి. ఈ వ్యవహారంపై ప్రాథమిక విచారణ జరిపి సెప్టెంబరు 3వ తేదీలోగా సమగ్ర నివేదిక సమర్పించాలని జమ్మూలోని స్థానిక కోర్టు పోలీసులను ఆదేశించింది. మాజీ డీఎస్పీ, జమ్మూకశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ (జేకేసీఏ) మాజీ జాయింట్ గౌరవ కార్యదర్శి సుదర్శన్ మెహతా దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా కోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది.

***రెండూ వేర్వేరు పుట్టిన తేదీలు?***

సబ్-జూనియర్, జూనియర్ విభాగాల్లోని జాతీయ టోర్నమెంట్లలో ఆడేందుకు మిథున్ మన్హాస్ రెండు వేర్వేరు పుట్టిన తేదీలకు సంబంధించిన పత్రాలను సమర్పించారని ఫిర్యాదుదారు ఆరోపించారు. స్కూల్ రికార్డుల్లో ఉన్న తేదీకి,క్రికెట్ అసోసియేషన్ సమర్పించిన వివరాలకు పొంతన లేదని పేర్కొన్నారు.

కెరీర్ నేపథ్యం: ఫస్ట్-క్లాస్ మాజీ క్రికెటర్ అయిన మిథున్ మన్హాస్ స్వరాష్ట్రం జమ్మూకశ్మీర్. సొంత జట్టుతో కెరీర్ ప్రారంభించిన ఆయన ఆ తర్వాత ఢిల్లీ రంజీ జట్టుకు సుదీర్ఘకాలం ప్రాతినిధ్యం వహించారు. క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అనంతరం జమ్మూకశ్మీర్ క్రికెట్ సంఘం పాలకవర్గంలో బాధ్యతలు నిర్వహించారు. భారత సీనియర్ జట్టుకు ఆడకపోయినప్పటికీ క్రికెట్ పరిపాలనలో చురుగ్గా వ్యవహరిస్తూ గతేడాది సెప్టెంబరులో బీసీసీఐ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

శర్వానంద్ 'భోగి' విడుదల వాయిదా

## అసలు కారణం ఇదే!

టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా, మాస్ డైరెక్టర్ సంపత్ నంది దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'. భారీ అంచనాల మధ్య రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని వాస్తవానికి ఆగస్టు 28న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేస్తామని మేకర్స్ గతంలో అధికారికంగా ప్రకటించారు. అయితే తాజాగా చిత్ర యూనిట్ నుంచి వెలువడిన సమాచారం ప్రకారం ఈ సినిమా అనుకున్న సమయానికి ప్రేక్షకుల ముందుకు రావడం లేదు. వీఎఫ్ఎక్స్ పనులకు మరింత సమయం పడుతుండటంతో విడుదలను వాయిదా వేసినట్టు తెలుస్తోంది. సినిమాలోని విజువల్ స్కేల్, పీరియడ్ వరల్డ్, యాక్షన్ సీక్వెన్స్‌లను ఎక్కడా రాజీ పడకుండా అత్యుత్తమంగా తీర్చిదిద్దే ఉద్దేశంతోనే ఈ వాయిదా వేసినట్టు మేకర్స్ తెలిపారు. వీఎఫ్ఎక్స్ పనులు పూర్తిగా పూర్తయిన తర్వాత కొత్త రిలీజ్ డేట్‌ను త్వరలోనే ప్రకటిస్తామని స్పష్టం చేశారు.






## మనసా వాచా...

**'ఎపిక్' నుంచి మెలోడీ సాంగ్ విడుదల**

ఆనంద్ దేవరకొండ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎపిక్: ఫస్ట్ సెమిస్టర్' నుంచి తాజాగా ఒక అద్భుతమైన మెలోడీ సాంగ్ ప్రేక్షకుల ముందుకొచ్చింది. మనసా వాచా... అంటూ సాగే ఈ మ్యూజికల్ ట్రీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటూ దూసుకుపోతోంది.

ప్రముఖ సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ అందించిన మధురమైన బాణీలు ఈ పాటకు ప్రాణం పోశాయి. వినడానికి ఎంతో ప్రశాంతంగా, హృద్యంగా ఉన్న ఈ గీతాన్ని లెజెండరీ సింగర్ కేఎస్ చిత్ర, చరణ్ శ్రీపతి ఎంతో అద్భుతంగా ఆలపించారు. వీరిద్దరి మాయాజాల గళం పాటలోని భావోద్వేగాన్ని మరింత ఎలివేట్ చేయగా, శ్రీహర్ష ఇమాని అందించిన అర్థవంతమైన సాహిత్యం పాటలోని మాధుర్యాన్ని రెట్టింపు చేసింది. ఈ చిత్రంలో ఆనంద్ దేవరకొండ సరసన వైష్ణవి కథా నాయికగా నటిస్తుండగా టాలెంటెడ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 11న గ్రాండ్‌గా విడుదల కానుంది.

## సమాజానికి తప్పుడు సందేశం ఇచ్చే రోల్స్ చేయను

**- నటుడు సిద్ధార్థ్**



ప్రముఖ నటుడు సిద్ధార్థ్ తన వైవిధ్య మైన నటనతో ప్రేక్షకులను ఎప్పుడూ మెప్పిస్తూనే ఉంటారు. తాజాగా ఆయన ప్రధాన పాత్రలో నటించిన 'ఆపరేషన్ సఫేద్ సాగర్' వెబ్ సిరీస్ నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతూ సంచలనం సృష్టిస్తోంది. ఇందులో సిద్ధార్థ్ తన అద్భుతమైన అభినయంతో మరోసారి విమర్శకుల ప్రశంసలు అందుకుంటు న్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు ప్రపంచ వ్యాప్తంగా అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఈ తరుణంలో సినిమాల్లో పాత్రలను ఎంపిక చేసుకునే విషయంలో తాను కచ్చితంగా పాటించే కొన్ని కఠిన మైన నియమ నిబంధనల గురించి సిద్ధార్థ్ తాజాగా పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అవేమిటంటే...

సినిమాల్లో హీరో అంటే కేవలం గ్లామర్ పాత్రలే కాదు నటుడిగా నా పరిధులకు తగినట్టుగానే ప్రాజెక్టులను ఎంచుకుంటాను. ప్రతి సినిమాలోనూ నేనే ప్రధాన హీరోగా నటించాలనే మూస పద్ధతిని ఎప్పుడూ నమ్మలేదు. ఒకవేళ నేనుహీరోగా కనిపించని చిత్రాల్లో నటిస్తే, కేవలం ఒక నటుడిగానే ప్రేక్షకులను అలరిస్తాను. అయితే పూర్తిగా నెగెటివ్ షేడ్స్ ఉన్న ఒక చెడ్డ పాత్రను పోషించి, ఆ వ్యక్తి తప్పులు చేస్తున్నప్పటికీ అతడే గొప్పవాడని, రియల్ హీరో అని ప్రేక్షకు లను భ్రమపెట్టేలా తప్పుదోవ తొక్కించే పాత్రలను నేనెప్పటికీ చేయను. ఒకవేళ అలా చేస్తే అది నా వ్యక్తిగత సిద్ధాంతాల కు విరుద్ధం అవుతుంది.

ఇక సినిమాల్లో ఐటెం సాంగ్స్‌లో నటించడంపై సిద్ధార్థ్ తన వ్యతిరేకతను మరోసారి గట్టిగా వ్యక్తపరిచారు. తన సుదీర్ఘ సినీ ప్రయాణంలో ఇప్పటివరకు ఎప్పుడూ ఐటెం సాంగ్స్‌లో భాగం కాలేదని, భవిష్యత్తులోనూ చేయనని స్పష్టం చేశారు. ఒక మహిళా నటిని నలుగురు పురుషుల మధ్య ఉంచి, ఆమెను కించపరిచేలా లేదా అసభ్యంగా ప్రవర్తించేలా సాగే ప్రత్యేక గీతాలను తాను తీవ్రంగా వ్యతిరేకిస్తానని ఆయన చెప్పుకొచ్చారు. విలన్ పాత్రలు చేయడంపై తనకు ఎలాంటి అభ్యంతరం లేదని సిద్ధార్థ్ స్పష్టం చేశారు.



## బుట్టబొమ్మ... మెరిసెనమ్మ

టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డే గ్లామర్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. సక్సెస్ ఫెయిల్యూర్‌తో సంబంధం లేకుండా వరుస అవకాశాలు అందుకుంటున్న పూజా తన ఫ్యాషన్ సెన్స్‌తో ఫాలోవర్లను ఆకట్టుకుంటూ ఉంటుంది. తాజాగా అమ్మడు రెడ్ కలర్ డిజైనర్ ఛమ్కీల శారీ ధరించి అందులో తన ఎద అందాలను ఎలివేట్ చేస్తూ పెద్ద పెద్ద ఝుంకాలు పెట్టుకుని మరింత స్టైలిష్‌గా కనిపించింది. పూజా ఫోటోలు చూసి నెటిజన్లు లైకుల వర్షం కురిపిస్తూ వాటిని సోషల్ మీడియాలో తెగ వైరల్ చేస్తున్నారు.

## అనుపమ ధైర్యానికి హ్యాట్సాఫ్

**మద్దతుగా నిలిచిన అదితి శంకర్**





కథానాయిక అనుపమ పరమేశ్వరన్ ఇటీవల తన వ్యక్తిగత జీవితం, మాజీ ప్రియుడి వల్ల ఎదుర్కొన్న మానసిక క్లేశం గురించి బయటపెట్టిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై తాజాగా ప్రముఖ దర్శకుడు శంకర్ కుమార్తె, నటి అదితి శంకర్ స్పందిస్తూ అనుపమకు మద్దతు తెలిపారు. అనుపమ చూపిన ధైర్యాన్ని, ఆమె నిజాయితీని ప్రశంసించారు.

తాను నటించిన 'వన్స్‌మోర్' సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో అదితి ఈ విషయమై మాట్లాడారు.

అదితి శంకర్ కామెంట్స్:

"అనుపమ ఇంటర్వ్యూ నేను చూశాను. ఆమె కామెంట్స్‌పై ఒక్కొక్కరికి ఒక్కో అభిప్రాయం ఉండొచ్చు. కానీ తాను ఎదుర్కొన్న ఇబ్బందిని అంత ధైర్యంగా పంచుకున్నందుకు ఆమెకు హ్యాట్సాఫ్ చెప్పాలి. ఆమె మాటల్లో ఎంతో నిజాయితీ ఉంది. ఎవరినీ నిందించడం లేదా కించపరచడం అనుపమ ఉద్దేశం కాదని భావిస్తున్నాను. ఆమె పంచుకున్న అనుభవం చాలామందికి అవగాహన కలిగించేలా ఉంది. చాలా మంది పురుషులు, మహిళలు తీవ్రమైన మానసిక ఘర్షణలతో కూడిన బంధా ల్లో ఉంటూ...తాము ఎలాంటి పరిస్థితు ల్లో ఉన్నామో కూడా అర్థం చేసుకోలేక పోతున్నారు. అనుపమలా ఓపెన్‌గా మాట్లాడటం వల్ల అలాంటి వారికి తమ పరిస్థితిపై ఒక స్పష్టత వస్తుంది."

**అసలు వివాదం ఏమిటంటే?**

మాజీ బాయ్‌ఫ్రెండ్ పేరును ఎక్కడా ప్రస్తావించకుండా అనుపమ తన వ్యక్తిగత జీవితంలో ఎదురైన చేదు అనుభవాలపై ఇటీవల మాట్లాడారు. అతడి ప్రవర్తన వల్ల ఒక నటిగా, మహిళగా తనను తాను నిందించుకునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్ల పాటు ఆ బంధంలో నరకం చూశానని తెలిపారు. ప్రస్తుతం అనుపమ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారగా, అభిమానులు ఆమెకు ధైర్యం చెబుతూ పోస్టులు పెడుతున్నారు.

## సినిమా టికెట్ ధరల జీవోపై ఎగ్జిబిటర్ల తీవ్ర అభ్యంతరం

**సీఎంకు లేఖ రాయాలని నిర్ణయం**

హైదరాబాద్: తెలంగాణలో సినిమా టికెట్ల ధరలను సవరిస్తూ థియేటర్లను వసతుల ఆధారంగా వివిధ కేటగిరీలుగా వర్గీకరిస్తూ హోం శాఖ జారీ చేసిన జీవో నెం.77పై థియేటర్ల యాజమాన్యాలు (ఎగ్జిబిటర్లు) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ జీవోపై త్వరలోనే ముఖ్యమంత్రికి లేఖ రాయాలని తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ నిర్ణయించింది. ప్రభుత్వం స్పందించడానికి పది రోజులు గడువు ఇచ్చి ఆ తర్వాత కోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించింది.

**జీవో 77ను పునః సమీక్షించాలి: ఫిల్మ్ ఛాంబర్**

మరోవైపు సినిమా థియేటర్ల టికెట్ ధరలు, వర్గీకరణ విధానంపై ప్రభుత్వం పునః సమీక్ష చేయాలని తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖ రాసింది. టికెట్ ధరల నిర్ణయంలో ఎగ్జిబిటర్లు, నిర్మాతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని, సంబంధిత భాగస్వాములతో విస్తృత సంప్రదింపులు జరపాలని కోరింది.

ఫిల్మ్ ఛాంబర్ కోరిన ముఖ్యాంశాలు: కొత్తగా తీసుకొచ్చిన 'స్పెషల్ థియేటర్' వర్గీకరణ, కొత్త ధరల విధానం వల్ల చిన్న పట్టణాలు, సెమీ అర్బన్ ప్రాంతాల్లోని టౌన్ థియేటర్లు, సింగిల్ స్క్రీన్ల మనుగడ దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. సినీ రంగానికి ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సినీ ప్రతినిధులతో ప్రత్యేకంగా 'కన్సల్టేటివ్ కమిటీ'ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసింది. జీవో నెం. 77 నిబంధనలను సవరించి పరిశ్రమ ప్రయోజనాలు కాపాడేలా తగిన నిర్ణయం తీసుకోవాలని కోరింది.



## బాలీవుడ్‌కి భాగ్యశ్రీ!

దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనదైన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ నటి భాగ్యశ్రీ బోర్సే బాలీవుడ్‌లో జాక్‌పాట్ కొట్టింది. 'ఆషికీ 2' ఫేమ్ ఆదిత్యరాయ్ కపూర్ సరసన ఆమె కథానాయికగా నటించేందుకు రంగం సిద్ధమైంది. బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు మిలప్ జవేరి తెరకెక్కించనున్న ఈ క్రేజీ ప్రాజెక్టుకు సంబంధించిన వివ రాలు ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ టి-సిరీస్ పతాకంపై ప్రముఖ నిర్మాత భూషణ్‌కుమార్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. గత నెల లో అధికారికంగా ప్రకటించిన ఈ చిత్రం పూర్తిస్థాయి ఇంటెన్స్, వయొలెంట్ అండ్ మ్యూజికల్ లవ్‌స్టోరీగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆదిత్య రాయ్‌కపూర్ ఎమోషనల్ అండ్ లేయర్డ్ ఉన్న వైవిధ్యమైన పాత్రలో కనిపించను న్నారు. కథా నాయికగా భాగ్యశ్రీ బోర్సేను ఖరారు చేశారని, త్వరలోనే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమై 2027లో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. భాగ్యశ్రీ సినీ కెరీర్‌లో ఈ ప్రాజెక్ట్ ఒక బిగ్గెస్ట్ టర్నింగ్ పాయింట్ అనే చెప్పాలి. త్వరలోనే చిత్ర యూనిట్ నుంచి దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

